ఉషశ్రీ ఉపన్యాసాలు

రామాయణ భారతాలు

ఉషశ్రీ

ఉషశ్రీ ఉపన్యాసాలు

రామాయణ భారతాలు

ప్రచురణ :
ఉషశ్రీ మిషన్

ఉషశ్రీ ఉపన్యాసాలు

రామాయణ భారతాలు

ఉషశ్రీ

ప్రచురణ : సెప్టెంబర్ 2015

కవర్ డిజైన్ : వరప్రసాద్

ప్రతులకు :

ఉషశ్రీ మిషన్, విజయవాడ

8008551231, 9848113681, 9912477763

హైదరాబాద్ - 80085 99901

విశాలాంధ్ర, నవోదయ, కినిగె.కామ్

ముద్రణ :

శ్రీశ్రీ ప్రింటర్స్,

విజయవాడ - 2

సెల్ : 9490634849

వెల : 50/-

ఉషశ్రీ ఉపన్యాసాలు

రామాయణ విశేషాలు	5
భారత విశేషాలు	69

రామాయణ విశేషాలు

నమోస్తు రామాయ సలక్ష్మణాయ
దేవ్యైచ తస్యై జనకాత్మజాయై
నమోస్తు రుద్రేంద్ర యమానిలేభ్యో
నమోస్తు చంద్రార్క మరుద్గణేభ్యః॥

సీతారాముల కథ వినాలనీ, వాల్మీకి రామాయణం చదువుకోవాలనీ, శ్రీమద్రామాయణం వినిపించాలనీ వాంఛించేవారు ఈ దేశంలోనే కాదు దేశదేశాలలో వున్నారు. ఆధునిక నాగరక యుగంలో చదువుకోగలిగిన వారికంటె చదివించుకు వినాలనేవారి సంఖ్య అపరిమితంగా వున్నది. అది యీనాడు కాదు రామాయణం పుట్టిన నాడే అలా వుండేది. సీతారాముల గాథను వాల్మీకి మునిచంద్రుడు కుశలవుల చేత గానం చేయించి లోకానికి అందించాడు.

వేల సంవత్సరాల క్రితం మాట అది, లక్షల శరత్తుల నాటి గాథ అది.

❊ ❊ ❊

అయినా యిది జరిగిందా?

వాల్మీకి గుండెలో పుట్టిందా?

అని ప్రశ్నించే వారి సంఖ్య చిరకాలంగా వస్తూనే ఉంది.

జరిగిన గాథ వాల్మీకి మనసులో నుండి గుండెతో కలిసి ఈ రూపంలో మానవజాతికి అందింది – అనుకోవడానికి అందరూ సంతోషంతో అంగీకరిస్తారు.

❊ ❊ ❊

రామాయణం జరగలేదు – అనేవారిని నిలబెట్టి “బాబూ, తమరు రామాయణం

చదివారా? తెలిసిన వారి దగ్గర వినయంగా కూర్చుని చదివించుకు తెలుసుకున్నారా? ఈ రెండూ కాకుండా ఏ హరికథలో, నాటకాలో, సినిమాలో విని, చూసి యీ సందేహంతో మనస్సు పాడు చేసుకుని బాధపడుతున్నారా?" అనేది మనం అడగవలసిన రెండవప్రశ్న.

అంతతో ఆగకుండా, రామాయణం జరిగిందా అని అడుగుతున్నావే, జరిగింది అని నేనంటే నమ్మగలవా?

ఏనాటి మాట - రామాయణ కథ!

త్రేతాయుగం నాటి గాథ. ఆ కథ జరుగుతూంటే చూసి, కలియుగంలో యింతవరకూ బ్రతికి వుంటాడా, ఎవడయినా? అయినా జరిగిందా, నువ్వు చూశావా? అని ప్రత్యక్ష ప్రమాణాన్ని తప్ప విశ్వసించలేని కుహనా మేధావులకు ఏం చెప్పగలం.

❊ ❊ ❊

నిస్సందేహంగా రామకథ జరిగింది.

జరగడం కాదు, నేటికీ రామాయణం జరుగుతూనే వుంది, జరుగుతుంది. కనకనే రామాయణం వింటున్నారు, చదువుతున్నారు, అనువాదాలు చేసుకుని దేశదేశాల వారు సంతోషిస్తున్నారు. నృత్యరూపకాలుగా, చలనచిత్రాలుగా ప్రదర్శించి ప్రమోదం కలిగిస్తున్నారు.

రామాయణం యీనాటికీ జరుగుతున్నది. అంటున్నానే, అది కొంచెం అతితెలివిగా కనిపిస్తున్నది - అనవచ్చు.

కొంచెం ఓరిమి వుంటే ఆ విశేషాలు విశదం అవుతాయి.

❊ ❊ ❊

అసలు రామాయణం అంతా ఏవిటి -

అనగా అనగా దశరథుడు అనే రాజు అయోధ్యానగరం రాజధానిగా కోసల రాజ్యాన్ని పాలిస్తున్నాడు.

ఆయనకు ముగ్గురు భార్యలు.

భార్యలు ముగ్గురున్నా సంతానం లేదు.

సంతానం లేని బాధ ఆయన గుండెలను పిండుతున్నది.- సిరిసంపదలు, భోగ భాగ్యాలు, సామ్రాజ్యాధిపత్యం, చతురంగబలాల సేనలు ఎన్ని వున్నా సంతానం లేని బాధ ఆయనను వదలలేదు.

ఇదీ రామకథా ప్రారంభం.

అంటే దీని భావం ఏమిటి!

సాంసారిక జీవితం సాగించేవారికి సంతానం అవసరం. అదే దాంపత్య బంధాన్ని మరింత బలవత్తరం చేస్తుంది; అందుకే "ఆనందగ్రంధి రేకోమం అపత్య మితి కధ్యతే" అన్నారు మహనీయులు.

నిరంతరం ఒకరినొకరు చూసుకుంటూ కూర్చుంటే జీవితం విసుగెత్తిపోయి, విషాదమయం అవుతుంది, భార్యా భర్తల బ్రతుకు.

దాని నుంచి తప్పించుకుందుకే సంతానం. దాంపత్యజీవిత లక్ష్యం. అదే పరలోకం కోసం జరిగే ఉత్తర కర్మలకే కాదు, ఇహలోకంలో కూడా సంతోషం కలిగించడానికీ, సేవలు చెయ్యడానికీ పిల్లలు కావాలి. ఆ విధంగా ఇహపరాలకు అవసరమైన సంతానం కోసం బాధపడే దశరథులు నేటికీ వున్నారు.

స్త్రీకి మాతృత్వ వాంఛ, పురుషునికి వంశాభివృద్ధి లేకపోతే మానవజాతి పశు ప్రాయ దశ కంటె దిగజారిపోతుంది

నానా క్లేశాలు పడి నలుగురు బిడ్డలను కన్నాడు; పుత్ర కామేష్టి యాగ ఫలంగా.

నలుగురూ పెరిగి పెద్దవారవుతున్నారు. జాతకర్మ, నామ కరణాదులతో వేదధర్మానుసారం ఉపనయనం నిర్వర్తించి విద్యాభ్యాసం చేయిస్తున్నారు.

విశ్వామిత్రుడు

ఆ రోజులలో సాధుజనహింస సాగించే మారీచ సుబాహులను సంహరించడానికి రామలక్ష్మణులను తన వెంట తీసుకు వెళ్ళాడు విశ్వామిత్రుడు.

ఎవరీ విశ్వామిత్రుడు –

రఘు వంశీయుల కులగురువులైన వశిష్ఠులవారితో స్పర్ధ వహించి కామక్రోధాలను జయించి బ్రహ్మర్షిత్వం సాధించిన మహనీయుడు.

అంతటివాడు వచ్చి అడిగితే దశరథుడు తన బిడ్డలింకా ముక్కుపచ్చలారనివారే! అని బాధపడ్డాడు పాపం.

దశరథుడే కాదు యీనాటికీ తల్లిదండ్రులు తమ సంతానం ఎంత పెద్దవారయినా పసివారుగానే భావించి బాధపడుతుంటారు.

సరే, ఎలా అయితేనేం రామలక్ష్మణులను వెంటబెట్టుకు వెళ్ళి దారిలో తాటకను సంహరింపించి, సుబాహుని బూడిద చేయించి, మారీచుని సముద్రతీరానికి కొట్టించి, నిర్విఘ్నంగా యాగం పరిసమాప్తం చేశాడు విశ్వామిత్ర మహర్షి.

అక్కడ నుంచి మిథిలానగరానికి తీసుకు వెళ్ళాడు. శివధనుర్భంగం అయింది. సీతారాములకు, ఊర్మిళా లక్ష్మణులకు, మాండవీభరతులకు, శ్రుతకీర్తిశత్రుఘ్నులకు విధ్యుక్తంగా వివాహాలు జరిపించి దశరథ మహారాజు కొడుకులతో కోడళ్ళతో అయోధ్యానగరం చేరాడు.

అయోధ్యలో పన్నెండు సంవత్సరాలు సీతారాములు అన్యోన్యానురాగంతో దాంపత్య జీవితం సాగించారు.

అనంతరం ఒకనాడు దశరథుడు కొలువుతీర్చి మంత్రి సామంత పురోహిత

దండనాథులతో పాటు తన దేశంలోని ప్రముఖ వ్యాపారులనూ, రైతులనూ రావించి –

“కోసలదేశ ప్రముఖులారా, ఈనాడు మీ ముందు ఒక ప్రధానాంశాన్ని ఉంచుతున్నాను.

నిర్భయంగా, నిస్సంకోచంగా మీ అభిప్రాయం విశదం చేయండి.

ఇంత కాలంగా ఈ రాజ్యభారం వహించి, ధర్మపథాన, సత్యవ్రతపరాయణుడనై రఘువంశ మర్యాద తప్పకుండా మీ అందరి అభిమానంతో పరిపాలన సాగించాను.

ఇప్పుడింక వయసు మళ్ళింది.

చూపు సన్నగిల్లి, చెవులు పనిచేయని దశ వచ్చి, మనస్సు స్థిమితం తప్పేవరకూ సింహాసనం మీద కూర్చోవాలనే కాంక్ష నాకు లేదు.

ఇంద్రియాలు స్వాధీనంలో ఉండగానే రాజ్యపాలన భారం మరొకరికి అప్పగించి ప్రశాంతంగా వానప్రస్థం స్వీకరించాలని ఉంది.

వంశ సంప్రదాయానుసారం జ్యేష్ఠుడైన రామచంద్రునికి యువరాజ పట్టాభిషేకం జరిపి విశ్రాంతి తీసుకుందామని నా సంకల్పం.

ఇందుకు మీరందరూ అంగీకరిస్తే సంతోషం, అన్నాడు.

ఆ మహాసభలోని వారందరూ ఏకగ్రీవంగా రామభద్రుని గుణ సంపత్తిని కీర్తించి

మహారాజా ! మీ నోట ఈ మాట వినడం కోసం మేమంతా ఎదురు చూస్తున్నాం. సత్య ధర్మ మర్మవిదుడైన రామభద్రుని ఏలుబడిలో మేమంతా సుఖశాంతులతో సంతోషంగా ఉండగలం.

బుద్ధిమాన్ మధురభాషీ
పూర్వ భాషీ ప్రియం వదః

* * *

ధర్మ కామార్థ తత్వజ్ఞః
స్మృతిమాన్ ప్రతిభానవాన్
లౌకికే సమయాచారే
కృతకల్పో విశారదః॥

రామచంద్రుడు ధీమంతుడు.

లోకంలో ధీశక్తి కలవారు చాలామంది ఉంటారు. నోరు విప్పి మాట్లాడరు. మాట్లాడినా అహంకారంతో, పరుషవాక్యాలు పలికేవారే ఉంటారు. రాముడు మధురభాషి, తియ్యగా మెల్లగా మాట్లాడతాడు.

అంతేనా – పూర్వభాషీ – నా అంతవాణ్ణి నేను, ఎదుటి వాడితో ముందుగా

మాట్లాడితే నా గౌరవం పోతుందేమో! అని విర్రవీగకుండా తానే ముందుగా నవ్వుతూ పలకరిస్తాడు, అది కూడా ప్రియంగా ఉండేలా చూసుకుంటాడు.

పురుషార్థాలలో ఇహలోకానికి సంబంధించిన ధర్మ, అర్థ, కామాల మర్మం ఎరిగినవాడు. ఏ విషయమయినా మరిచిపోకుండా జ్ఞాపకం ఉంచుకుని, ఎప్పటికప్పుడు మనసుకి పదునుపెట్టే ప్రతిభ కలవాడు, కాలానుసారం ప్రవర్తించే విద్వాంసుడు. ఇన్ని గుణాలు గల రామచంద్రుడు సింహాసనం అధివసిస్తే ఏ దేశంలో అయినా ప్రజలకు సుఖశాంతలు లభిస్తాయనేది మేధావులందరూ అంగీకరించ గలిగిన వాస్తవం.

ఆ విధంగా ప్రజలందరూ ఆమోదించాక దశరథుడు: "రేపే రామపట్టాభిషేకం, తగిన సంభారాలు సమకూర్చండి," అని మంత్రులకు ఆజ్ఞాపించి రాముని రప్పించి –

నాయనా, "యీ కోసలరాజ్య ప్రముఖులందరూ రేపు ఉదయం నిన్ను పట్టాభిషిక్తుని చేయడానికి నిశ్చయించారు, కనక పట్టాభిషిక్తుడు కావలసిన రాజనందనుడు ఏ నియమవ్రతాలు ఆనుసరించాలో గురువులు చెపుతారు, ఆ ప్రకారం ఈ రాత్రి గడుపు. ఉదయమే మంగళ స్నానానంతరం పట్టాభిషేకం చేస్తారు" అన్నాడు.

కులగురువులు వశిష్ఠులు ధర్మశాస్త్రం వివరించి, సింహాసనం అధివసించేవాడు రాత్రి ఉపవసించి, కటికనేలమీద దర్భాసనం పరిచి పడుకోవాలి, తెల్లవారేవరకూ మౌనంగా ఉండాలి, అన్నారు.

రాజభోగాలు అనుభవించడానికి అన్ని అధికారాలూ లభించే క్షణంలో తిండి లేకుండా, రాతినేలమీద పడుకుని, స్నేహితులతో, భార్యతో ముచ్చటలాడుకునే అవకాశం లేకుండా రాత్రి గడపాలి.

దేనికోసం ఈ నియమం,

రాజు కాబోయేవానికి తన ప్రజల ఆకలి బాధ తెలియాలి. రోడ్డువార చెట్టునీడన కాపురం చేస్తూ బండరాళ్ళమధ్య నిద్రించేవారి బాధ వంటబట్టాలి.

రాజ్యం చేతికందనున్న సమయంలో ఆవేశం పెరిగి అవి చేస్తాం, ఇవి చేస్తాం అని వాగ్దానాలు చెయ్యకూడదు, చెయ్యవలసిన లోకక్షేమంకర పథకాలను ఆలోచించుకుని, ఆచరణలో వచ్చే కష్టసుఖాలు తెలుసుకోవాలి.

అప్పుడు సింహాసనం ఎక్కినవాడు ప్రజల జీవితావసర కార్యాలు నిరాఘాటంగా నిర్వహించగలుగుతాడు; వారి బాధలను గ్రహించి పరిష్కారం చెయ్యగలిగి, అందరి అభిమానాన్నీ పొందగలుగుతాడు.

* * *

అదీ ఈ దేశంలో రామరాజ్యానికి అర్థం.

ఈ దృష్టితో రామాయణం చదివి వివేకంతో వ్యవహరించే వారు అధికారంలో వుంటే అశేషప్రజల జీవితం ప్రశాంతంగా సాగుతుంది.

✻ ✻ ✻

గురువుల ఆదేశానుసారం రామభద్రుడు ఉపవాస నియమంతో, అధశ్శయనంతో, మౌనంగా ఆ రాత్రి గడిపాడు.

✻ ✻ ✻

ఇక్కడ కథ యిలా ఉండగా.

అక్కడ కైకేయి అంతఃపురంలో–

రామ పట్టాభిషేక విషయం వారికి తెలియదు.

కైకేయి హాయిగా శయ్యామందిరం చేరి, కునుకు తీస్తున్నది.

నిద్రపట్టని మంధర సౌధోపరిభాగాన వెన్నెలలో తిరుగుతూ రాజవీధి చూసింది.

కోలాహలంగా ఉంది. ఇంటింటా ఏదో ఉత్సవం జరుగుతున్నంత ఉత్సాహం, అలంకారాలు, జనులందరూ సంతోషంతో అటూ యిటూ తిరుగుతున్నారు.

తోరణాలు, పతాకాలు, రంగవల్లులు, నూతన వస్త్రాలు... అన్నీ చూసిన దాది మంధరకు విషయం తెలియలేదు.

హడావుడిగా వెడుతూన్న మరో దాసిని పిలిచి, “ఏమిటీ కోలాహలం? ఏం జరుగుతున్నది మన నగరంలో?” అని అడిగింది.

ఓసి పొట్టిదానా! ఇంకా నీ చెవిని పడలేదా! తెల్లవారితే రామ చంద్రుడు సింహాసనం ఎక్కి కోసల దేశానికి మహారాజు అవుతాడు. ఆ సంతోషంతో నగర ప్రజలందరూ ఉత్సవ సన్నాహాలు చేసుకుంటున్నారు.

రాముడు రాజవుతాడు, అనే మాట గుండెలో శూలం గ్రుచ్చినంత బాధ కలిగించింది, చెవిలో సలసల మరుగుతూన్న సీసం పోసినట్లనిపించింది.

తోక త్రొక్కిన తాచులా చకచక మెట్లు దిగి, హంసతూలికా తల్పం మీద సుఖంగా నిద్రించే కైక దగ్గరకు వెళ్ళి –

“ఓసి దౌర్భాగ్యురాలా! కొంపలు మునిగిపోతుంటే నీకు నిద్ర ఎలా పట్టిందే” అని అరుస్తూ గోలుగోలున ఏడుస్తూ, కన్నీరు జారుస్తూ నిలబడింది.

ఏదో ప్రమాదం జరిగిందని ఉలిక్కిపడి లేచిన కైకేయి మంధరను చూసి :

“ఎందుకే ఏడుస్తావు, విషయం చెప్పు” అంది.

“ఇంకా ఏం చెప్పను. కొంప కాలిపోతోంది, అప్పుడే ఓ పెద కాలిపోయింది. నడినెత్తికి వస్తున్నది. లే, ఇప్పటికయినా కళ్ళ తెరిచి, యిల్లు చక్కబెట్టుకో” అని ఏడుస్తూనే వుంది.

"ఏడుపు ఆపి అసలు విషయం చెప్పు" అంది.

"ఏం చెప్పను, ఎలా చెప్పను. మహారాజుకి నీ మీదనే ప్రేమ అనుకుని మురిసిపోతున్నావు. ఇప్పుడు చూడు – రేపు తెల్లవారేసరికి కౌసల్య కొడుకు సింహాసనం ఎక్కి మహారాజు కాబోతున్నాడు. ఇంక మన బ్రతుకు ఏం కావాలి" అని శోకం హెచ్చించింది.

రామునికి పట్టాభిషేకం అన్నమాట చెవిని పడగానే ఆమె కన్నులలో కలువలు వికసించాయి, వదనం పూర్ణచంద్ర కాంతులతో నిండింది, పెదవులు దరహాస భాసురాలయాయి.

"ఇంత శుభవార్త చెప్పిన నీకు ఈ రత్నహారం కానుకగా యిస్తున్నానే" అవి తన మెడలో హారం మంధరకు బహూకరించింది.

పట్టాభిషేక వార్త కైకేయికి ఎంత ఆనందం కలిగించిందో మనసులో ఉంచుకుని ముందుకు సాగుదాం.

కైకేయి హృదయమంతా రామునిపై ఎంత వాత్సల్యం, ఆదరానురాగాలున్నాయో చూసిన తరవాయి అంతటి హృదయాన్ని ఎంత మలినం చేసిందో మంధర, జాగ్రత్తగా చూడండి.

"ఓ మూఢురాలా! నిద్ర నుంచి లేచావా! ఇంకా మత్తులో వున్నావా? ఏం చెప్పానో వినిపించిందా? నీ సవతి కౌసల్య. దాని కొడుకు రాజు కాబోతున్నాడు. ఇంక మన బ్రతుకు ఏం కావాలి?"

అని రత్నహారాన్ని త్రెంచి పారేసింది.

"రాముడు రాజయితే ఏడుపు దేనికే! రాజు కావలసినవాడు రాముడు. ప్రజలందరినీ రక్షించి వారి కష్టాలు తీర్చగలవాడు రామభద్రుడు."

అని కైక చెవుతూండగానే మంధర గొంతెత్తి –

"నీకు బుద్ధిలేదు. రాముడు రాజయితే పెత్తనం కౌసల్య చేతికి చిక్కుతుంది. ఇంతకాలం మనం ఆవిడను పెట్టిన బాధలకు ప్రతీకారం తీర్చుకు తీరుతుంది. నీ బ్రతుకు దాసీ బ్రతుకు, నేను నీ క్రింద దాసిని. అటువంటి బ్రతుకు కంటే చావు మేలు, ఉరి పోసుకుంటున్నాను" అంటూనే చీర చెంగు మెడ చుట్టూ త్రిప్పింది.

క్షణకాలం కైక మనసు చలించింది. నిజంగా మంధర ఆత్మహత్య చేసుకుంటుందని భయపడి –

మంధరా! ఇప్పుడేం చేద్దాం? వంశజ్యేష్ఠుడు సింహాసనం ఎక్కడం రాజవంశ మర్యాద, దానిని తప్పించడానికి మార్గం లేదు.

అనగానే మంధర కన్నీరు తుడుచుకుని, కనీ కనిపించని చిరునవ్వు పెదవులలో దాచి –

మహారాణీ! నీకు సంకల్పం కలగాలే కాని, దారి దొరకదా! చాలా రోజుల క్రితం దేవాసుర సంగ్రామాలలో దేవతలకు సాయం చేయడానికి రథారూఢుడై వెళ్ళిన నీ భర్తతో నువ్వు కూడా వెళ్ళావు. ఆ సమయంలో ఆయన అలసినప్పుడు సాయపడ్డ నీకు రెండు వరాలిస్తానన్నాడని గుర్తుందా? ఆ వరాలు ఇంతవరకూ తీర్చలేదు. ఇప్పుడు ఆ వరాలు అడుగు –

మొదటిది భరతుడు సింహాసనం ఎక్కాలి.

రెండవది రాముడు పద్నాలుగేళ్ళు అరణ్యానికి పోవాలి; తెలిసిందా? దీనితో నువ్వు రాజమాతవు కాగలవు, నీ బిడ్డ మహారాజుగా వెలుగుతాడు అంది.

కైకేయి ముఖం ముద్దమందారంలా వికసించింది.

తన బిడ్డ మహారాజు కాబోతున్నాడంటే ఏ తల్లి గుండె పొంగి పులకించకుండా ఉండదు.

కైకేయి కూడా తల్లి, మాతృహృదయం ఆవిడకూ వున్నది. తల్లి పేగు మీద గిలిగింత పెట్టగలిగిన తెలివి దాసి మంథరకు వున్నది.

రామాయణం నాడే కాదు, నేటికీ సంపన్నుల భవనాలలో భోగాలనుభవిస్తూ గృహ యజమానురాలికి తలలో నాలుకలా వుండే దాసి మంథరలు అక్కడక్కడ కనిపించకపోరు. కొంపలు ముంచగల నీచపు బుద్ధి వారికి ప్రకృతిసిద్ధంగా లభించే శక్తి.

అటువంటి మంథరల విషయంలో జాగ్రత్త పడకపోతే సర్వనాశనంతో పాటు వైధవ్యం తెచ్చుకోక తప్పదు యిల్లాలికి, అనే మాటలను వాచ్యం చెయ్యకుండా ఈ చిన్ని సంఘటనతో మహర్షి వాల్మీకి మహిళాలోకానికి ప్రబోధించాడు.

అది గ్రహించగలిగినవారు సుఖశాంతులతో దాంపత్యజీవితం సాగించుకుంటారు, లేనివారు కైకవలె లోకనిందతో, పసుపు కుంకుమలకు దూరమై అనాధ జీవితం గడుపుకోక తప్పదు.

రామాయణ మహాకావ్యంలో అరఘడియ కూడా నిలబడని మంథర పాత్ర యిన్ని వేల సంవత్సరాలయినా తన మలినబుద్ధితో లోకంలో తిట్లు పడుతూనే వుంది. అదీ సజీవ కావ్యస్రష్ట శక్తి!

✳ ✳ ✳

మంథర చేసిన దుర్బోధతో కైక ఆభరణాలు, అలంకారాలు తీసి పారేసి, కోపగృహం చేరింది. కటిక నేల మీద వెన్ను వాల్చింది. త్రాచు బుసకొడుతున్నట్లు ఉచ్ఛ్వాసనిశ్వాసలు వదులుతున్నది. అమ్మగారి ఆవేదన, ఆగ్రహం కారణంగా కైకేయి అంతఃపురం అంతా శోకమే అలుముకున్నది; పంజరంలో చిలుకలు కూడా భయం భయంగా చూస్తున్నాయి. ద్వారాలలో నిలబడిన వారి ముఖాలలో దైన్యం తాండవిస్తున్నది.

శోకసముద్రం వలె వున్న కైకేయి అంతఃపురానికి వచ్చాడు, సంతోషంతో ఆ రాత్రి ఆమెతో సుఖంగా గడపాలని దశరథ మహారాజు.

అంతటా నిశ్శబ్దం, విషాదం!

ముద్దుల భార్య అంతఃపురంలో అడుగుపెట్టాడు, హంసతూలికా తల్పం శూన్యంగా ఉంది. ఈవలకు వచ్చి ప్రతీహారిని అడిగాడు. వాడు కోపగృహం చూపించాడు. హుటాహుటీ అక్కడకు వెళ్ళాడు.

రాతి నేల మీద జుట్టు విప్పుకుని అలంకారం శూన్యంగా పడివుంది కైకేయి.

ఆందోళనతో ఆమె దగ్గరకు వెళ్ళాడు, బ్రతిమాలాడు, బుజ్జగించాడు, కారణం చెప్పమన్నాడు.

ఆవిడ మాటను తిరస్కరించి అవమానించినవారిని, పరాభవించినవారిని యమసదనం చేరుస్తానన్నాడు.

అంతతో ఆగలేదు, కామోన్మత్తుడై వున్న మహారాజు, నిరపరాధినయినా సరే ఆవిడ కోసం దండించగలనన్నాడు.

అంతా జరిగాక –

ఆవిడ మూతి ముడిచి,

నిజంగా నామీద అనురాగం వుంటే, రేపు తెల్లవారుతుండగా బయలుదేరి రాముడు వనవాసానికి పోవాలి, పదునాలుగేళ్ళు; నా బిడ్డ భరతునికి పట్టాభిషేకం జరగాలి అంది.

మొదలు నరికిన చెట్టులా కూలబడ్డాడు. కొంతసేపు స్మృతి లేదు. నెమ్మదిగా లేచి బ్రతిమాలాడు, ప్రార్థించాడు, దూషించాడు.

రాముడు లేకపోతే ప్రాణాలు వదులుతానన్నాడు.

చచ్చినా సరే తన కోరిక తీర్చి తీరాలి, అంది.

అనుకున్నంతపనీ జరిగింది.

తెలతెలవారుతూండగా పట్టాభిషేక సుముహూర్తం సమీపిస్తున్నదని కులగురువులు వశిష్ఠులు సుమంత్రుని పంపి దశరథ మహారాజును తీసుకు రమ్మన్నారు.

వచ్చిన సుమంతుని తక్షణం వెళ్ళి రాజాజ్ఞగా రాముని తీసుకురమ్మని పంపింది కైకేయి.

వెళ్ళిన సుమంతుడు క్షణాలలో రామునితో వచ్చాడు.

వచ్చిన రామభద్రుని చూసి కైకేయి

నాయనా! భరతునికి రాజ్యం అప్పగించి నిన్ను పద్నాలుగు సంవత్సరాలు అరణ్య వాసం చేయించాలని మీ నాన్నగారి సంకల్పం, అది చెప్పడానికే పిలిపించారు, అంది.

విన్నాడు రామచంద్రుడు.

వింటూనే రాజలాంఛనాలన్నీ తీసేశాడు. పైమీది ఉత్తరీయం కూడా అక్కడ వుంచి, సంతోషంతో –

అమ్మా! "నాన్నగారికి నా మీద ఎంత అనురాగం వున్నదమ్మా! నిరంతరం రాజ్యపాలనతో, సమస్యలతో తల బరువెక్కకుండా హాయిగా అరణ్యంలో మహర్షుల సన్నిధానంలో పరతత్త్వాన్ని ఉపాసించే అవకాశం అనుగ్రహించారు. ఈ మాట చెప్పడానికి యిక్కడకు పిలిపించడం దేనికి, అక్కడకు వచ్చిన సుమంతునికే యీ వార్త చెప్పి పంపితే యీ పాటికే అరణ్యానికి వెళ్ళేవాడిని కదా, నాన్నగారి ఆజ్ఞ ఆయన నోట వెలువడిన క్షణంలో ఆచరించవలసినవారం కాదుటమ్మా."

అంటూ కట్టుకున్న ధోవతితో పాదచారియై అంతఃపురం వదిలి, రాజవీధిని బయలుదేరి తన తల్లి నివసించే భవనానికి వెళ్ళి విషయం చెప్పాడు.

కౌసల్యాదేవి స్మృతి తప్పి పడిపోయింది.

నెమ్మదిగా సేద దీర్చాక – "నాయనా! నిన్ను విడిచి నేను క్షణం బ్రతకలేను, నన్ను కూడా నీతో అరణ్యానికి తీసుకువెళ్ళు" అని కన్నీరు మున్నీరు చేసుకునే తల్లిని ఓదార్చి :

"అమ్మా! ఏవిటి నువ్వు మాట్లాడుతున్నది! కోసలాధీశుల ఆడుబిడ్డవు, రఘువంశ క్షత్రియుల ఇంటి పెద్ద కోడలివి, ఇలా అనవచ్చునా! కొడుకులు కాదమ్మా, భర్త ప్రాణాధికుడు నీకు, ఆయనను విడిచి రాకూడదు" అని ధర్మశాస్త్రం ప్రబోధించాడు.

అంతవరకూ మాట్లాడకుండా వున్న లక్ష్మణస్వామి కత్తి పై కెత్తి :

"అన్నయ్యా, ఈ రాజ్యం నీకు దక్కకుండా చేసేవారిని యీ కరవాలానికి బలియిస్తాను. వార్ధక్యంలో మనసు వశం తప్పి కామ వ్యామోహంలో చిక్కుకున్న మహారాజు మాట మనం విననవసరం లేదు. నిన్ను నేను సింహాసనం ఎక్కిస్తాను. ఎవరు కాదన్నా వారిని యమసదనం చేరుస్తాను" అని నిప్పులు కురిపిస్తున్న తమ్ముని భుజం మీద తట్టి, చిరునవ్వుతో –

"లక్ష్మణా! దేనికయ్యా యింత ఆవేశం, ఎవరినయ్యా చంపుతానంటున్నావు. కన్నతండ్రిని కరవాలంతో కడతేరుస్తావా! మన వంశంలో జరగవలసిన పనేనా! జన్మదాతయైన తండ్రి మీద ద్వేషమా! కత్తి దింపు. నాన్నగారు చేసిన వాగ్దానాన్ని నెరవేర్చని జన్మ వ్యర్థం. ఆయనకు అసత్య దోషం రానివ్వకూడదు" అని మెల్లగా మందలించి, తన భవనం వైపు సాగుతూ;

"లక్ష్మణా, నా సిరిసంపదలన్నీ యోగ్యులకు దానం చెయ్యాలి, మన మిత్రుడు సుయజ్ఞుని రప్పించు" అన్నాడు.

రామచంద్రుడు తన సౌధంలో పై అంతస్థుకు వెళ్ళాడు.

అక్కడ పట్టాభిషేకానికి అనుకూలమైన అలంకారాలతో సీతాదేవి ఎదురుపడింది.

"విదేహ రాజనందనా! పితృవాక్యపాలన దీక్షతో పదునాలుగేళ్ళు వనవాసం సాగించడానికి వెడుతున్నాను. ఈ పద్నాలుగేళ్ళూ జాగరూకతతో మా అమ్మగారికీ, నాన్నగారికీ సేవలు చేస్తూ ఉండు. వార్ధక్యంలో వారికి బాధ కలగకుండా చూసుకో, నేను వెడుతున్నాను" అన్నాడు.

నిశ్చలంగా నిలబడి జానకీదేవి –

"ప్రాణేశ్వరా! మీ నాన్నగారి మాట మీద మీరు వనవాసానికి వెడుతూ నన్నిక్కడ విడిచి పెడతారా! నేనూ మీతోనే వుంటాను, అది అయోధ్య అయినా అరణ్యమయినా నాకు బాధలేదు. చిన్ననాటి నుంచీ మా అమ్మగారు అదే చెప్పారు.

కష్టమయినా, సుఖమయినా, క్లేశమయినా, సంతోషమైనా భర్త నీడలోనే భార్య వుండాలి. ఆయన తోడుగా వుంటే ఎన్ని కష్టాలనైనా చిరునవ్వుతో భరించ గలుగుతామని బోధించింది" అనగా రాముడు :

"జానకీ! నేను వెడుతున్నది భీకర మృగ సంభరితమూ, కంటక శిలా సంయుతమూ, ప్రమాద భూయిష్టమూ అయిన మహారణ్యానికి. ఆ బాధలు నువ్వు భరించలేవు.

అక్కడ హంసతూలికా తల్పం, అంతరంగ భోగాలూ ఉండవు, కందమూల ఫలాలు తింటూ, కటిక రాతి నేల మీద పడుకుని, సింహవ్యాఘ్ర గర్జనలు వింటూండాలి. ఈ శ్రమ నీకు తగదు" అని పరిపరివిధాల మందలించి, బుజ్జగించినా సీతాదేవి తన పట్టు వీడకుండా:

ఆర్యా! మా నాన్నగారు ఎంత అమాయకుడయ్యా, శివధనుర్భంగం చేసిన మహా వీరుడవని నిన్ను అల్లుడుగా చేసుకున్నాడే కాని, కట్టుకున్న భార్యను రక్షించుకోలేని వాడివనీ, పురుష వేషం ధరించిన అబలవనీ తెలుసుకోలేక పోయాడు, అని కంట తడి పెట్టింది.

కింత్వామన్యత వైదేహః
పితా మే మిథిలాధిపః
రామ జామాతరం ప్రాప్య
స్త్రీయం పురుష విగ్రహం॥

ఆ మాటతో రాముడు సీతాదేవిని వెంటబెట్టుకు వెళ్ళడానికి అంగీకరించాడు. పాతివ్రత్య ధర్మ నిర్వహణలో అచంచల దీక్ష గల సీతాదేవి తన భర్త నీడలోనే కష్టమయినా సుఖమయినా అనుభవించడానికి సిద్ధపడింది. కనకనే ఆవిడను ఈ జాతి ఆరాధిస్తున్నది.

రాజ భోగాలు వదిలి పితృవాక్పాలనకు అరణ్యవాస క్లేశాలు సహించినందువల్లనే రామభద్రునికి తలవంచుతున్నాం.

అంతేకాని – ఆయన అవతార పురుషుడనే దృష్టితో మాత్రం కాదు. అవతార

దృష్టితోనే అయితే అంతకు ముందు ఎన్నో అవతారాలు వున్నాయి. మత్స్య, కూర్మ, వరాహ, నారసింహ, వామన, పరశురామావతారాలున్నాయి. అనంతరం కృష్ణావతారం వున్నది.

ఇన్ని అవతారాలున్నా సీతారాములకున్న ఉన్నతస్థానం, ఆరాధన మిగిలిన అవతారాలకు లేవు. ఏమిటి కారణం!

మానవరూపంలో ప్రభవించాక పరమేశ్వరుడైనా, ఆదిగర్భేశ్వరి అయినా మానవ ధర్మాన్ని ఆచరించి ఆదర్శం చూపాలి. అది సీతారాములలోనే కనిపిస్తుంది. ఈ అంశాన్ని విస్మరించిన నాడు రామాయణం చదవడం, వినడం అనవసరం.

మానవునిలో పశుత్వ, దానవత్వాలను నాశనం చేసి దివ్యత్వం వైపు నడపడానికి అవశ్యమయిన ధర్మమార్గ ప్రబోధానికే మనం రామాయణ భారతాలు చదవాలి, వినాలి, వినిపించాలి. అందుకే ఆ మునిచంద్రులు యీ గాథలను అందించారు. ఆ కారణంగానే యిన్ని వేల సంవత్సరాలుగా దేశదేశాల మేధావులనూ, సామాన్యులనూ ఆకర్షించి అలరించే జీవశక్తి వానిలో వున్నది.

ఆ కారణం వల్లనే వాల్మీకి –

యావత్ స్థాస్యంతి గిరయః
సరితశ్చ మహీతలే
తావద్రామాయణ కథా
లోకేషు ప్రచరిష్యతి ॥

లోకంలో పర్వతాలూ, నదీప్రవాహాలూ వున్నంతకాలం సీతారాముల గాథ ప్రచారంలో ఉంటుంది, అని వాల్మీకి చెప్పుకో గలిగాడూ అంటే, నదులూ పర్వతాలూ వున్నంతకాలం మానవజాతి మనుగడ సాగుతూనే ఉంటుంది, మానవుడున్నంతకాలం రామకథ చదువుతూ, వింటూ వుండక తప్పదు. కొందరు భక్తితో పారాయణం చేస్తే, కొందరు పరిశీలనతో అధ్యయనం చేస్తారు, ఒకరిద్దరు ద్వేషంతో చదువుతారు, అది విషయాంతరం.

భక్తితో చదివేవారికి సీతారాములు అవతారపురుషులుగా ఆరాధనీయులవుతున్నారు. ఆసక్తితో పరిశీలించేవారికి ఆదర్శమానవులుగా వందనీయు లవుతూంటే, ద్వేషంతో చదివేవారికి విప్రప్రాయులయారు.

* * *

ఇక ప్రధానాంశానికి వస్తే –

సీతాదేవి వనవాసానికి సన్నద్ధురాలు కాగానే లక్ష్మణుడు తాను కూడా అరణ్యానికి వస్తున్నా నన్నాడు.

తమ్ముడూ! నాన్నగారు పిన్నికిచ్చిన వరం ప్రకారం నేనొక్కడినే వెళ్ళాలి.

జనకరాజనందన నన్ను విడిచి ఉండలేనంటే తప్పనిసరిగా అంగీకరించాను. ఇప్పుడు నువ్వు బయలుదేరతానంటున్నావు. ఈ విధంగా బంధుమిత్రులందరూ అయోధ్య విడిచిపెట్టడం న్యాయం కాదు, అని రాముడు పరిపరివిధాల బోధించినా వినలేదు లక్ష్మణుడు. గత్యంతరం లేక తమ్ముడి రాకకు అంగీకరించి :

లక్ష్మణా! మీ అమ్మ సుమిత్ర అనుమతి తీసుకుని రా, అని పంపాడు. చకచక వెళ్ళి తల్లికి నివేదించాడు.

అప్పుడు సుమిత్ర :

నాయనా, మీ అన్నయ్యే నాన్నగారనుకో, మీ వదినను నన్ను చూసినట్లే తల్లిగా చూడు, అరణ్యమే అయోధ్యానగరం అనుకో, అప్పుడు నీకు ఏ బాధా ఉండదు, అని ఆశీర్వదించి పంపింది.

రామం దశరథం విద్ధి
మాం విద్ధి జనకాత్మజాం
అయోధ్యా మటవీం విద్ధి
గచ్ఛ తాత యధాసుఖం॥

సుమిత్ర మాటలు వినగానే చేతులు జోడించి నిలబడాలి, మానవతావాది ఎవరయినా!

ఆవిడకు ఏమాత్రం దురాలోచన కలిగినా, తక్షణం తన బిడ్డను సింహాసనం ఎక్కించే ప్రయత్నం చేస్తుంది.

సింహాసనం ఎక్కవలసిన పెద్దవాడు నిశ్చింతగా అడవికి పోతున్నాడు, తరువాత వారసుడు భరతుడు దూరాన మేనమామల దగ్గర వున్నాడు. సాహస, పరాక్రమాలలో, ధనుర్విద్యలో రామునితో సమానుడయిన వీరుడు తన బిడ్డ లక్ష్మణుడు. ప్రజలు, మంత్రులు అందరూ రాముని పట్ల ఎంత గౌరవంతో వున్నారో, లక్ష్మణుని కూడా అంత ఆదరంతో గౌరవిస్తున్నారు.

రామపట్టాభిషేకాన్ని భగ్నం చేసిన కైకేయి మీద వారందరికీ ఆగ్రహావేశాలుండి తీరతాయి, ఆ కోపం ఆవిడ బిడ్డ మీద కూడా ఉంటుంది కనక లక్ష్మణుడు హాయిగా రాజు కాగలడు.

కాగలడు, కాని ఈ ఆలోచన లక్ష్మణునికీ రాలేదు, సుమిత్రకూ కలగలేదు. కలిగి ఉంటే రామకథ అంతా అడ్డం తిరిగేది, కైకేయిని దూషించినట్టే సుమిత్రను కూడా నీచంగా చూసేవారం.

సిరిసంపదలూ, భోగభాగ్యాలూ కాదు ప్రధానం, మానవత్వ లక్షణమైన అన్నదమ్ముల అనుబంధం, దీని ముందు అవన్నీ తృణప్రాయాలు, అని భావించిన సుమిత్ర వంటి యిల్లాలు నాటికీ నేటికీ కోటికీ, ముక్కోటికీ ఉండకపోరు.

అనంతరం సీతా రామ లక్ష్మణులు కైకేయి భవనానికి వచ్చి, తండ్రి అనుమతి కోసం నిలబడ్డారు, అప్పుడక్కడ జేరిన అందరూ ఎవరి నోటికి వచ్చినట్లు వారు కైకేయిని దూషించారు. చలించలేదు కైక, రాయిలా నిలబడింది.

అప్పుడు దశరథుడన్నాడు : "నాయనా నన్ను బంధించి రాజ్యాన్ని పాలించు" అని.

ఆ మాట విని శ్రీరాముడు గంభీరంగా – "మహారాజా! ఏమిటంటున్నారు మీరు, ఈ రాజ్యాన్ని పాలించవలసినవాడు భరతుడే కాని నేను కాదు, మీకు అసత్య దోషం తగులకూడదు" అని వనవాసానికి బయలుదేరాడు.

ఇంతతో రామాయణంలో ఒక ప్రధాన ఘట్టం ముగిసింది.

ఈ సంఘటనవరకూ నడిచిన కథలో మానవజాతికి ఆదర్శంగా మహర్షి వాల్మీకి అందించిన సందేశాన్ని పరిశీలిస్తే....

ముగ్గురు తల్లులు మన ముందున్నారు.

వారిలో కౌసల్య–తన బిడ్డ సింహాసనం ఎక్కుతున్నాడని వినగానే పరమ సంతోషంతో దానధర్మాలు చేసింది, ఆ బిడ్డయే అరణ్యానికి వెళ్ళవలసిన వచ్చేసరికి గోలుగోలున విలపించింది –

ఇదే రీతిగా తమ సంతానం యొక్క వృద్ధికీ, ఉన్నతికీ పొంగి పులకించి, వారి కష్టాలకు క్రుంగిపోయే కౌసల్య వంటి తల్లులు లోకంలో అసంఖ్యాకంగా వుంటారు.

తన బిడ్డ అయినా, పరాయివారి సంతానమయినా కష్టమయినా సుఖమయినా ఏమీ చలించని సుమిత్ర వంటి తల్లి దేశానికి ఒకరు ఉండవచ్చు.

తన బిడ్డ పెద్ద పదవిలో ఉండి భోగభాగ్యాలతో అలరారుతుంటే చాలదు, తమ ఇరుగుపొరుగుల పిల్లలకు అడుక్కుతినే దశ రాకపోతే కన్నుల్లో నిప్పులు పోసుకునే కైకమ్మలు కనిపించకపోరు.

ఈ విధంగా ముగ్గురు తల్లులను మన ముందుంచి లోకంలోని మాతృమూర్తుల లక్షణాలన్నిటినీ కాచి వడబోశాడు మహర్షి.

మాతృత్వం ఎక్కడ వున్నా యీ మూడులక్షణాలనూ అతిక్రమించి కనిపించే అవకాశం లేదు.

అలానే సిరిసంపదలకు మోహపడి, ముందు వెనుకలు ఆలోచించకుండా కొంపలు కూల్చే నీచ మనస్తత్వం గల ఇంటి దాసీలకు మంధర ప్రతినిధి. సాటివారిలో తన రాజసం నిలబడడానికే వారు ప్రయత్నిస్తారు. భర్త ప్రాణాలు వదలుతానన్నా సరే పట్టిన పట్టు వీడకుండా నిలిచే కైకమ్మలను తయారుచేసుకుని వారి అండన తమ ప్రతాపం ప్రదర్శిస్తారు వీరు. ఈ మంధరలను ఈ నాటికీ సంపన్న కుటుంబాలలో పెరటి గుమ్మాల దగ్గర చూడగలం.

మరొక విశేషం –

యాగరక్షణకు రామలక్ష్మణులను వెంట తీసుకు వెళ్ళిన విశ్వామిత్రుడు, సీతారామ కల్యాణం కాగానే అదృశ్యమవుతాడు. మన కంట బడడింక అంతటి విశ్వామిత్రుడూ.

లోకకల్యాణ కాంక్షతో సాగించే క్రతువుకు అంతరాయం కలిగించే రాక్షస సంహారం నిర్వర్తింపజేయడంతో విశ్వామిత్రుని పని రామాయణంలో అయిపోయింది, అంతే! ఆ పాత్రను విడిచేశాడు వాల్మీకి.

ఇలానే రామకథలో ఏ పాత్ర అయినా అనవసరంగా ప్రవేశించదు, ప్రవేశించిన పాత్ర కర్తవ్య దీక్షతో నిష్క్రమించవలసిందే.

ఒక్కో పాత్ర ఒక్కో ప్రయోజనంతో ప్రవేశించి, ఒక్కో ప్రత్యేక లక్షణంతో పనిచేసుకు వెళ్ళిపోతుంది. ఆ పాత్ర అర్ధఘడియ కాలమే మనకు కనిపించినా అనంతరకాలాలలో అంటే రామకథ వున్నంతకాలం దాన్ని మరిచిపోలేనంత ప్రగాఢంగా నిలబడుతుంది. అదీ పాత్ర సృష్టిలో వాల్మీకి మునీంద్రుని ప్రతిభా సంపద.

విశ్వామిత్రుడు, మంథర, శూర్పణఖ, శబరి, కబంధ, విరాధాదులు, వీరేకాదు, రామాయణంలో కుంభకర్ణుడు సైతం మనకు కనిపించిన నాటి సాయంత్రానికే కనుమూసినా నేటికీ మన కనుల ముందు కుంభకర్ణులెందరో దర్శనమిస్తారు, మరేం లేదు. వేళాపాళా లేకుండా నిద్రపోయే మోహాలన్నీ కుంభకర్ణ సంతానమే అని మనకు తెలుసు.

సుగుణాలూ, దుర్గుణాలూ రెండింటికీ ప్రతినిధులున్నారు రామకథలో; మొత్తం అంతా మంచినే గుమ్మరించ లేదు. లోకంలో ఉండే నిఖిల ప్రకృతుల వ్యక్తులనూ నిష్పక్షపాతంగా మన ముందు వుంచి మన ప్రవృత్తి ఎవరియందు అనురాగబద్ధమైతే అటు నడుచుకోవడానికి ఎవరికీ అభ్యంతరం లేదు.

సుమిత్ర వలె, కౌసల్య వలే వుంటే లోకం చేతులు జోడించి సమస్కరిస్తుంది, కైకేయిలా ప్రవర్తిస్తే వేలెత్తి చూపుతూ సూటిపోటి మాటలతో నిందిస్తూనే ఉంటుంది. ఎవరి అదృష్టం వారిది.

శూర్పణఖ

సీతారామ లక్ష్మణులు వనవాసం సాగిస్తున్నారు.

హాయిగా పదమూడు సంవత్సరాలు గడిచాయి.

మరొక్క ఏడాదిలో అయోధ్య చేరి సామ్రాజ్యాధిపత్యం వహించి సుఖభోగాలలో తేలియాడుతారు.

* * *

అటువంటి సమయంలో ప్రవేశించింది శూర్పణఖ.

శూర్పణఖ రాకతో కథ మలుపు తిరిగింది, తిరిగిన మలుపు రావణ సంహారం దాకా వెళ్ళి సీతారాములను పుష్పకం మీద అయోధ్యకు చేర్చి సింహాసనం ఎక్కించింది.

అంటే రామాయణంలో అరణ్యకాండ వరకూ మంథర దుర్బుద్ధి వల్ల నడిచింది, మిగిలిన మూడు కాండల కథకూ శూర్పణఖ మోహం కారణమైంది.

మంథర ధనవ్యామోహం, శూర్పణఖ కామదృష్టి రామకథకు బీజాలయాయి. పురుషార్థాలలో ధర్మదృష్టి లోపించి అర్థ, కామాలకు బానిసలయినవారు ఎంతటి అఘాయిత్యానికి తలపడి ఎన్ని ఘాతుకాలు చేస్తారో ఈ నారీద్వయం మనకు ప్రత్యక్షం చేసి లోకంలో నేటికీ పాపబుద్ధులకు ప్రతినిధులుగా ప్రజల దూషణలతో బ్రతుకుతూనే వున్నారు.

శూర్పణఖ వస్తూనే రామచంద్రుని అతిలోక సౌందర్యానికి మనసు చలించి కామప్రకోపంతో ప్రసంగం ప్రారంభించింది.

అనుకూలవతి అయిన అర్థాంగి సమక్షంలోనే పరస్త్రీ తన వాంఛను వ్యక్తం చేయడం రామచంద్రునికి ఆశ్చర్యం కలిగించింది.

పరిహాసంగా ఆమెను లక్ష్మణస్వామి దగ్గరకు పంపాడు.

ఈ నీలిమేఘశ్యాముని కంటె ఆ మేలిమి బంగారు యువకుడే తనకు తగిన వాడనుకున్నది.

పట్టపగలు ఇంద్రియ ప్రకోపంతో కామవశీభూతయై వచ్చిన ఆమెను మళ్ళీ అన్నగారి దగ్గరకు పంపాడు.

శూర్పణఖ ఆవేశం హెచ్చింది, కామబాధ రెచ్చిపోగా రాముని మీది మోహంతో సీతాదేవిని కబళించడానికి సిద్ధపడింది.

రామాజ్ఞతో లక్ష్మణస్వామి ఆమె ముక్కూ, చెవులూ కోసేశాడు. అది గోలుగోలున రొమ్ము బాదుకుంటూ తన సోదరులైన ఖరదూషణుల దగ్గరకు వెళ్ళి జరిగిన కథ చెప్పింది.

జనస్థానాధిపది ఖరుడు తన సేనాపతులయిదుగురినీ తోడిచ్చి పంపాడు.

తిరిగి వచ్చిన శూర్పణఖ రాముని ఎదుట నిలబడి–

కండకావరంతో ఏం చేశావో చెప్పవయ్యా?

అనగా చిరునవ్వుతో రాముడు–

నేనేం చేశానో చెప్పాలా! నీ మొహం చూస్తే కనిపించలేదా మీ సేనాపతులకు, అని ధనుస్సు సంధించి విడిచిన బాణాలతో అయిదుగురూ నేలకూలారు.

మరింత బాధతో ఖరుని దగ్గరకు పోగా, "ఏమయింది అక్కా?" అని అడిగాడు రాక్షసుడు.

"ఏం కావాలి? నువ్వు పంపావు, ఆయన చంపాడు?" అని రాముని ధనుర్విద్యను ఒక్కమాటలో వ్యక్తం చేసింది.

ఎంతటి యోధులనయినా అవలీలగా సంహరించగల సేనాపతులు నేలకూలిన వార్త వినగానే ఖరుడు తన సేనాసమూహంతో బయలుదేరాడు.

రాక్షస కోలాహలం అల్లంత దూరాన నుండి వింటూనే రామభద్రుడు :

లక్ష్మణా! ఈ రాక్షస సమూహాన్ని నేనొక్కడినే యమసదనం చేరుస్తాను. మీ వదినను పర్ణశాలలో ఉంచి ద్వారం దగ్గర నిలబడు, అని ధనుస్సు సంధించి బాణం తొడిగాడు.

ఆ ధనుస్సు నుండి వెలువడే బాణాలు రాక్షసులను అడుగు కదపనివ్వకుండా నేల కరిపిస్తున్నాయి. చిట్టచివరకు ఖరుడు దూకుడుగా వస్తుంటే బాణవేగానికి తగిన ఎడం కోసం రాముడు రెండడుగులు వెనుకకు వేసి వానిని యమపురికి పంపాడు.

జనస్థానంలో తన సోదరులు పరివార సమేతం నేలకూలడంతో శూర్పణఖ హుటాహుటి లంకానగరంలో రావణుని కొలువుకూటంలో నిలబడింది.

ముక్కూ చెవులూ తెగి కారిన రక్తం అట్టకట్టిన ముఖంతో ఏడుస్తూ వున్న శూర్పణఖను చూస్తూనే రావణుడు–

సోదరీ! కాలకూట విషం క్రక్కే అయిదు పడగల పాము తల మీద చెయ్యిపెట్టి బ్రతకడానికి సాహసించిన మూర్ఖుడెవడు? ఈ క్షణంలోనే వానిని పంచభూతాలలో లీనం చేస్తాను, అన్నాడు.

లంకేశ్వరా! ఎంత మత్తులో బ్రతుకుతున్నావురా. జనస్థాన రక్షణలో వుండి మునిగణాలను హింసించడానికి నియుక్తులైన ఖర, దూషణాదులు పదునాలుగు వేల మందీ ఒక్క వీరుని చేతులలో నేలకూలిన విషయం కూడా నీకు తెలియలేదా!

పాన గోష్ఠిలో పడి, కాముకుడవై రాజ్య వ్యవహారాలను తెలుసుకోకుండా వుంటున్నావు. అది సర్వనాశన హేతువు. ఇంక నా ముక్కూ చెవులూ తెగకోసిన వారెవరని కదూ అడుగుతున్నావు. సావధానంగా విను :

ముల్లోకాలనూ గజగజలాడించావు, అష్ట దిక్పాలకులనూ పాదాక్రాంతులను చేసుకున్నావు. కాని నీ వంటివాని ప్రక్క సింహాసనం మీద పట్టమహిషిగా ఉండదగ్గ అతిలోక సుందరిని పొందలేకపోయావు. అటువంటి త్రిజగన్మోహనాంగిని దండకారణ్యంలో చూశాను. దాన్ని తీసుకువచ్చి నీ భార్యగా బహూకరిద్దామనుకున్నాను. ఆ ప్రయత్నంలో నేనుండగా దాని భర్త రాముడు తన తమ్ముని ద్వారా నాకీ శిక్ష వేశాడు. అంతతో ఆగక ఖరదూషణాదులందరినీ నేలపాలు చేశాడు. మనకు జరిగిన పరాభవానికి ప్రతీకారంగా రామలక్ష్మణులను కడతేర్చి సీతను తెచ్చుకుని హాయిగా సుఖపడు. ఇంతకంటె చెప్పవలసింది లేదు, అనగానే

రావణుడు సంతోషంతో లేచి వాహనశాలకు పోయి రథం మీద ఆకాశవీధిని సాగి సాగి సముద్రం ఆవలి వొడ్డున మారీచుని ఆశ్రమంలో దిగాడు.

మారీచుడు స్వాగతం పలికి అతిథి మర్యాదలు జరిపి, "ప్రభూ! ఏ రాచకార్యం ముంచుకొచ్చి యిలా దయచేశావు", అని ప్రశ్నించగానే రావణుడు; శూర్పణఖ చెప్పిన కథ అంతా వినిపించి.

నీ మాయాజాలంతో రామలక్ష్మణులను వంచించి వారిని ఆశ్రమానికి దూరంగా తీసుకుపోవాలి, అప్పుడు నేను సీతను అపహరించుకు వెడతాను, అన్నాడు.

లంకేశ్వరా! నేటివరకూ ఎన్ని అత్యాచారాలకు సాహసించినా నిన్ను కాదనలేదు. కాని యీ విషయంలో నీ మనస్సు మార్చుకుని తిరిగి లంకకు పోయి హాయిగా అంతఃపురంలో భోగాలు అనుభవించు.

నీకు రాముడంటే ఏమిటో తెలిసినట్టు లేదు–

ఆయన పరాక్రమ విషయం శూర్పణఖ నోట విన్నావు. ఒక్కడుగా నిలబడి మన రాక్షసయోధులు పద్నాలుగు వేలమందిని అనాయాసంగా నేలకూల్చాడు. ఇది ఈనాటి మాట –

పాతికేళ్ళ క్రితం –

విశ్వామిత్ర యాగరక్షణకు వచ్చిననాడు, అప్పటికి నిండా పదహారేళ్ళు లేవు. మీసకట్టు పూర్తిగా నల్లబడని రోజులలో సుబాహుని బూడిద చేసి, నా మీద అనుగ్రహంతో వాయువ్యాస్త్రంతో కొట్టిన దెబ్బ యిప్పటికి గుర్తుకొచ్చి గజగజ లాడిస్తున్నది రావణా! ఒక్కముక్కలో చెప్పనా!

రకారాదీని నామాని
రామత్రస్తస్యర్యాణ
రత్నానిచ రధాంశ్చావ
సంత్రాసం జనయంతి మే॥

రాముని పేరు వింటే కలిగే భయం సహజం. కాని ర కారం వినిపిస్తే చాలు రాముడే కనిపించి గుండె జారిపోతున్నది. అసలు నీకు రాముడంటే తెలిసినట్లు లేదు.

రామో విగ్రహవాన్ ధర్మః। సాధుస్సత్య పరాక్రమః॥

ధర్మం మానవాకృతిలో రామునిగా అవతరించింది. ఆయన సత్య పరాక్రముడు. నా మాట విని చేజేతులా మృత్యుపాశం మెడకు చుట్టుకునే అవివేకానికి సాహసించక, వెనుదిరిగిపో.

నీ కామం కారణంగా లంకా నగరాన్నీ, రాక్షస యోధులనూ నాశనం చెయ్యకు. నీ

మంత్రిని కనక నీ శ్రేయస్సుకోరి యింత చెపుతున్నాను, అన్నాడు.

ఇక్కడ ప్రధానంగా మనకొక విషయం తెలుస్తుంది.

శత్రువర్గానికి చెందిన మారీచుడు సైతం రాముని ధర్మవర్తననూ, పరాక్రమాన్నీ తెలుపుతూ తన ప్రభువుకు హితబోధ చెయ్యడానికి జంకలేదు.

సరే, వినలేదు రావణుడు; వినడం సాధ్యం కాదు కామం కళ్ళు కప్పినవానికి, అహంకారం మూర్తీభవించినవానికి.

మారీచుడు మాయలేడి అయాడు.

సీతాదేవి మనసును హరించాడు.

మాయచేసి రాముని తన వెంట దూరానికి తీసుకుపోయాడు.

రావణుడు భిక్షుక రూపంలో సీతాపహరణం చేశాడు.

అంటే–చతుర్దశ భువనాలనూ అల్లల్లాడించిన రావణుడంతవాడు కామ వ్యామోహితుడు కావడంతో సన్యాసిలా యాచకుని వలె దిగజారిపోయాడు. పరస్త్రీ వాంఛ ఎంతటి దుర్దశకు దింపుతుందో ఈ సన్నివేశం బోధిస్తుంది. వాడి మోహం కారణంగా విశ్వసనీయుడైన మంత్రి మరణించాడు.

రామలక్ష్మణులు వెనుదిరిగి ఆశ్రమానికి వచ్చి "అనుకున్నంతా అయింది" అని గ్రహించి శోక హృదయంతో సీతాన్వేషణకు ఉపక్రమించారు. జటాయువుకు దహనం జరిపారు, శబరిని దర్శించారు. నెమ్మదిగా సాగి సాగి పంపాతీరాన కిష్కింధలో కాలు పెట్టారు.

ఇంతవరకూ నడిచిన కథలో

మానవజాతికి ఆదర్శపురుషుడుగా అవతరించిన రాముడు–సత్య వాక్పాలన నియమంతో తండ్రి ఏనాడో చేసిన వాగ్దాన పరిరక్షణకు అడవుల పాలవడం కనిపిస్తుంది. మనిషికి జన్మ యిచ్చిన తల్లిదండ్రుల విషయంలో ఎలా ఉండాలో చూపించాడు. అనంతరం తనయందు అనురాగంతో వున్న భార్యతో ఎలా జీవితం సాగించాలో చూపి, అడవికి వచ్చి రాజ్యాన్ని స్వీకరించమని కోరిన భరతుని బుజ్జగించి వెనుకకు పంపుతాడు.

అప్పటికి దశరథుడు పోయాడు. కైకేయి మనసు మార్చుకుని, రాముని వెనుకకు వచ్చి రాజ్యం ఏలుకోమంది. అయినా సత్యవాక్పాలన నియమం విడువలేదు. తన తండ్రికి మిత్రుడైన జటాయువును తండ్రి వలెనే చూసుకున్నాడు. సాధువులయిన మహర్షులకు రాక్షస పీడ వదలించి శిష్టరక్షణ, దుష్టశిక్షణ నియమాన్ని పాలించాడు.

మరొక్క సన్నివేశ వివరణతో ఈ కాండను విడిచి హనుమంతుని విశ్వరూపాన్ని దర్శించడానికి వెడదాం.

❊ ❊ ❊

అరణ్యంలో గోదావరీ తీరాన ఉన్న రోజులలో...

ఒకానొక అరుణోదయవేళ నదీ స్నానానికి వెడుతున్నారు సీతారామలక్ష్మణులు. మంచు బాగా పడుతున్నది దాహబాధతో వచ్చిన ఏనుగు తన తొండాన్ని నదిలోకి పెడుతూనే వెనక్కు లాగుతున్నది, ఆ మంచు బాధను భరించలేక.

అంత చలిలో నడిచే లక్ష్మణుడు కోపంతో అన్నగారి దగ్గరగా వెళ్ళి, అన్నాడు.

దశరథుని వంటి భర్త, భరతునివంటి సాధు శీలియైన కుమారుడుగల కైకేయి అంత క్రూరంగా ప్రవర్తించి వనవాస క్లేశం నీకెలా కలిగించగలిగిందో!

భర్తా దశరథో మస్య
సాధుశ్చ భరతస్సుతః
కథంను సాంబా కైకేయీ
తాదృశీ క్రూరశాలినీ॥

అంటే రాముడంటాడు! "తమ్ముడూ! చాలా పొరబడుతున్నావు! నీకు భరతుని మీద అభిమానం గౌరవం వుంటే వాడి గుణగానం చేసి ఆనందించు, అంతేకానీ పిన్ని కైకేయిని నిందించడం నేను సహించను", అని.

అంటే వివేకం కలవారెవరయినా తమకు ఎవరి మీద అభిమానం వుంటుందో వారిని ప్రశంసించాలేకాని యితరులను నిందించడం ధర్మం కాదు.

ఒకరి గొప్పతనాన్ని చెప్పడానికి మరొకరి అవలక్షణాలనూ, క్రూరత్వాన్ని బయటపెట్టడం సక్రమమార్గం కాదని యీ సన్నివేశంలో రామచంద్రుడు చేసిన ప్రబోధం దేశ కాలాతీతంగా మానవత్వం వున్న వారందరూ మననం చేసుకుని ఆచరించాలి.

❊ ❊ ❊

ఇలా మన నిత్యజీవితంలో ఆదర్శంగా నడవడానికీ, లోక కల్యాణానికి వినియోగపడే రీతిలో బ్రతకడానికీ అవశ్యమయిన అనేకానేక ధర్మసూక్ష్మాలు, నీతి వాక్యాలూ రామాయణ సాగరంలో దొరికే ముత్యాలు, లోపలకు వెళ్ళి అన్వేషించి అందుకోవాలి.

పడవలు నడుపుకుంటూ, చేపలు పడుతూ కాలక్షేపం చేసే గుహునితో రామునికి గల మైత్రీ బంధం చూసినా, శబర స్త్రీ అయిన శబరి యిచ్చిన ఆతిథ్యాన్ని స్వీకరించి, ఆమె యోగశక్తికి శ్రీరాముడు ఆనందపడిన ఘట్టం చూసినా ఆనాడు గుణానికిచ్చిన ప్రాధాన్యం బోధపడుతుంది. కులవ్యవస్థ ఆనాడూ వున్నది కాని ఏ కులానికి చెందినవారయినా గుణం, శీలం కలవారయితే వారిని ఉన్నతంగా చూడగలిగేవారు, అంతే కుల విద్వేషాలతో సర్వనాశనం చేసుకునేవారు కారు. ఈ దృష్టి భారతంలోనూ కనిపిస్తుంది. విదురుడు, సంజయుడు యిద్దరూ సూతులే, మరి వారికున్న గౌరవం యితరులకు లేదే. ఈ విషయాలను

గ్రహించగల వివేకం వుంటే భారత రామాయణాలు వర్ణవ్యవస్థను ప్రోత్సహించడానికి పుట్టాయనే మూర్ఖత్వానికి తావుండదు.

దేశకాలాలను గమనించకుండా తమ గుడిసెలో తాము కూర్చుని అదే సర్వం అనుకునే నూతిలో కప్పలకు రామాయణ భారత సముద్రాలు అనవసరం.

❊ ❊ ❊

ఇక కిష్కింధలో ప్రవేశిద్దాం.

రామలక్ష్మణులు పంపాతీరం వెంబడి చల్లగాలిలో సాగి సాగి ఋష్యమూకం సమీపించారు. అల్లంత దూరంలో వారిని చూశాడు సుగ్రీవుడు. చూస్తూనే పలాయనం ప్రారంభించాడు. కొండలు, గుట్టలు, మిట్టలు దాటిపోతున్నాడు. ఆయన ఆప్తులు కూడా ఆయనతో పరుగు పెడుతున్నారు. అలా కొంత దూరం పోయాక హనుమంతుడు ఆయనను నిలబెట్టి :

ఏవిటీ పరుగు, ఎందుకింత భయపడుతున్నారు, అని ప్రశ్నించాడు. అప్పుడన్నాడు సుగ్రీవుడు :

హనుమా! చూస్తున్నావా ఆ తాలోత్తాల విగ్రహాలను. వారి ధనర్బాణాలు ముల్లోకాలనూ భస్మం చేయగలవు; కోదండాచుల వంటి ఆ కరవాలాలు పర్వత శిఖరాలను ముక్కముక్కలు చేయగలవు. వారిని మా అన్నగారు పంపించి ఉంటాడు నన్ను చంపడానికి. వారి కంటబడకుండా మనం పారిపోవాలి, అని అదరు గుండెతో అంటుంటే, హనుమంతుడు:

ప్రభూ! మీరు భయంతో ప్రతి విషయాన్నీ అనుమానిస్తున్నారు. వారెవరో, ఎందుకు వచ్చారో తెలుసుకు వస్తాను, మీరిక్కడే ఉండండి, అని ధైర్యం కలిగించి, భిక్షుక రూపంతో వెళ్ళి, వినయంగా చేతులు జోడించి, రామలక్ష్మణులు ఎదుట నిలబడి :

ఆర్యా, తమరెవరు! ఏ పని మీద వచ్చారు.

మీ ఆయుధాలూ, ఆకారరేఖలూ చూస్తుంటే రాజవంశీయులవలె వున్నారు. కాని, రాచబిడ్డ లెవరూ జటాజూటాలతో, నారచీరలతో ఉంటారని వినలేదు. దయచేసి మీ వివరాలు చెపుతారా, అని ప్రశ్నించగా వారుభయులూ మాట్లాడలేదు.

అప్పుడు హనుమంతుడు తన తప్పు తెలుసుకుని – మన్నించండి, నేనెవరినో మీకు చెప్పకుండా మీ వివరాలడిగాను. ఈ కిష్కింధాధిపతి వాలి తన సోదరుడైన సుగ్రీవుని రాజ్యభ్రష్టుని చేశాడు. ఆయన ఈ ఋష్యమూకం మీద తల దాచుకున్నాడు, నేను ఆయన మంత్రులలో ఒకడను, నన్ను హనుమంతు డంటారు. మా ప్రభువు మీ స్నేహం కోరుతున్నాడు, అని రామలక్ష్మణులను చూస్తూ వినయంగా నిలబడ్డాడు.

అంతే, ఆ నాలుగు మాటలతో హనుమంతుని ధీశక్తిని గమనించిన రామచంద్రుడు, సంతోష భరిత వదనంతో లక్ష్మణుని వైపు తిరిగి :

తమ్ముడూ, ఈయన మాటలు విన్నావా! ఋగ్యజుస్సామ వేదాలు అధ్యయనం చేసి, శిక్ష, వ్యాకరణ, జ్యోతిష, కల్ప, నిరుక్త ఛందశ్శాస్త్రాలు కరతలామలకం చేసుకున్నవాడు తప్ప యింత సుష్ఠుగా మాట్లాడలేడు. మాట్లాడుతూన్నప్పుడు ఏ అవయవాలు కదలలేదు. అపశబ్దం లేదు. స్పష్టంగా క్లుప్తంగా చెప్పాడు.

అనవసరంగా సాగదీయలేదు. అక్షరాలు మ్రింగడం లేదు. పలికిన ప్రతి అక్షరం ఎక్కడ ఒత్తాలో ఎక్కడ తేల్చాలో తెలిసి పలికాడు, మధురంగా, హృదయానికి ఆహ్లాదం కలిగిస్తూ వ్యవహారమంతా నడిపించాడు, అంటూ హనుమంతునిలోని మాట్లాడే శక్తిని వర్ణిస్తూ చదివిన శ్లోకాలు చూడండి.

నానృగ్వేద వినీతస్య
నా యజుర్వేద ధారిణః
నా సామవేద విదుషః
శక్యమేతాం విభాషితుం॥

అవిస్తరం అసందిగ్ధం
అవిలంబితం అవ్యథం
ఉచ్చారయ కళ్యాణీం
వాచాం హృదయహర్షిణీం॥

ఇలా మాట్లాడగల సచివుడొక్కడు దొరికితే ముల్లోకాలనూ పాదాక్రాంతం చేసుకోగలం – అని అన్నప్పుడు రామాయణం చదివే మన దృష్టి అక్కడ ఆగుతుంది.

మాటకు ఇంత విలువ యిచ్చి, రాముని చేత అంతగా ప్రశంసింప జేయడంలో వాల్మీకి అభిప్రాయం ఏమై ఉంటుందని ఆలోచిస్తే ఒక విషయం విశదం అవుతుంది.

ప్రపంచంలోని పశు పక్షి సరీసృపాది ప్రాణికోటిలో మాట్లాడగల శక్తి మానవు డొక్కడికే లభించిన వరం, అది ప్రకృతి ప్రసాదించినా, పరమేశ్వరుడు అనుగ్రహించినా!

పేడలో పురుగు నుండి మేడలో నరుని వరకూ ఆహారం, నిద్ర, భయం, సంతానోత్పత్తి సమాన ధర్మాలే.

అయితే ఇందులో ఉచితానుచితాలను గ్రహించి, గ్రహించిన విశేషాలనూ వ్యక్తీకరించగల వాక్కు మానవునికే వున్నది.

ఏ ప్రాణికీ లభించని యీ విశిష్టశక్తిని సక్రమంగా వినియోగించుకోదలచినవారు రామాయణంలో హనుమంతుని గురుత్వం స్వీకరించి, ఆయన మాట్లాడే విధానాన్ని అవగాహన చేసుకోగలిగితే చాలు, ధన్యులవుతారు అని భావించాడు వాల్మీకి కనకనే రామాయణ నాయకుడు, ఆదర్శపురుషుడు అయిన రాముని నోట ఆ మాట పలికించాడు.

రామచంద్రుడు తనకు తానై ఎవరినీ యింతగా ప్రశంసించలేదు. రామాయణంలో మరేవ్యక్తీ కూడా ప్రవేశిస్తూనే తనధీశక్తిని యింతగా ప్రకటించుకోనూలేదు. అంటే హనుమంతుని పాత్రను ఏదో భజనపరుడుగా, భక్తశిఖామణిగా కాక వ్యక్తిత్వం వికసించి, మనసు పరిణతి చెందిన మహావ్యక్తిగా స్వీకరించి, ఆయన వెంట తిరిగితే మనలో కొందరికయినా మాట్లాడే శక్తి కొంత అబ్బుతుందని కవి భావించాడు. ఆ దృష్టితో కిష్కింధ, సుందర, యుద్ధ కాండలలో హనుమంతుని ధీశ క్తినీ, ధీరత్వాన్నీ అడుగడుగునా చూసుకుంటూ వెడితే, మనం కూడా ఎప్పుడు ఎక్కడ ఎవరితో ఎలా, ఎంత మాట్లాడాలో ఎలా ప్రవర్తించాలో తెలుసుకోగలుగుతాం.

రామునికి సుగ్రీవునితో మైత్రి జరిగింది.

స్నేహసమయ వాగ్దానానుసారం రాముడు వాలిని నేలకూల్చాడు.

నేలకూలిన వాలి బాధతో, ఆవేశంతో :

రామా! ఎంత అన్యాయానికి ఒడిగట్టావయ్యా! దేవాసుర సంగ్రామాలలో దేవతలకు సాయపడే ఇక్ష్వాకువంశ క్షత్రియుల యింట దశరథుని కుమారుడుగా జన్మించిన నువ్వేనా యీ పని చేసింది.

నా పట్టమహిషి తార చెప్పిందయ్యా ఇలా జరుగుతుందని, కాని విశ్వామిత్ర యాగ సంరక్షణ చేశావనీ, శివధనస్సు విరిచావనీ, జనస్థానంలో ఖరదూషణాదులను ఒంటరిగా నిలబడి నేల కూల్చావనీ విని శూరుడైన రాచబిడ్డ యిలా అక్రమానికి దిగుతాడనుకోలేదయ్యా.

ఇప్పుడు నా ప్రాణాలు పోతున్నందుకు నాకు బాధలేదు, అక్కడ వీరస్వర్గంలో దశరథ మహారాజు అడిగితే, ఏం చెప్పను. ఇలా చేశావని చెపితే ఆయన ఎంత బాధపడతాడు?

అది సరే, నీ వీరత్వం యిలా అయింది. ఇక నీ ధీశక్తి కూడా అపహసించవలసిందే

నీ భార్యను అపహరించిన రావణుడెవడు?

నా బాహుమూలంలో యిరికి సప్తసముద్రాలలో మునిగినవాడు. ఈ సంగతి తెలిసినప్పుడు నువ్వు నా దగ్గరకు వచ్చి–ఇదీ కథ–అని చెపితే ఈ పాటికి వాడిని నీ పాదాల మీద పడవేసేవాణ్ణి.

రామా! ధీమంతుడవూ కాదు, ధీరుడవూ కాదు, అయినా వీరంతా నిన్నెందుకు నెత్తిమీద పెట్టుకుంటున్నారో తెలియడం లేదు–

అని రామాయణంలోనే వాలి రాముని నిలబెట్టి ప్రశ్నించాడని ఎరుగని అల్పబుద్ధులు ఈనాటికీ వాలి వధ అన్యాయం కాదా అని ఆ పెద్ద కోతిరాజు అడిగినట్లే ఈ పిల్లకోతి బుద్ధులూ ప్రశ్నిస్తున్నారు.

అప్పుడు రామచంద్రుడు వాలికి చెప్పిన సమాధానమే ఈ నాటి సంశయ గ్రస్తదేహులకూ చెప్పాలి.

వాలి ప్రశ్న విన్న రామభద్రుడు ప్రసన్న గంభీరుడై-

వానరేశ్వరా! కపిలోక ప్రభువువైన నువ్వేనా యీ ధర్మసందేహం అడుగుతున్నది? ఎవడో వివేకం లేని సామాన్యుడు అడగవలసిన మాటలవి.

అయినా నీకు సమాధానం యివ్వాలి నేను, సావధానంగా విను.

ధర్మం వున్నదే అది బహుసూక్ష్మమైనది. ప్రతి ప్రాణిహృదయం ధర్మసూక్ష్మాన్ని గ్రహించగలదు; కాని దాన్ని అంగీకరించడానికి మనస్సు సిద్ధపడదు.

నువ్వు చెప్పినట్టు దేవాసుర సంగ్రామాలలో దేవతల పక్షాన నిలిచి పోరాడే దశరథమహారాజు కడుపున పుట్టిన నేను- ఒక సామాన్య వానరుని దగ్గరకు వచ్చి దీనంగా: అయ్యా! నా భార్యను ఎవడో అపహరించాడు, దయచేసి ఆ రాక్షసుని బారి నుండి తప్పించి నా భార్యను నాకు సమకూర్చండి అని అడిగే దశకు దిగుతానని భావించడం ఎంత అవివేకం!

ఇక- చెట్టుచాటున నిలబడి కొట్టడం వీరత్వమా అని అడుగుతున్నావే, రాజనీతి తెలిసిన వాడెవడయినా యిలా ఆలోచిస్తాడా?

ఈ భూమండలానికి ప్రభువులు ఇక్ష్వాకు వంశీయులు. ఆ వంశంలో పుట్టిన నా సోదరుడు భరతుడు రాజుగా దీన్ని పాలిస్తూ ఈ వనకాననాలకు నన్ను ప్రతినిధిగా పంపాడు.

సింహాసనాసీనుడైనవాడు ధర్మరక్షణ కోసం జీవితం అంకితం చెయ్యాలి. ఎక్కడయినా ఎవడయినా అధర్మానికి దిగితే ఆ క్షణంలో వానికి ప్రాయశ్చిత్తం చేయాలి. మాకు సామంతుడవైన నువ్వు నీ సోదరుడు జీవించి వుండగా వానిని రాజ్యభ్రష్టుని చేసి వాని భార్యతో కులుకుతున్నావు. పుత్రసముడైన తమ్ముని భార్యను అనుభవించే పాపిని ఉత్తరక్షణంలో యమపురికి పంపమని ఇక్ష్వాకుల శిక్షా స్మృతి.

ఆ శాసనాన్ని అనుసరించి నీ అధర్మానికి నేను శిక్షవేశాను, అంతే! రాజులు సేవకులతో సామంతులతో యుద్ధానికి దిగరు. ద్వంద్వయుద్ధానికి తొడగొట్టరు. తెలిసిందా ధర్మసూక్ష్మం.

అనగానే వాలి సంతోషంతో : రామభద్రా! ఇప్పుడు తృప్తిగా ప్రాణాలు వదులుతాను. ధర్మరహస్యం మీకు తెలిసినట్లు మాకు తెలియదు. ఆవేశంతో ఏమేమో అన్నాను మన్నించు, అన్నాడు.

నాడు వాలికి రాముని సమాధానం సంతృప్తి కలిగించినా యీనాటి పిల్లకోతులకు మాత్రం బాధ వదలడం లేదు. వదలని దీర్ఘరోగులను దూరంగా ఉంచి -

సుగ్రీవునికి పట్టాభిషేకం అయేసరికి వానకాలం రావడం వల్ల వానలు వెనకబట్టగానే తన సేనాసమూహాలను నాలుగు దిక్కులకూ సీతాన్వేషణకు పంపుతానన్నాడు.

సింహాసనం ఎక్కింది మొదలు రాజభోగాలతో మునిగితేలుతూ మదిరాపానంతో, మదవతీ పరీరంభంతో లోకాన్ని విస్మరించాడు. రాజకార్యాలు కూడా మంత్రుల మీదనే విడిచిపెట్టాడు.

ఆ రోజులలో ఒకనాడు హనుమంతుడు సాహసించి వెళ్ళి–

ప్రభూ! మిత్రులకు చేసిన వాగ్దానాన్ని నెరవేర్చడం మీ వంటి ఉత్తమ పురుషుల ప్రధాన కర్తవ్యం. అది మీరు మరచిపోయారనుకోను. ఆ విషయమై కొంత శ్రద్ధ వహించాలని గుర్తు చేస్తున్నాను, అన్నాడు.

ఇదే హనుమంతుని ధీశక్తి. తన ప్రభువయినా కర్తవ్య నిర్వహణలో ఏమరుపాటు పడితే వానిని ఉచితరీతిని కార్యోన్ముఖుని చేయడానికి సంకోచించడు.

ఇంతలో వానలు వెనుకబడ్డాయి, శరదృతువు ప్రవేశించింది, రెండు మూడు రోజులు గడిచాయి, అయినా సుగ్రీవుడు మత్తులో ప్రేయసీ పరిష్వంగంలోనే వున్నాడు.

అంతకాలం ఓరిమి వహించిన రామభద్రుడు ఆగ్రహంతో :

లక్ష్మణా! ఈ వానరేశ్వరుడు తన వాగ్దానం విస్మరించి వారుణీమదవిహ్వలుడై నారీజన మధ్యంలో పడివున్నట్టున్నాడు; వెళ్ళి చెప్పు :

సుగ్రీవా! మీ అన్నయ్య చేసిన అధర్మానికి వాని నొక్కనినే సంహరించాను. ఇప్పుడు నువ్వు ఆడినమాట తప్పినట్లయితే బంధుమిత్ర సమేతం నీ వానరులందరినీ యమసదనం చేరుస్తాను. అసత్యవాదికి అంతకంటె శిక్ష లేదు, అన్నాడు.

నచ సంకుచితః పంథా
ఏన వాలీ హితో గతః
సమయే తిష్ఠ సుగ్రీవ
మా వాలి పథమస్వగా! ॥

ఏక ఏవ రణే వాలీ
శరేణ నిహితో మమా
త్వాంతు సత్యాదతిక్రాంతం
హనిష్యామి స బాంధవం ॥

* * *

రామాయణంలో రామచంద్రుడు సాధారణంగా ఆవేశాగ్రహాలకు లొంగడు. ఎంతటి విపత్తు మీద పడినా గంభీరంగా దానిని అనుభవిస్తాడు, కాని అబద్ధం ఆడేవాడు కనిపించాడో ఆయన కుపిత భుజంగంలా లేస్తాడు, ఇంత కోపం మరెక్కడా కనిపించదు.

ఇక్కడ మరొక ప్రధానాంశం ముచ్చటించాలి.

భారత, రామాయణ, భాగవతాలయినా, మిగిలిన పద్దెనిమిది పురాణాలూ ఉపపురాణాలు అన్నీ కూడా వేదప్రతిపాదితమయిన సత్య, ధర్మ ప్రబోధానికి అవతరించినవే. అందునా–

సత్యం వద - ధర్మం చర

అనే రెండు మాటలను మానవునికి ఎక్కించడానికే యివన్నీ అవతరించాయి. సత్యవాక్పాలన నియమంతో, ధర్మబద్ధ జీవితం గడపగలిగితే ప్రపంచం శాంతిసౌఖ్యాలతో అలరారుతుంది. ఆ దృష్టితోనే సత్యం వద అనే ప్రధాన వాక్యాన్ని విశదం చెయ్యడానికే రామాయణం, ధర్మం చర అనే సూత్రాన్ని వివరించడానికి మహాభారతం వెలువడ్డాయి.

సత్యవాక్పాలన నియమ విషయంలో అంత పట్టుదల చూపి ఆ నియమాన్ని అతిక్రమించే వారిపట్ల అంత కఠినంగానూ రామచంద్రుడు ప్రవర్తిస్తాడు. ఈ రహస్యం తెలిసిన తరువాయి రాముని ఆగ్రహానికి కారణం అర్థమవుతుంది.

❊ ❊ ❊

లక్ష్మణస్వామి ధనుర్ధారియై కిష్కంధలో కాలు పెట్టి, అంతఃపుర ద్వారం దగ్గర నిలబడి ధనుష్టంకారం చేశాడు. సుగ్రీవుని మైకం జారింది, తానుగా వెళ్ళి లక్ష్మణునితో మాట్లాడడానికి ధైర్యం చాలక తారను పంపాడు.

తార కూడా తక్కువ తిన్నది కాదు, ఆమె కూడా మధుపానం చేసిన మత్తులోనే వుంది. కన్నులరమూతలు పడుతున్నాయి, వడ్డాణం జారుతున్నది; వెన్ను నిలబడడం లేదు. అలానే తడబడే అడుగులతో వచ్చింది.

సా ప్రస్ఖలంతీ మద విహ్వలాక్షీ
ప్రలంబ కాంచీగుణ హేమదామ్నా
సలక్షణా లక్ష్మణ సన్నిధానం
జగామ తారా సమితాంగమష్టి॥

అంత మైకంలో వున్నా, ఆమె మనస్సు వశం తప్పలేదు; మాటలో తడబాటు లేదు, అదీ తార శక్తి.

అతి చాకచక్యంగా లక్ష్మణస్వామితో మాట్లాడడానికి ఉపక్రమించి;

"రఘువంశీయుడా! పర స్త్రీని కన్నెత్తి చూడని నీ శీలానికి తల వంచి నమస్కరిస్తున్నాను. ఇంతకూ నీ ఆగ్రహానికి కారణం ఏవిటయ్యా! ఎవరి మీద యింత కోపం నీకు. మీ అనుగ్రహంతో సింహాసనం యెక్కి, రాజభోగాలు అందుకున్న స్నేహితుని మీదనేనా యింత కన్ను లెర్రజేస్తున్నావు?

"ఇంతకూ ఆయన ఏం చేశాడని! చిరకాలం కొండల మీద, గుట్టల మీద నానా క్లేశాలూ పడి, భార్యాదూరుడై విరహ వ్యధతో తిండీతిప్పలు లేకుండా బ్రతికినవానికి అమాంతం సామ్రాజ్యభోగాలు లభించాయి. అవి అనుభవించకుండా ఉండగలడా!

పైగా కామం మనిషిని ఎంతగా వంచించగలదో నీకు తెలియదయ్యా! అరణ్యంలో

ఆశ్రమాల తీరాన ముక్కు మూసుకుని తపస్సు చేసే విశ్వామిత్రులవారే పడిపోయారయ్యా, మేనకా దర్శనంతో. అంతటి మునీంద్రులే అలా అయితే వానరుల మాట చెప్పాలా?

అయినా ఆయన మీ విషయంలో అన్యాయాలేమీ చెయ్యలేదే. ప్రపంచం నలుమూలల నుంచీ వానరసేనలను రప్పించాడు. మిగిలిన యోధులు నేడో రేపో దిగుతారు. వారు కూడా రాగానే అన్వేషణకు పంపుతాడు.

ఇంతసేపు ద్వారంలోనే నిలబెట్టి మాట్లాడాను. అంతఃపురంలోకి రావయ్యా! స్నేహితుని అభ్యంతర మందిరంలోకి స్వేచ్ఛగా రావచ్చు. లోపలకు వచ్చి మా సత్కారం అందుకో, అని లక్ష్మణునితో సుగ్రీవుని దగ్గరకు నడుస్తుంది.

ఇంత తెలివైన స్త్రీ పాత్ర రామాయణంలో మరొకతె లేదు. తెలివితేటలకు తోడు ఆమె ప్రకృతి కూడా బహు చిత్రమైనది.

సింహాసనాసీనుడైన వాలితో హాయిగా భోగాలనుభవించి వాలి మరణించాడనుకుని సుగ్రీవుడు వచ్చి సింహాసనం ఎక్కితే వానితోను సుఖపడింది. వాలి తిరిగి వచ్చాడు, వాని ప్రక్కనే చేరింది. చివరకు వాలి మరణించాడు, సుగ్రీవునితో సుఖపడుతున్నది.

అంటే అధికారంలో ఎవరు వుంటే వారితో విలాసంగా గడుపుతూ వారిని తన చేతులలో పెట్టుకు ఆడించటంలో తారను మించినది లేదు. ఈ తరహా తారలు ఈనాటికీ నగరాలలో మంత్రుల వెంట, ఉన్నతాధికారుల విలాస భవనాలలో కనిపిస్తూనే వుంటారు. వారికి యితర విషయాలతో నిమిత్తం లేదు. హాయిగా భౌతిక సుఖాలు అనుభవించడమే!

❊ ❊ ❊

ముందుకు సాగబోయే ముందు యిక్కడే మరొక విషయం కూడా ముచ్చటించాలి.

వాలి నేలకూలిన వార్త వినగానే గోలు గోలున విలపిస్తూ పరుగు పరుగున వచ్చి ఆ దేహం మీద పడి యింతసేపు యేడ్చి :

రామభద్రా! తమరు ధర్మమూర్తులని విన్నాను. ధర్మదృష్టితో నన్ను కూడా నా భర్త వెంట పంపవయ్యా. భార్యాభర్తలను విడదియ్యరాదని ఎరుగనివారు కారు రాఘవులు. ఆలస్యం చెయ్యక నా మీద బాణం సంధించు, అంటుంటే రామునితో పాటు అక్కడున్న వానరయోధు లందరూ స్తంభించారు.

ఎవరికీ ఏమీ పాలుపోవడం లేదు. వానరులందరికీ వాలి మీద ఎంత గౌరవం వున్నదో తార మీద కూడా అంత గౌరవమూ వున్నది. వానర రాజ్యానికి వాలి భుజబలం రాతికోట అయితే, తార ధీశక్తి దాన్ని రక్షించే అగాధ కందకం.

ఈ విషయం తెలిసిన హనుమంతుడు వినయంగా ఆమె దగ్గరకు వెళ్ళి, చేతులు జోడించి–

మహారాణీ! నువ్వు కూడా సామాన్య స్త్రీవలె శోకిస్తున్నావా! దేనికోసం ఈ బాధ. ఏనాడో ఒకనాడు అందరం వెళ్ళవలసిన వారమే, ఈ దేహం శాశ్వతం కాదు. మరణించిన వారికై శోకించినంతలో వారు తిరిగి వస్తారా!

విచారాన్ని విడిచిపెట్టు. ఒక్కసారి నీ బిడ్డ అంగదుని వైపు చూడు. తండ్రితో సమానమైన పరాక్రమం కలవాడు, ఈ రాజ్యానికి అధిపతి కాదగ్గవాడు. వానిని సింహాసనం ఎక్కించి, రాజమాతవై, ఈ వానర బృందాలను నడిపించు. నీ ధీశక్తితో వీరందరూ సుఖంగా వుంటారు, అన్నాడు.

ఇక్కడ ఒక విషయం సావధానంగా చూడాలి.

రాముడు వాలిని చంపి సుగ్రీవునికి వానర రాజ్యం అర్పిస్తానన్నాడు. ఆ విషయం తెలియకుండానే హనుమంతుడు అంగదునికి రాజ్యాభిషేకం జరపమంటున్నాడా! అంటే ఆయన వివేకం ఎలా పనిచేసినదీ తార సమాధానం విన్నాక తెలుస్తుంది. ఎంత బాధతో వున్నా కన్నతల్లి గుండె తనబిడ్డల ఔన్నత్యం చూడగానే ఆనందిస్తుంది. అందునా సింహాసనాసీనుడవుతున్నాడు తన బిడ్డ అంటే ఎంత పొంగుతుంది హృదయం. పొంగడం సహజమే కాని రాజనీతి ఎరిగిన తార అలా పొంగిపోయి ముందుకు నడుస్తుందా!

హనుమా! ఏమిటయ్యా అంటున్నావు! ఆడదానికి కన్నవారి కంటె, ఆమె కన్నబిడ్డల కంటె కూడా కట్టుకున్న భర్త అధికుడయ్యా! వెయ్యిమంది అంగదులున్నా నా భర్త లేని లోటు తీరదు. పైగా పిల్లలకు తండ్రి వంక వారు ఆత్మీయులైనట్లు తల్లి వంక వారు కారు. ఏనాడు మీ మహారాజు నేలకూలాడో ఆనాడే నా సౌభాగ్యం, సంతోషం నాశనమయ్యాయి. నేను ఆయనతోనే వెళ్ళాలి అన్నది.

తార అలా అంటుందని ఎరిగిన ధీమంతుడు హనుమంతుడు. అందుకే ఆవిడను శాంతింపజేసి, పరిస్థితిని చక్కబరచడానికే ఆ మాట అన్నాడు. హనుమంతుని వాగ్వైభవం, ధీశక్తి గురించి రామచంద్రుడు అంతగా ఎందుకు ప్రశంసించాడో వివరించడానికే ఈ సన్నివేశ ప్రస్తావన.

* * *

వానర యోధులందరినీ అన్ని దిశలకూ పంపారు. మూడు దిక్కులకూ వెళ్ళినవారు నిరాశతో నెల తిరగగానే కిష్కింధ చేరి దక్షిణదిశగా వెళ్ళిన అంగద, జాంబవంత హనుమంతుల రాకకోసం ఎదురు చూస్తున్నారు.

* * *

జాంబవాన్యత్ర నేతాస్యాత్
అంగదశ్చ బలేశ్వరః

హనూమాంశ్చాప్యధిష్ఠాతా
న తస్య గతిరన్యథా॥

సుగ్రీవుడు దక్షిణ దిశగా పంపే వానర యోధులకు అంగదుడు నాయకుడన్నాడు. వారు తిరిగి వచ్చి మధువనంలో ఒళ్ళు తెలియకుండా త్రాగి తందనాలాడుతున్నారని విన్నప్పుడు–

జాంబవంతుడు నాయకుడుగా, అంగదుడు బలాధిపతిగా, హనుమంతుడు అధిష్ఠాతగా వున్న సేనకు ఎదురుండదు. కార్యసాధన తథ్యం అన్నాడు. అంటే కార్యరంగంలో ప్రవేశపెట్టేటప్పుడు అంగదుని నాయకునిగా చెప్పి, సాధనానంతరం ముగ్గురిని ప్రధానులుగా పేర్కొనడం చూస్తే, అందునా జాంబవంతుని పేరు ముందుగా చెప్పి తన వివేకాన్ని ప్రకటించుకున్నాడు.

నాయకుడైనవాడు క్లిష్టదశ ఏర్పడినప్పుడు గుండె నిబ్బరంతో మనస్సు చెదరనీయక కర్తవ్యాన్ని బోధించి, తన వారిలో సమర్థుని ఎంపికచేసి విజయం సాధించాలి. ఆ పని చేసినవాడు జాంబవంతుడని మనకు తెలుసు, చేయగలవాడు ఆ వయసు పండిన అనుభవజ్ఞుడే అని సుగ్రీవునికి తెలుసు. కార్యనిర్వహణదక్షుడు హనుమంతుడనీ ఎరుగును.

ఇక్కడ ఈ ప్రస్తావన దేనికీ అంటే, సుందరకాండలో అడుగు పెట్టబోయే ముందు ఈ ముగ్గురినీ అనుక్షణం పరిశీలిస్తూ వెళ్ళాలి కనక.

హనుమంతుని ధీశక్తి

అంగద జాంబవంత హనుమంతులతో మిగిలిన వానరవీరులు దక్షిణ దిశగా సాగి సాగి సీతాదేవి జాడ కనిపించక నిరాశా నిస్పృహలలో పడ్డారు. సుగ్రీవుడు పెట్టిన గడువు దాటింది. తిరుగుతూన్న ప్రాంతంలో ఆహారం దొరకకపోగా దాహ శాంతికి నీరు కూడా ఎక్కడా కనిపించలేదు. అంతలో స్వయంప్రభ గుహ కనిపించింది. అద్భుతమైన ఆ గుహ విశేషాలు పాఠకులు రామాయణంలో చూడాలి. అందులో స్వాదుజలాలు పుచ్చుకుని, మధుర ఫలాలు ఆరగించి సముద్రతీరం చేరారు. సువిశాలమైన సాగరాన్ని లంఘించడం అసాధ్యం అని నిరాశపడి నీరు కారిపోతున్న సమయంలో జటాయువు సోదరుడు సంపాతి కనిపించి సీతను అపహరించిన రావణుడు లంకలోనే సీతను దాచి వుంచినట్లు చెప్పాడు.

సముద్రం దాటే వీరుడు లేడు, వెనుదిరిగి వెడితే సుగ్రీవుడు మరణశిక్ష విధిస్తాడు. అంతదాకాపోయి చావడం కంటే స్వయంప్రభ గుహలో జీవితం గడపాలని నిశ్చయించు తున్నప్పుడు అంగదుడు సంతోషంతో అంగీకరించాడు.

అప్పుడు హనుమంతుడు : యువరాజా! ఈ వానరులు, భార్యాబిడ్డలకు దూరులై

నీతో ఎంతకాలం ఉంటారనుకుంటున్నావు? పైగా స్వయంప్రభ గుహ ఎవరికీ తెలియనిదనీ, ఆ గుహలో అడుగు పెట్టడం అసాధ్యమనీ అనుకుంటున్నావేమో!

రామానుజుడు ధనుస్సు సంధించాడో ఆ కొండకు తూట్లుకొట్టి జల్లెడ చేయగలడు. అదీగాక ఈ వృద్ధుడు జాంబవంతుడు, నీలుడు, నేను మేమెవరం సుగ్రీవుని సేవను విడిచిపెట్టం. మరో మాట. సుగ్రీవుని అనంతరం ఈ రాజ్యం నీదే. అందుచేత యిక్కడ చిన్న రాజ్యం స్థాపించాలనుకోకు అని హితబోధ చేశాడు.

సరే, చివరకు సాగర లంఘన సామర్థ్యం హనుమంతునికే ఉన్నదని జాంబవంతుడు నిర్ణయించి ఉత్సాహ వాక్యాలు పలికాడు.

హనుమంతుడు శరీరాన్ని పెంచి మహేంద్రగిరిపై నిలబడి :

మిత్రులారా! యోధులారా! బయలుదేరుతున్నాను. రామబాణంలా వాయువేగంతో వెళ్లి జానకీదేవిని చూసి వస్తాను. ఆవిడ కనిపించకపోతే రావణ సమేతంగా లంకను పెళ్లగించి తీసుకువస్తాను, అని పైకి లేచాడు.

యధా రాఘవ నిర్ముక్తః
శర శ్వాసన విక్రమః

దారిలో మైనాకం అతిథిపూజ సలుపుతానంది. సురస మింగుతానంది. ఛాయాగ్రాహిణి సింహిక క్రిందికి లాగబోయింది. ఏమీ పట్టించుకోకుండా లంకా నగరం కోట గోడ మీద కాలు పెట్టాడు.

అంటే మనం ఒక ఘనకార్యాన్ని ప్రారంభిస్తే ముందుగా లోకంలో సజ్జనులు విందులూ, సన్మానాలూ చెయ్యడానికి సంకల్పిస్తారు. అదే మైనాకుని అతిథి సత్కార ప్రయత్నం.

ఆ తరువాయి మన శక్తిని పరీక్షించి, మన యుక్తిని గ్రహించడానికి సురసలు అడ్డు పడతారు. చివరగా ఛాయాగ్రహాలు మన ప్రయత్నాన్ని సర్వనాశనం చెయ్యడానికి ఎదురవుతాయి.

సన్మానాలనూ, అవమానాలనూ, అవరోధాలనూ లెక్కచెయ్యకుండా మన కృషి మనం సాగిస్తుంటే కార్యసాధకుడైన హనుమంతుడు లంకలో అడుగు పెట్టినట్టుగానే మన పని మనం సక్రమంగా నిర్వర్తించగలుగుతాం.

సుందరకాండ పారాయణం చేసేవారికి ఈ వివరాలు అవసరం లేదు. వారు భక్తితాత్పర్యాలతో ఏకాగ్రచిత్తంతో మోక్షసాధనకు కృషి చేస్తారు. ఇది మంత్రశాస్త్రం అనుకునేవారు ఆ బీజాక్షరాల ఉపాసనతో సంతృప్తిపడతారు.

కాని, భౌతికవాదులు సుందరకాండ ఎందుకు చదవాలీ అంటే వివేకంతో ధీరత్వంతో హనుమంతుని వలె లక్ష్యసాధన చెయ్యడానికే.

సరే, లంకానగరం కోట గోడ మీద తిరుగుతుండగానే నగర రక్షణ ప్రధానాధికారిణి యైన లంఖిణిని నేలకూల్చి, చీకటిపడగానే నగరంలో ప్రవేశించి సీతాన్వేషణ ఆరంభించాడు.

లంకానగరం

సుందరకాండలో పది పన్నెండు సర్గల వరకూ లంకానగర వర్ణనమే. ఈ వర్ణన చూస్తుంటే యాంత్రిక నాగరకత విజృంభించిన అత్యంత ఆధునిక నగరాలయిన న్యూయార్క్, పారిస్, మాస్కో, లండన్ నగరాలు కూడా లంకానగరంతో తులతూగవు. ఈ నగరాలలో లభించని సుఖభోగాలు లంకలో ప్రతి యింటా అందరికీ అందుబాటులో ఉంటాయి. నిశితంగా పరిశీలిస్తే సామ్రాజ్యవాదాన్నీ, సామ్యవాదాన్ని సమ్మేళనం చేసి తన ప్రజలందరికీ – వివక్ష లేకుండా భౌతిక సుఖాలన్నీ సమకూర్చినవాడు రావణుడు!

Each and every Palace in Lanka is attached with a BAR and a Cabaret.

పానశాల, నర్తనశాల లేని భవనం లంకలో కనిపించదు, అంత పాశవిక ప్రవృత్తి ప్రబలిన ప్రదేశం రావణరాజ్యం.

ఈ విషయాలను సావధానంగా చూద్దాం – హనుమంతుని వెంట తిరుగుతూ.

సూర్యుడు అస్తమించాడు, సంధ్యకాంతులు కూడా సన్నగిల్లాయి. చీకట్లు రాబోతున్నాయి. అంతే! లంకానగరం అంతా పట్టపగలులా కాంతి నిండింది. రాజవీధులలో, సందు, గొందులలో రత్న, మాణిక్య దీపకాంతులు. ఆ వెలుగులో అన్వేషణకు బయలుదేరాడు. ఒక్కొక్క భవనం చూస్తున్నాడు. ఆ భవనాలలో యథేచ్ఛగా వివిధ విధానాలయిన మద్యాలు పానం చేస్తూ, మాంసాలు ఆరగిస్తున్నారు. ఈ త్రాగుబోతులు ఈనాటి నాగరక మద్యపాన శాలల్లో ఒళ్ళు తెలియకుండా త్రాగి పడిపోయి దొర్లుతూ, కారు కూతలు కూసేవారికి గురువులు. స్త్రీలు కూడా సుఖంగా పీకలదాకా త్రాగి అర్ధనగ్నంగా, పూర్ణనగ్నంగా తిరుగుతూ ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ముద్దులు పెట్టుకుంటున్నారు. వీణా వేణు మృదంగ వాద్యాలతో నాట్యాలు సాగుతున్నాయి. నగరంలో ఏడంతస్థుల, ఎనిమిదంతస్థుల భవనాలు, కొన్ని భవనాలు ఆకాశాన్ని అంటుతున్నాయి. కందకాల మీద సంక్రామాలున్నాయి. సంక్రామం అంటే Hanging Bridge. అవసరమైనప్పుడు ఈ వంతెనలు దింపడానికి, ఎత్తడానికి ప్రత్యేకంగా కొందరు సైనికులు. ఇందరు త్రాగి తందనాలాడుతున్నా నగర రక్షణ బలం కంటి మీద రెప్ప వెయ్యకుండా కాపలా తిరుగుతూనే వున్నారు. ఇదీ లంకానగరం. ఈ వర్ణనను యధాతథం వాల్మీకంలో చదవగలిగితే మంచిది, ఆ సత్తువ లేనివారు తమకు అర్థమయ్యే తెలుగు వచనంలో వెలువడిన గ్రంథాన్నయినా చదివి వినిపించడం, వినిపించుకోవడం అవసరం.

అలా తిరిగి తిరిగి రావణ భవనంలో శయ్యాగారం చేరి, నిశిత దృక్కులతో చూస్తూ, ఒక నారీమణిని తిలకించి :

ఆస్ఫోటయామాస చుచుంబ పుచ్ఛం
ననంద చిక్రీడజగౌజగామ
స్తంభా నరోహన్ నిపపాత భుమౌ
నిదర్శయన్ స్వాం ప్రకృతిం కపీనాం.

జబ్బ చరుచుకున్నాడు, తోక ముద్దుపెట్టుకున్నాడు. సంతోషంతో గంతులు వేసి కపి ప్రకృతినంతనూ ప్రదర్శించాడు. ఇంతకూ కారణం రావణుని హంసతూలికాతల్పం మీద వున్న యిల్లాలిని చూచి ఆవిడే జానకీదేవి అనుకోవడం.

ఆ సంతోషం రెండు క్షణాలే వుంది. మరు నిమేషంలో ఆలోచన చేశాడు. ధర్మాత్ముడైన రాముని భార్య యిలా పరపురుషుని ప్రక్కన పడుకుంటుందా, అసంభవం అనుకుని లెంపలు వాయించుకున్నాడు.

ఎంతటి ధీమంతుడయినా ఒకోసారి పొరబడతాడు, అది హనుమంతుడయినా సరే. అయితే ధీమంతులు తమ పొరపాటుని త్వరలోనే గ్రహించి దిద్దుకుంటారు, అనే విషయాన్ని ఈ సన్నివేశంలో మనం తెలుసుకోవాలి.

రావణభవనం వీడి వెలుపలకు వచ్చి, ఆలోచన సాగించాడు.

ఇంక నేనేం చెయ్యాలి! వెనుదిరిగిపోవాలి. పోయి? సాగరానికి ఆవలి వొడ్డున వున్న అంగద జాంబవంతాదులు. ఆశాపూర్ణ నయనాలతో నాకోసం ఎదురుచూస్తూ స్వాగతం పలుకుతారు.

వారందరికీ ఏమని చెప్పను!

నూరు యోజనాలు దాటి వెళ్ళి, లంకానగరం అంతా తిరిగివచ్చాను, జానకీదేవి కనిపించలేదు, అని చెప్పనా!

చెప్పగానే ఏమవుతుంది, అందరూ నీరుగారిపోయి, ఆత్మహత్యకు దిగుతారు. కిష్కింధ చేరి యిదే మాట చెప్పాలి.

ఇంకేముంది రామలక్ష్మణులు ప్రాణత్యాగం చేస్తారు. ఆప్తమిత్రుల దశ చూసి వానరేశ్వరుడు సుగ్రీవుడు వారిని అనుసరిస్తాడు, ఆ దృశ్యం చూడలేక వానరవీరులందరూ బండరాళ్ళ మీద తలలు బద్దలు కొట్టుకు చస్తారు. తార, రుమ ప్రాణాలు వదులుతారు.

ఈ వార్త అయోధ్య చేరుతుంది, భరతుడు, శత్రుఘ్నుడు, కౌసల్య, సుమిత్ర, కైకేయి, అయోధ్యా పౌరులు అందరూ నేలకూలుతారు.

ఇందుకా నేనింత శ్రమపడ్డది. కిష్కింధలో, అయోధ్యలో ప్రాణి మిగలకుండా ఉండడానికా నూరు యోజనాల సముద్రం దాటి వచ్చినది.

ఛీ! అంతకంటె నేనే యిక్కడ ప్రాణత్యాగం చేస్తే హనుమంతుడు నేడో, రేపో తిరిగి వస్తాడనే ఆశతో మరికొంతకాలం వీరంతా ఊపిరితో ఉంటారు అని నిశ్చయించుకుని కోట గోడ మీది నుండి ఎదరకు చూశాడు.

ఎదురుగా అశోకవనం కనిపించింది.

ఇంతవరకూ యిది మన కంటబడలేదే, యిది కూడా చూసి, అక్కడా ఆ యిల్లాలు లేకపోతే అప్పుడు ఆలోచిద్దాం, అనుకుని కదులుతూ–

నమోస్తు రామాయ సలక్ష్మణాయ
దేవ్యైచ తస్యై జనకాత్మజాయై
నమోస్తు రుద్రేంద్ర యమానిలేభ్యో
నమోస్తు చంద్రార్క మరుద్గణేభ్య!

సీతా, రామ, లక్ష్మణులకు, రుద్ర, ఇంద్ర, యమ, వాయు, చంద్ర, సూర్య, మరుద్గణాలకు అభివాదం చేశాడు.

ఈ క్షణం వరకూ హనుమంతుడు తన శక్తినే నమ్ముకుని తిరిగాడు. ఇక్కడ మాత్రం దేవతా గణాలకు నమస్కరిస్తాడు. అంటే పురుషకారం ఎంతటిదయినా దైవం అనుకూలించాలి, అనుకూలించాలంటే మనస్సును ఏకాగ్రం చేసి దైవనామస్మరణ చెయ్యాలి, అదే హనుమంతుని వంటి ధీమంతుని నుండి సామాన్యులు గ్రహించి ఆచరించ వలసినది.

అశోకవనంలో ఓ చెట్టు మీదికి దూకాడు, ఎదురుగా వున్న శింశుపా వృక్ష ఛాయలో సీతాదేవి దర్శనం అయింది.

చూస్తున్నాడు హనుమంతుడు.

తెలతెలవారుతూన్నది.

ఆ సమయంలో–

షడంగ వేద విదుషాం
క్రతు ప్రవర యాజినాం
శుశ్రావ బ్రహ్మ ఘోషాంశ్చ
విరాత్రే బ్రహ్మ రాక్షసాం.

శిక్ష, వ్యాకరణ, కల్ప నిరుక్త, జ్యోతిష, ఛందశ్శాస్త్రవేత్తలై, ఉదాత్తానుదాత్త స్వరిత స్వర సంపన్నులైన వేదవేత్తలు మధుర గంభీరగళంతో వేదగానం చేసి రావణుని మేలుకొలుపగా, ఆ రాక్షసేశ్వరుడు తన నారీజనంతో అశోకవనానికి వస్తున్నాడు.

వస్తూన్న రాక్షసరాజు వెంట ఇరువంకలా ఒక సుందరీమణి పాన పాత్రతో, మరొక కమనీయ కామిని మధుకలశంతో వున్నది. సీతాదేవిని సమీపించి చిరునవ్వుతో తన ప్రణయ ప్రసంగం సాగించాడు.

జానకీ! యిందరు మదవతీ లలామలు నన్నే కోరి, నా వెంటబడివస్తున్నా, నీ మీద మరులుగొన్న నా మనసు వీరెవరిని చూసినా తృప్తిపడడం లేదు.

పిబ విహర రమస్వ భుంక్ష్వ భోగాన్
ధన నిచయం పదిశామి మేదినీం చ
మయి లల లలనే యథాసుఖం త్వం
త్వయి చ సమేత్య లలంతు బాంధివాస్తే॥

ముల్లోకాలనూ ఓడించి తెచ్చిన కనక, మాణిక్య, రత్నరాసులన్నీ నీకర్పిస్తాను. ఈ రాజ్యానికి నిన్ను పట్టమహిషిని చేస్తాను. నీ బంధుకోటిని రప్పించి వారందరికీ ఈ భోగ భాగ్యాలు పంచిపెట్టు. చతుర్దశ భువనాలనూ గజగజలాడించిన ఈ రాక్షసేశ్వరుడు నీ కనుసన్నలలో నడుస్తాడు. ఈ కాంతాజనం అందరూ నీ సేవలో ఉంటారు;

అలా సాగింది రావణ ప్రసంగం.

ఆడదాన్ని లొంగదియ్యడానికి ఎన్ని వాగ్దానాలు పనికివస్తాయో అన్నీ పలికాడు.

కాని అదంతా బూడిదలో పోసిన పన్నీరు.

అడవిగాచిన వెన్నెల అయింది.

గడ్డిపరకలా తీసి పారేసింది సీతాదేవి.

నా వంటి ఇల్లాలి ముందు ఇటువంటి అసభ్య ప్రసంగం చేసే నీ నాలుక ఊడిపడదేం, నీ కన్నులు పేలిపోవేం. నువ్వు కుక్కవి, చెవుల పిల్లివి, నా భర్త పెద్దపులి, సింహం అంటూ బెదిరించింది.

కామమోహితుడైన రావణునికి ఆ మాటలేమీ వినిపించలేదు, తన ప్రేమ పాఠాలు వల్లిస్తూనే వున్నాడు. అప్పుడాయన భార్యలలో ఒకతె–ధాన్యమాలి–అన్నది!

అకామాం కామమానస్య
శరీర ముపతప్యతే
ఇచ్ఛంతీం కామయానస్య
ప్రీతిర్భవతి శోభనా॥

* * *

ప్రాణేశ్వరా మనయందు వాంఛలేని వారితో తిరగడం వల్ల శరీర తాపమే తప్ప సుఖం ఉండదు. ఇద్దరి మనసులూ కలిసినప్పుడు హాయిగా తృప్తి పడవచ్చు, అని బోధించింది.

ఆ ఇల్లాలిని చూసి, ఆమె బాధ గ్రహించి అట్టహాసం చేశాడు రావణుడు.

తాను సీత మీద మనసు పడ్డాడు.

తన మీద మోహంతో వున్నది ధాన్యమాలి.

అదీ ఆ నవ్వు వెనుక రావణుని బాధ.

ఈ విధంగా మనస్తత్వాన్ని అందియ్యడంలో వాల్మీకి తన చమత్కారాన్ని చూపుతూనే ఉంటాడు.

రావణుడు వెళ్ళాడు.

రాక్షస స్త్రీలు జానకీదేవిని నానామాటలూ అంటున్నారు.

చీల్చుకు తింటాం, కాల్చుకు తింటాం, పంచుకు తింటాం. హాయిగా సురాపానం చేస్తూ నంజుడుగా ఆరగిస్తూ మా నగరపాలిక నికుంభిలాదేవి దగ్గర నాట్యమాడతాం...

సురా చానీయతాం క్షిప్రం
సర్వ శోక వినాశినీం
మానుషం మాంస మాస్వాద్య
నృత్యా మోథ నికుంభిలాం॥

ఇదీ ఆ రాక్షస లక్షణం.

రావణుని బెదిరింపులు, ఈ నారీజనుల దుర్భాషలు సీతాదేవిని ఈషణ్మాత్రం చలింపజేయలేకపోయాయి.

ఆ సమయంలో త్రిజట అనే వృద్ధ రాక్షసి తాను కలలో చూసిన రావణ కుంభకర్ణుల దుర్దశ, సీతారాముల సమాగమం వివరించడంతో అందరూ మూర్ఛపోయారు.

ఆ అవకాశం చూసుకుని జానకీదేవి ప్రాణత్యాగానికి సన్నద్ధురాలై జుట్టు ముడి విప్పి మెడ చుట్టూ బిగిస్తున్నది. చూస్తున్నాడు హనుమంతుడు.

నిజానికి ఆయన వచ్చిన పని అయిపోయింది.

సీతాదేవి ఎక్కడ వున్నదో చూసి రమ్మన్నాడు, సుగ్రీవుడు.

చూశాడు, నిశ్చింతగా తిరిగివెళ్ళి

ప్రభూ! సీతాదేవిని దర్శించాను.

ఆవిడ లంకానగరంలో అశోక వనంలో శింశుపా తరుచ్ఛాయలో ఉరిపోసుకు మరణించింది, అని చెప్పాలి.

ఈనాటి దూత అయితే ఆ పని చేసేవాడు. కాని, ఆయన ధీమంతుడైన హనుమంతుడు, సుగ్రీవ సచివుడు, రామదూత.

రామచంద్రుడన్నాడు.

ఈ యువకుని వలె మాట్లాడగలిగిన ఒక్క వ్యక్తి మన దగ్గర వుంటే ముల్లోకాలనూ జయించగలం, అని.

అంటే నోటిమాటతో ఎంతటి ఘనకార్యాన్నయినా సాధించగలవాడని రాముని చేత ప్రశంసలందుకున్న మహామహుడు.

అటువంటి ధీశాలి–తన శక్తిని యిప్పుడు పరీక్షించుకోవాలి.

జానకీదేవి ఆత్మహత్యకు సన్నద్ధురాలై, మెడ చుట్టూ కేశపాశం బంధించింది. క్షణాల వ్యవధిలో ఆవిడ ప్రాణాలు వదులుతుంది.

ఆ అవకాశంలో ఆవిడను ఆత్మహత్యా ప్రయత్నం నుండి విరమింపజేయాలి.

దానికింత ఆలోచన కావాలా.

చెట్టు మీద నుండి క్రిందికి దూకి ఆవిడ రెండు చేతులూ గట్టిగా పట్టుకుని –

అమ్మా, రామదూతను నేను వచ్చాను. మీకేమీ భయం లేదు నిశ్చింతగా వుండండి, అని ఆపవచ్చు, అంటాడు ఈనాటి వాడు రామకథ వ్రాస్తే. అది రెండు వారాలలో చిత్తు కాగితాల కొట్టులోకి పోతుంది.

అలా కుదరదే.

హనుమంతుడు ఏమాత్రం అలికిడి చేసినా ఆ సాధ్వీమణి రెండు చేతులలో వున్న కేశాలనూ గట్టిగా బిగించేస్తుంది, ఎవడో రాక్షసుడు వస్తున్నాడని. అక్కడే హనుమంతుడు తన ధీశక్తిని ప్రకటిస్తూ :

రాజా దశరథో నామ

రథ కుంజర వాజిమాన్

అని ఆరంభించాడు. అయోధ్యా నగరాన్ని దశరథుడనే రాజు పాలిస్తున్నాడు, ఆయనకు ముగ్గురు భార్యలు, నలుగురు కొడుకులు, వారిలో పెద్దవాడయిన రామభద్రుడు భార్య సీతతో, తమ్ముడు లక్ష్మణునితో పితృవాక్పాలనకు అరణ్యానికి రాగా, అక్కడ రావణ రాక్షసుడు దొంగచాటున సీతాదేవిని అపహరించగా, రామదూతనైన నేను ఆ పతివ్రతా శిరోమణిని అన్వేషించడానికి వచ్చాను, అన్నాడు.

ఏ క్షణంలో దశరథ మహారాజు పేరు సీతాదేవి విన్నదో ఆ క్షణంలోనే ఆవిడ రెండు చేతులలో వున్న కేశాలూ విడిచిపెట్టి, పైకి చూస్తుంది.

ఎందుకంటే ఆవిడ చుట్టూ వున్న రాక్షస స్త్రీలెవరికీ అయోధ్య, దశరథుడు యివేమీ తెలియవు. వారికి తెలిసింది ఒక్కటే–

సీతా, రామలక్ష్మణులను పులులు మింగేశాయి.

నువ్వు నిశ్చింతగా మా లంకేశ్వరుని అంతఃపురంలో హంసతూలికా తల్పం మీద పడుకో, లేకపోతే ముక్కలు ముక్కలుగా నరికి వేయించుకు తింటాం, అంటూ, అదే మాట నిరంతరం పాడుతూంటారు.

ఎప్పుడయితే అయోధ్య, దశరథుడు అనే మాటలు వినిపించాయో సీతాదేవికి విశ్వాసం కలుగుతుంది, ఆశరేకులు తొడుగుతుంది. సరిగ్గా అలానే అయింది, ఆవిడ ఆత్మహత్యా ప్రయత్నం విరమించింది.

అప్పుడు హనుమంతుడు నెమ్మదిగా చెట్టు మీది నుండి క్రిందికి దిగి :

అమ్మా! నిన్ను చూస్తుంటే ఉన్నత వంశంలో పుట్టిన యిల్లాలి వలె వున్నావు. ఈ చెట్టు మొదట నిలబడి ఎందుకు దుఃఖిస్తున్నావు? నీ ఆత్మీయులెవరయినా పరలోకగతులయారా?

ఇంతకూ నువ్వు దేవకాంతవా? అప్సరోభామవా! నాగకన్యవా! గంధర్వ రమణివా? నీ రూపం దేవతా సదృశంగా వున్నది. చంద్రుని విడిచి దివి నుండి భువికి దిగిన రోహిణీ తారవా? ఏదో అనుమానంతో వసిష్ఠులవారిని విడిచి వచ్చిన అరుంధతీదేవివా!

నాకు నీలో రాచకన్య లక్షణాలు గోచరిస్తున్నాయి. ఏ నరపాలుని భార్యవో విధివశాన యిలా వచ్చావనుకుంటున్నాను. ఇంతకూ క్రూరుడైన రాక్షస రావణుడు అపహరించిన జానకీదేవివి కాదు కదా! నీ ఆకార రేఖలు, సౌందర్యం, మునిజనోచితమైన ఈ వేషం చూడగా నువ్వు ధర్మాత్ముడయిన రామభద్రుని యిల్లాలివే అనే నమ్మకం కలుగుతున్నది అన్నాడు.

ఇక్కడ హనుమంతుని మాటలు కొంచెం జాగ్రత్తగా చూడాలి. ఆవిడ సీతాదేవియే అని తెలిసినా, మొదటిసారిగా మాట్లాడుతున్నప్పుడు– ఎలా ప్రారంభించాలి ప్రసంగాన్ని.

ఏనాడూ వారిరువురూ ఒకరినొకరు చూసుకుని ఎరుగరు. సీతాదేవిని గురించి కొంతలో కొంత రాముని వల్ల హనుమంతుడు తెలుసుకున్నాడు కాని ఈయన గురించి ఆ యిల్లాలికి ఏమీ తెలియదు.

అటువంటప్పుడు ఎంత జాగ్రత్తగా ఆవిడకు విశ్వాసం కలిగించాలో తెలిసిన ధీశాలి కనుకనే హనుమంతుడు అమాయకంగా అంతసేపు అలా ప్రసంగించి, కార్యసాధకుడుగా నిలబడ్డాడు.

రామాయణ పాఠకులెవరయినా వివేకంతో గ్రహించవలసినది యిదే.

ముఖ్యంగా రామాయణ కథానాయకుడైన శ్రీరామచంద్రునితో సమంగా ఆరాధనలు అందుకునే హనుమంతుడు ఉత్తి భక్తుడూ, భజనపరుడూ కాదు. చక్కగా మాట్లాడి, ఎదుటివారి హృదయాన్ని అలరించి, ఆకర్షించగలవాడు.

* * *

అటు చూస్తూనే అరణ్యవాసానికి కారణమయిన విషయం వివరిస్తూ

నా భర్తను సింహాసనం ఎక్కించడానికి మా మావగారు నిశ్చయించి, అందుకు తగిన ప్రయత్నాలు సాగించడానికి ఆదేశాలిచ్చి, ఆయన ముద్దుల భార్య కైకేయిని చూడడానికి వెళ్ళారు. అప్పటికే ఆవిడ కోపగృహంలో కటిక నేల మీద ముసుగుతన్ని పడి వుంది.

ఈయన వెళ్ళి బ్రతిమాలారు, ప్రార్థించారు.

అప్పుడు ఆవిడ కన్నీరు విడుస్తూ :

రాముడికి పట్టాభిషేకం జరగడానికి వీలు లేదు, నాకిచ్చిన వరాలు తీర్చాలి. అందులో మొదటి వరం–

రాముడు నార చీరలతో అరణ్యానికి పోవాలి, పద్నాలుగేళ్ళు అక్కడే గడపాలి.

నా బిడ్డ భరతుడు పట్టాభిషిక్తుడు కావాలి.

ఇలా జరగదో నేను అన్నం ముట్టను, పచ్చి మంచి నీళ్ళు నోట్లో పొయ్యను. ఇలానే తనువు చాలిస్తాను, అంది.

న పి బేయం న ఖాదేయం

ప్రత్యహం మమ భోజనం

ఏష మే జీవిత స్యాంతో

రామో యద్యభిషిచ్యతే॥

అదీ మహర్షి వాల్మీకి ప్రత్యేకత –

ఆడదానికి కోపం వస్తే – అలనాటి కైకేయి ఎలా మాట్లాడిందో ఈనాటి కైకమ్మ కూడా అంతే. మానవ మనస్తత్వాన్ని, ముఖ్యంగా రక్తమాంసాలున్న ప్రాణి ఎప్పుడు ఎలా ప్రవర్తిస్తుందో ఎలా మాట్లాడుతుందో గ్రహించి నిక్షేపించినందువల్లనే ఈ యాంత్రిక యుగంలోని వీరభౌతిక వాదులు సైతం రామాయణాన్ని తమ తమ భాషలలో వ్రాయించుకుని కళ్ళకద్దుకుని చదువుకుని మనసు వికసింపజేసుకుంటున్నారు.

❊ ❊ ❊

హనుమంతుడు రామదూత అని సీతాదేవి విశ్వసించిన అనంతరం రాముడిచ్చిన అంగుళీయకాన్ని ఆవిడకందించి, ఆవిడ నుండి ఆనవాలుగా చూడామణి స్వీకరించి :

అమ్మా, నువ్వు నా వీపు మీద కూర్చుంటే అనాయాసంగా ఈ క్షణంలో రామచంద్రుని ఎదుట నిన్ను నిలుపుతాను, అన్నాడు.

అప్పుడు జానకీదేవి : "నాయనా, ఎంత అమాయకుడివి : నిన్ను చూస్తే వేలెడు లేవు, నన్ను తీసుకు ఎలా వెడతావు? ఒకవేళ తీసుకువెళ్ళగలిగినా సముద్రం మీద వాయువేగంతో సాగుతూంటే నేను కళ్ళు తిరిగి పడిపోవచ్చు లేదా రాక్షసులు వచ్చి నిన్ను హింసించి నన్ను లంకకు తీసుకుపోవచ్చు.

ఇవన్నీ అలా వుంచు. రామభద్రుని భార్యనైన నేను పరపురుష స్పర్శను సహించను. ఇక నాడు రావణుడు అపహరించినప్పటి మాట అంటావా! అప్పుడు దుఃఖంతో, భయంతో ఏమీ తెలియని దశలో వున్నాను.

భర్తృ భక్తిం పురస్కృత్య

రామా దన్యస్య వానరం
న స్పృశామి శరీరంతు
పుంసో వానర పుంగవ

మరో మాట ఈ రావణుడు మోసం చేసి దొంగచాటుగా నన్ను అపహరించాడు. ఆ పాపానికి ప్రాయశ్చిత్తంగా నా భర్త స్వయంగా వచ్చి ఈ రాక్షసుణ్ణి బంధు మిత్ర పరివార సమేతం సంహరించి నన్ను తీసుకు వెళ్ళడం ఆయనకు కీర్తికారణం. అంతే కాని వీడిలా పిరికితనంతో పారిపోవడం నాకు నచ్చదు" అంది.

అప్పుడు హనుమంతుడు :

అమ్మా! నీ మాటలు సముచితంగా వున్నాయి. సాధ్వీమతల్లుల వినయంతో స్త్రీ సహజమైన స్వభావాన్ని కూడా వ్యక్తంచేస్తున్నాయి.

స్త్రీలు సాగర లంఘనానికి సమర్థులు కారు, అందునా నూరు యోజనాల దూరం కనక నీ భయం సహజం. రాక్షసులు నన్నేదో చేస్తారనడం సృష్టిలో జరిగేది కాదు.

మరొక మాట అన్నావే! రామభద్రుని తప్ప మరొక పురుషుని గాలి కూడా సోకనివ్వనని ఆ మాట నువ్వు మాత్రమే అనగలవు, మరెవ్వరూ అలా అనలేరు. రామభద్రుని వంటి మహాత్ముని భార్యకే ఆ శక్తి ఉంటుంది.

యుక్తరూపం త్వయాదేవి
భాషితం శుభదర్శనే!
సదృశం స్త్రీ స్వభావస్య
సాధ్వీనాం వినయస్య చ ॥
ద్వితీయం కారణం యచ్చ
బ్రవీషి వినయాన్వితే
రామాదన్యస్య నార్హామి
సంస్పర్శ మితి జానకి ॥

నిజమే, నువ్వన్నట్లుగా ఆయన వచ్చి ఈ రాక్షస వంశ నాశనం చేసి నిన్ను తీసుకు వెళ్ళడమే ఆయన వీరత్వానికి లక్షణం అని సెలవు తీసుకున్నాడు.

తన శక్తిని శంకించి రాక్షసులేదో చేస్తారని సీతాదేవి అన్నప్పుడు నిస్సంకోచంగా-

అమ్మా నువ్వు స్త్రీవి కనక భయపడుతూ అలా అన్నావు, నా శక్తి సంగతి తెలియక భయపడటం నీ స్త్రీ స్వభావానికి నిదర్శనం అని అనడానికి వెనుకాడలేదు. ఇక పరపురుష స్పర్శ విషయానికి వస్తే జానకీదేవి ఎదుట లోకం తలవంచవలసిందే అని అంగీకరించాడు.

అదీ హనుమంతుని ధీశక్తి. అయినదానికీ కానిదానికీ తాళం వాయించి వందిమాగధ

కృత్యానికి దిగేవాడు కాదాయన. తన వ్యక్తిత్వాన్ని కాపాడుకుంటూనే ఎదుటివారి శక్తిని గౌరవించగలవాడు.

❊ ❊ ❊

తిరుగుముఖం పట్టి సాగర లంఘనానికి బయలుదేరబోతూ–

మనం వచ్చిన పని కొంచెం మిగిలినట్టు అనిపిస్తున్నది. సీతాదేవిని చూశాం, అయితే ఈ యిల్లాలిని చూడడంతో అయిందా! ఈ రాక్షసుడి అంగబలం, ఆయుధ బలం తెలుసుకోవద్దూ. దూతగా వచ్చినవాడు తనకు తన ప్రభువు ఆజ్ఞాపించిన పని యొక్క పూర్వాపరాలు కూడా పూర్తి చెయ్యకుండా వెడితే ప్రయోజనం లేదు.

ఈ రాక్షసులు క్రూరులు. వీరి ముందు సామోపాయం పనికి రాదు –

ధనమదం తలకెక్కిన వీరిని దానధర్మాలు లొంగదియ్యలేవు.

బలగర్వంతో వున్నవారిని భేదోపాయంతో విడదియ్యలేము.

మిగిలింది దండోపాయం, అంటే యుద్ధం తప్పదు.

అందుచేత వీరి శక్తి, సేనాబలం గ్రహించాలి. అప్పుడు యుద్ధానికి వస్తే అవలీలగా కార్యం సాధించగలం, అని ఆలోచించీ అశోకవనం ధ్వంసం చేశాడు. ఆ వార్త విని రావణుడు సైన్యాన్ని పంపాడు, వచ్చిన వారందరినీ నేలకూల్చాడు. తన కుమారుడైన అక్షుని పంపాడు.

ఆయన పంపాడు.

ఈయన చంపాడు.

గత్యంతరం లేక ఇంద్రజిత్తుని వదిలాడు లంకేశ్వరుడు. దేవేంద్రుని గజగజలాడించిన ఇంద్రజిత్తు తికమకపడ్డాడు హనుమంతుని ఏమీ చెయ్యలేక.

చివరకు బ్రహ్మాస్త్రంతో బంధించి రావణుని ఎదుట నిలబెట్టాడు.

❊ ❊ ❊

రత్నమాణిక్య ఖచిత సువర్ణ సింహాసనం మీద సర్వభూషణాలంకృతుడై, కిరీట ధారియై వెలుగుతూన్న రావణుని చూడగానే హనుమంతుడు :

అహెూ రూపమహెూ ధైర్యం
అహెూ సత్వమహెూ ద్యుతిః
అహెూ రాక్షస రాజస్య
సర్వలక్షణ యు కతా॥
య ద్యధర్మో న బలవాన్
స్యా దయం రాక్షసేశ్వరః
స్యాదయం మరలోకస్య
స శుక్రస్యాపి రక్షితా॥

ఓహో! ఏమి వీని సౌందర్యం, ఏమి ధైర్యం.

ఏమి శక్తి, ఏమి శరీరకాంతి! సర్వలక్షణ లక్షితుడై అలరారే ఈ రాక్షసేశ్వరుడు దేవేంద్రునితో పాటు అమరావతిని కూడా ఏలదగ్గవాడు, కాని పరస్త్రీ వ్యామోహమనే అధర్మం ఒక్కటే వీనిని ఎందుకూ కొరగాకుండా సర్వనాశన పథం వైపు నడిపించింది, అనుకున్నాడు.

అంటే ఎదురుగా కనిపించిన ఆకారాన్ని చూస్తూనే అందరి వలెనే హనుమంతుడు కూడా ఆశ్చర్యపోయాడు, క్షణంలో వాడి అంతరంగం చదివి వాడి అక్రమవర్తనను నిరసించాడు.

మన శత్రువయినా సరే వానిలోని గుణాన్ని గుణంగా స్వీకరించి అభినందించాలి, అవగుణాన్ని అవగుణంగా ఖండించాలి.

ఇది హనుమంతునిలోనే కాదు, రావణునిలోనూ ఉంది.- ఎదురుగా వున్న హనుమంతుని చూస్తూనే!

కిమేష భగవ శ్నందీ
భవేత్సాక్షాదిహాగతః
ఏన శప్తోస్మి కైలాసే
మయా సంచాలితే పురా॥

* * *

సోయం వానర మూర్తిస్యాత్
కిం స్వి ద్బాణోపి వా సురః॥

ఎవడు వీడు, ఈ తేజస్సు చూస్తుంటే అలనాడు కైలాసాన్ని కదలించినపుడు ఆగ్రహంతో నన్ను శపించిన నందీశ్వరుడిలా రాలేదు కదా! కాకుంటే బాణాసురుడు వానర రూపంతో దిగాడా, అనుకున్నాడు. అదీ రామాయణ పాత్రల ప్రత్యేకత. ఎంత శత్రువైనా రాక్షసుడైనా వాస్తవాలను విస్మరించి నిలువెల్ల విషంతో ప్రవర్తించేవారు కాదు.

విచిత్రమేమంటే పాశ్చాత్య సాహిత్యంలో వలె మన కావ్య, ఇతిహాసాలలో 'విలన్' అనేవాడు లేడు. నాయక, ప్రతినాయకులే మన కావ్య, నాటకాలలో కనిపిస్తారు. రామాయణంలో రావణుడు, భారతంలో దుర్యోధనుడు ఈ ఉభయులలో ప్రధాన నాయకులలో ఉండే లక్షణాలన్నీ ఉండి వారికంటె భిన్నంగా ఒక్క దుర్గుణం ఉంటుంది. రావణుడికి పరస్త్రీ వ్యామోహం. దుర్యోధనుడికి పరధనాపహరణ వాంఛ! ఈ రెండే వీరి సర్వనాశనానికి కారణాలు.

* * *

ఎదురుగా వున్న హనుమంతుని చూచి, తల ప్రక్కకు త్రిప్పి; తన మంత్రి ప్రహస్తుని వైపు తిరిగి : వీడెవడో, వీడి కథ ఏమిటో కనుక్కోమంటాడు.

అంటే దూతతో మహారాజు మాట్లాడడు, అది రాజవంశ లక్షణం.

ప్రహస్తుడు అవే ప్రశ్నలు హనుమంతుని అడిగినప్పుడు, సమాధానమిస్తూ మారుతి:

మీ ప్రశ్నలు చాలా అయోమయంగా వున్నాయి. నా ముఖం చూస్తే తెలియడం లేదా? నేనెవరినో?

ఇక నేనెందుకొచ్చానని అడుగుతున్నారు.

నేను వానరాన్ని, వానర లక్షణంతోనే వచ్చాను. ఇక్కడ మంచి మంచి వనాలున్నాయి, మధురమయిన ఫలాలు దొరుకుతాయి, అని వచ్చాను. వచ్చాక మీ ప్రభువును చూడాలనిపించింది. ప్రభువు దర్శనం సామాన్యులకు లభించదు, లభించాలంటే ఏదో పాడు పని చెయ్యాలి. అందుకే అశోకవనం ధ్వంసం చేశాను. అప్పుడు మీ రాక్షసయోధులు నన్ను చంపడానికి వచ్చారు. ఆత్మ రక్షణార్థం నేను తిరగబడ్డాను. వారు నేల కూలారు. అది నా దోషం కాదే! అని ప్రార్థించాడు.

అలా మొరపెట్టడంలో విశేషం ఏమంటే –

రావణుడు ఆగ్రహంతో వున్నాడు, వాడికి ఎదుటివారు ఏం చెప్పినా వినపడదు. వాడి ఆవేశం తగ్గించడానికి వాణ్ణి పొగడటమే మార్గం. అయితే హనుమంతుడంతటివాడు క్రూర రావణుని ప్రస్తుతించలేడు, కనక నీ నగరంలో ఉద్యానవనాలు, ఫలాలు అని ప్రశంసించాడు. అంతలో కొంత ఆవేశం జారుతుంది.

రాక్షస సంహారం విషయానికి వస్తే ఆత్మరక్షణార్థం అది చెయ్యక తప్పలేదు అన్నాడు. ఆనాడే కాదు ఈనాడు కూడా ఆత్మ రక్షణకు మనం ఎదుటివారిని ఎదుర్కొన్నప్పుడు వారు మరణిస్తే మనకు శిక్ష వెయ్యరు.

తతస్తే రాక్షసా ప్రాప్తా
బలినో యుద్ధ కాంక్షిణః
రక్షణార్థంతు దేహస్య
ప్రతియుద్ధా మయారణీ॥

అంత చెప్పాక అసలు విషయానికి వచ్చి :

రావణా! మీరందరూ భావిస్తున్నట్టు నన్ను కుబేరుడూ, ఇంద్రుడూ, విష్ణువూ ఎవరూ పంపలేదు. నీకు సోదర సముడైన సుగ్రీవుడు నీ కుశలవార్త అడిగి రమ్మని పంపాడు. ఆయన చెప్పిన మాటలు విను:

దశరథుడనే మహారాజు అయోధ్యా నగరాన్ని పాలిస్తున్నాడు. ఆయన కుమారుడు రామభద్రుడు పితృవాక్యపరిపాలన దీక్షతో అరణ్యానికి వచ్చాడు. ధర్మపరుడైన రాముని వెంట ఆయన భార్య సీతాదేవి, సోదరుడు లక్ష్మణస్వామి కూడా వచ్చారు.

వనంలో ఉండగా సీతను ఎవరో అపహరించారు. ఆమెను వెదకుతూ వీరిద్దరూ కిష్కింధకు వచ్చి, ఋష్యమూకం మీద వున్న నాతో స్నేహం చేసుకున్నారు.

స్నేహితునికి చేసిన వాగ్దానానుసారం రామభద్రుడు వాలిని సంహరించి సుగ్రీవుని పట్టాభిషిక్తుని చేశాడు.

త్వయా విజ్ఞాత పూర్వశ్చ
వాలీ వానర పుంగవః
రామేణ నిహతస్సంఖ్యే
శరేణైకేన వానరః॥

నువ్వెరగనివాడు కాదు వాలి. అంతటి వాలిని ఒకే ఒక్కబాణంతో నేల కూల్చిన ధనుర్విద్యావేత్త రామభద్రుడు.

❊ ❊ ❊

ఇక్కడ కొంత వివరణ అవసరం –

ఒకనాడు వాలి తన స్నానానికి అవరోధం కలిగించిన కారణంగా రావణుని పట్టి తన చంకలో పెట్టుకుని సప్తసముద్రాలలో ముంచి వదిలిపెట్టాడు. అంత బలిష్ఠుడైన వాలిని ఒకే ఒక్క బాణంతో రామభద్రుడు నేల కూల్చాడు అని చెప్పగానే ఆ రాక్షసేశ్వరుని ధైర్యం, గుండె నిబ్బరం జారిపోతాయి.

శత్రువు యొక్క మనస్సును వికలం చేసి, వాని ధైర్యాన్ని నీరు కార్చి అనంతరం తన పనిని నెరవేర్చుకోవడం రాజనీతి, అంతే కాదు, అది యుద్ధతంత్రం కూడా. ఆ పనిని సమర్థంగా నిర్వహించిన ధీశాలి హనుమంతుడు.

❊ ❊ ❊

అనంతరం రావణుడు పళ్ళు పటపటలాడిస్తుంటే, చలించకుండా నిలబడి:

రావణా! రామచంద్రుడు శరణాగత వత్సలుడు. చేసిన తప్పును ఒప్పుకుని జానకీదేవిని మర్యాదగా ఆయనకు అప్పగించి, అభయం కోరుకో, ఆయన తప్పకుండా నిన్ను క్షమించి వదులుతాడు.

కాదంటావా! రామ బాణాగ్నికి నీతోపాటు నీ బంధుమిత్ర పరివారం ఈ లంకానగరం భస్మంకాక తప్పదు, అని హెచ్చరిస్తాడు.

అది మరింత ఆగ్రహం కలిగించగా రావణుడు తన అనుచరుల వైపు తిరిగి :

వీని తల తరగండి, అదే తగినశిక్ష అన్నాడు.

అప్పుడు విభీషణుడు రాజనీతిని బోధించి,

దూతను చంపడం చాలా అన్యాయం, లోకం అంతా నిందించే పని అది. రాజధర్మం

తెలిసిన నువ్వే యిలా ప్రవర్తిస్తే నీ వివేకాన్ని నలుగురూ పరిహసిస్తారు, కనక వీనికి మరో శిక్ష వెయ్యి.

వీడు మనకు శత్రువు కాదు, వీని ప్రభువుతో మనకు విరోధం, అందుచేత వీనిని చంపితే, మళ్ళీ సముద్రం దాటి వచ్చే వాడుండడు. ఆ రామునికి మన సంగతి తెలియదు.

కనక వీనిని విడిచిపెడితే, విషయం తెలుసుకుని ఆ రాముడు ధైర్యం ఉంటే యుద్ధానికి వస్తాడు. లేదా నోరుమూసుకు ఊరుకుంటాడు, అని హితబోధ చేయగా, అంగీకరించి రావణుడు :

వానరానికి వాలం అంటే ప్రీతి కనక వీడి తోకకు నిప్పు పెట్టండి, కాలిన తోకతో పోతాడు అని ఆదేశించాడు.

సైనికులు హనుమంతుని చేతులు కట్టి నడివీధికి లాగుతూ తీసుకొచ్చారు.

నగరంలోని జనులందరూ సంతోషంతో తమ తమ ఇళ్ళలోని పాతగుడ్డలు తెచ్చి వాలానికి చుట్టబెట్టి నూనె పోసి అంటించారు.

ఈ వార్త సీతాదేవి చెవిని పడింది.

ఆవిడ అశోకవనంలో శింశుపా వృక్షచ్ఛాయలో పద్మాసనాసీనయై!

యద్యస్తి పతిశు శూషా
యద్యస్తి చరితం తపః
యదిచాస్త్యేక పత్నీత్వం
శీతో భవ హనూమతః॥

నా పాతివ్రత్యం, తపోదీక్ష ఆయన ఏకపత్నీ వ్రతం ఇవన్నీ కలిసి హనుమంతుని రక్షించాలి. వీటి ఫలంగా అగ్నిహోత్రుడు హనుమంతునికి చల్లగా సోకాలి. ఏ మాత్రం వానికి బాధ కలగకూడదు, అని ప్రార్థించింది.

అంతే. అగ్ని జ్వాలలు రేగుతున్నా హనుమంతుని తోక చల్లగానే ఉంది. అది శక్తి.

పాతివ్రత్యాగ్ని శిఖాజ్వాల ముందు ప్రకృతిలోని అగ్నిజ్వాల తల వంచింది. ఇది అసాధ్యం అనుకునే హేతువాదులు ఈ దేశపు పాతివ్రత్యం గురించి యీషణ్మాత్రం తెలియనివారు సత్యం, ధర్మం, పాతివ్రత్యం యీ మూడూ ప్రళయాగ్ని జ్వాలలు. ఈ మూడు శక్తులూ వున్న వారికి ఆ అగ్ని శిఖలు మలయమారుతాలు, శత్రుకోటికి అవే ప్రళయానల జ్వాలామాలలు.

* * *

మండుతున్న అగ్ని శిఖలను చూసి హనుమంతుడు :

ఇంతవరకూ మనం కొందరు రాక్షస సైనికులనే నేల కూల్చాం, ఇప్పుడు ఈ నగరాన్ని

కూడా తగలబెడితే మన పని పూర్తిగా సానుకూలం అవుతుంది. అంతేకాదు. ఈ అగ్నిహోత్రునికి తృప్తి కలిగించడం ధర్మం అనుకుని,

లంకానగరంలోని ప్రతి భవనానికీ నిప్పు పెట్టాడు, ఒక్క విభీషణుని సౌధానికి తప్ప.

* * *

మండు వేసవిలో ఎండిపోయిన మహారణ్యం దావాగ్నిలో మండుతూన్నట్టు లంకానగరం పరశురామ ప్రీతి అవుతున్నది.

అప్పుడు సముద్రతీరానికి చేరి అందులో తోక ముంచి, చల్లార్చుకుని ఆలోచించడం మొదలుపెట్టాడు.

నేనెంత మూర్ఖుణ్ణి, రావణుని మీద ఆగ్రహంతో నేను చేసిన ఈ అకార్యం కారణంగా సీతాదేవి కూడా ఈ మంటలకు ఆహుతి అయి ఉంటుంది. ఇంతకన్న ఘోరం వున్నదా! క్రోధ హృదయం చేయించ లేని అకార్యం ఉండదు. ఇప్పుడు నేనేం చెయ్యాలి. తిరిగి వెళ్ళి ఎవరి మొహం చూడగలను.

క్రుద్ధః పాపం న కుర్యాత్కః
క్రుద్ధో హన్యాద్గురూనపి
క్రుద్ధః పరుషయా వాచా
నర్స స్సాధూ నధిక్షిపేత్॥

* * *

ధన్యాస్తే పురుషశ్రేష్ఠా
యే బుద్ధ్యా కోపముత్థితం
మంధంతి మహాత్మానో
దీప్త మగ్ని మివాంభసా॥

అని విచారంతోనే అశోకవనానికి వెళ్ళి చూశాడు. అక్కడ సీతాదేవి నిశ్చింతగా కూర్చుని ఉంది. అప్పుడు మళ్ళీ అనుకున్నాడు.

నేనెంత అవివేకిని :

నా వాలం మీది రోమాన్ని కూడా అంటని అగ్ని సీతాదేవి సమీపానికి రాగలదా : ఆ పాతివ్రత్యాగ్ని ముందు ఈ అగ్ని ఎంత! ఆవిడ తేజస్సు ఈ అగ్నిని అల్లంత దూరాన ఉంచుతుంది.

* * *

అధవాచామ సర్వాంగీ
రక్షితా స్వేన తేజసా

న నశిష్యతి కళ్యాణీ
నాగ్ని రగ్నౌ ప్రవర్తతే॥

❊ ❊ ❊

జానకీదేవికి అభివాదం చేసి ఆవిడ దగ్గర సెలవు తీసుకుని సాగర తీరాన అరిష్టనేమి పర్వతం అధిరోహించి, ఒక్క వూపులో పైకి లేచాడు.

ఆయన గగనవీధికి ఎగిరాడు.

ఆ పాద తాడనానికి పర్వతం పాతాళానికి దిగిపోయింది. అంటే అన్వేషణకు వచ్చే వేళ మహేంద్రగిరి మీద నుండి లేచినప్పుడు ఆ గిరి మీద పగుళ్ళు మాత్రమే పడ్డాయి.

కార్య సాధనోత్సాహంతో యిప్పుడు త్రొక్కిన త్రొక్కుతో పర్వతం నామరూపాలు లేకుండా పోయింది.

ఇంత సూక్ష్మ పరిశీలనా దృష్టితో ఆవిర్భవించినందువల్లనే రామాయణం యింతకాలం సజీవంగా ఉన్నది.

ఇంతకాలమే కాదు –

యావాత్ స్థాస్యంతి గిరయః
సరితశ్చ మహీతలే
తావద్రామాయణ కథా
లోకేషు ప్రచరిష్యతి॥

పర్వతాలున్నంత కాలం, నదులు ప్రవహిస్తున్నంత కాలం రామాయణం మానవాళిని సత్క్రమ మార్గాన నడుపుతూనే ఉంటుంది.

❊ ❊ ❊

ఉత్తరదిశగా గగనవీధిని సాగి సాగి, తీరానికి రెండు మూడు క్రోసుల దూరాన ఉండగానే సింహగర్జన చేశాడు. ఆ మహాధ్వని విన్న వానర భల్లూక యోధులందరినీ జాంబవంతుడు దగ్గరగా పిలిచి;

నాయనా! మనవాడు కార్యం సాధించి వస్తున్నాడు, సీతాదేవిని చూచి వస్తున్న వీరుడు అంతదూరం నుంచే మన కందించడానికి చేసిన సింహనాదం అది, అని వారందరికీ సంతోషం కలిగించాడు.

నహ్యస్యకృత కార్యస్య
నాద ఏవం విధో భవేత్॥

అది జాంబవంతుని శక్తి. ఏ శబ్దం ఎప్పుడు పుడుతుందో, ఆ ధ్వని అంతరార్థం ఏవిటో గ్రహించగల యోధుడు ఆ వృద్ధుడు. అంటే జీవితం పండినవారు తమ అనుభవంతో

కొన్ని కొన్ని విద్యలు సాధిస్తారు. ఏ అనుభవమూ లేకుండా జీవితం గడిపినవారు వున్నా వూడినా ఒక్కటే! జీవితంలో అనుభవాలతో తలపండినవారు సమాజానికి కావాలి. అటువంటివాడు జాంబవంతుడు కనకనే,

జాంబవాన్యత్ర నేతాస్యాత్ - అన్నాడు కపీశ్వరుడు సుగ్రీవుడు.

అలా జాంబవంతుడు వివరిస్తున్న సమయానికే హనుమంతుడు మహేంద్రగిరి సమీపానికి వచ్చి క్రిందికి దిగుతూ -

'దృష్టా సీతా' అన్నాడు.

అదీ హనుమంతుని వివేకం.

చూశాను సీతను, అన్నాడే కాని సీతను చూశాను అనలేదు.

వానర వీరులందరికీ - చూశాను - అనే మాట కావాలి.

చూశాను అనగానే సీతాదేవిని చూచి వచ్చాడు మనవాడు అని తెలిసిపోతుంది. అంత జాగ్రత్తగా ఏ శబ్దం ముందు వాడాలో, ఏది తరువాయి చెప్పాలో, ఏది అవసరమో ఏది అనవసరమో, అందునా ఎవరికి ఎంత చెప్పాలో ఎలా చెప్పాలో తెలిసినవాడు కనకనే రామచంద్రుడు అంతగా ప్రశంసించాడు.

అప్పుడు జాంబవంతుడు : హనుమా! నీ ప్రయాణ విశేషాలతో లంకానగరం దాని అధిపతియైన క్రూరుని వివరాలూ చెప్పు, అనగా హనుమంతుడు :

తాతా! మీరందరూ చూస్తుండగా మహేంద్రగిరి నుండి బయలుదేరాను. దారిలో మైనాకుడు అడ్డు వచ్చి అతిథి సత్కారం చేస్తానన్నాడు. ఇప్పుడు కాదని ముందుకు సాగాను. సురస ఎదురుపడి మ్రింగుతానంది. తెలివిగా తప్పించుకున్నాను. లంకానగరం సమీపిస్తుండగా ఛాయాగ్రాహిణి సింహిక తన శక్తితో నన్ను లాగబోయింది. ఒక్క దూకులో దాని కడుపులో ప్రవేశించి కీళ్ళు సడలించి, పైకి లేచి, లంకానగరం కోట గోడ మీదకు దిగాను. చీకటి పడుతుండగా లంకలో దిగి అన్ని భవనాలూ తిరిగాను. చివరకు అశోకవనంలో అమ్మవారిని దర్శించాను. ఆనవాలుగా ఆవిడ చూడామణి యిచ్చింది. అప్పుడు బాగా ఆలోచించి అశోకవనం ధ్వంసం చేశాను.

రావణుడు తన సేనలు పంపాడు. వారందరినీ నేలకూల్చాను. వాని పుత్రుడు అక్షకుమారుని కూడా యమసదనం చేర్చాను. వాడు రాక్షసులను పంపడం, నేను చంపడం. అంతే!

చివరకు ఇంద్రజిత్తు వచ్చాడు, వీడు వాడి పెద్దకొడుకు. మహా మాయావి, అస్త్ర శస్త్ర విద్యలలో ఘటికుడు. వాడు బ్రహ్మాస్త్రంతో బంధించి రావణుని ముందు నిలబెట్టాడు. ఆ దుర్మార్గుడు నన్ను చంపమని ఆజ్ఞాపించాడు. కాని వాని తమ్ముడున్నాడు ధర్మాత్ముడు

విభీషణుడు. వాడు హితబోధ చేయగా చివరకు నా తోకకు నిప్పు ముట్టించమన్నాడు రావణుడు.

నా తోక చుట్టూ గుడ్డలు చుట్టబెట్టి నూనెతో తడిపి అంటించారు. మండుతూన్న తోకతో లంకను భస్మంచేసి ఇలా వచ్చాను. అని అంతవరకూ సాగిన 57 సర్గల గాథను రెండు వందల శ్లోకాలలో వివరించాడు. ఇంతా చెప్పాడు కాని సీతాదేవి రామచంద్రునికి చెప్పమన్న విషయాలు వీరి దగ్గర ప్రస్తావించలేదు. అదీ హనుమంతుని వివేకం. రామునికి చెప్పవలసిన మాటలు వీరికి అనవసరం కనక ఆ ప్రస్తావన రానివ్వడు.

❊ ❊ ❊

అక్కడ నుండి బయలుదేరి వాయు విచలితములైన మేఘాల వలె వానరులందరూ కిష్కింధ పొలిమేరలలో వున్న మధువనంలో దిగారు.

దిగుతూండగానే వారందరికీ మధుపానం మీద మనసు పోయింది. వారి వాంఛ వింటూనే హనుమంతుడు :

నిశ్చింతగా కానివ్వండి, అన్నాడు.

అది విని అంగదుడు :

అవశ్యం కృత కార్యస్య
వాక్యం హనుమతో మయా
అకార్య మపి కర్తవ్యం
కిమంగ పునరద్వశం॥

మన హనుమ మాటకు తిరుగులేదు. అది చెయ్యకూడని పని అయినా చెయ్యవలసిందే అన్నాడు. అంటే అద్భుత కార్యాన్ని సాధించి వచ్చిన వాని మాటకు ఆ మాత్రం విలువ ఇవ్వాలనే విషయం యువరాజు గ్రహించాడు.

ఓహ్! వానరులు మధుపానంలో పడ్డారు. వారు ఆ మత్తులో చేసిన విహారాలు చూస్తుంటే ఈనాడు పానశాలల్లో జరిగే సంఘటనలన్నీ కళ్ళకు కడతాయి.

కేచిత్ క్ష్వేళాం ప్రకుర్వంతి
కేచిత్ కూజంతి హృష్టవత్
హరయో మధునా మత్తాః
కేచిత్ సుప్తా మహీతలే॥

త్రాగిన మైకంలో కొందరు సింహగర్జనలు చేస్తూంటే, మరి కొందరు కోకిల కూతలు కూస్తున్నారు. మరీ మత్తులో వున్నవారు నేలమీద పడి దొర్లుతున్నారు.

సుందరకాండ ప్రారంభంలో లంకానగరంలో పానశాల చూశాం. అక్కడివారికీ

కొండ చివరలో మధువనంలో పడిన వీరికీ తేడా కనిపిస్తుంది.

లంకలో రాక్షసులు ఎంత త్రాగినా తమ భవనాలలోనే ఉంటారు. వీధిని పడరు. వీరో నడివీధిని పడి నానా బీభత్సం చేస్తారు. అంటే త్రాగుబోతులలో మర్యాదస్థులు, లంకలో వున్న నాగరకులు. ఇక వీరు కిష్కింధాపుర అగ్రహారీకులు.

❊ ❊ ❊

మధువనాన్ని రక్షించే దధిముఖుడు తన అనుచరులతో వెళ్ళి వారించబోతాడు. వీరందరినీ వారు చితకబాదగా పరుగు పరుగున పోయి సుగ్రీవునితో చెపుతారు. ప్రక్కనే వున్న లక్ష్మణుడు! “వానరేశ్వరా! ఏవిటి వీరి బాధ” అని అడిగాడు.

సుగ్రీవుడు! “సౌమిత్రీ! దక్షిణ దిశగా వెళ్ళిన వానరులు జానకీదేవిని చూసి వచ్చారు. నేను పెట్టిన గడుపు దాటిన తరువాయి తిరిగి రావడం అసంభవం, వచ్చినా మధువనంలో ప్రవేశించడం ప్రాణాల మీద ఆశ వున్నవాడు చేసే పనికాదు.

ఈ రెండూ జరిగాయీ అంటే వారు కార్యం సాధించి వచ్చారన్నమాట. మరొక విషయం.

జాంబవంతుడు నాయకుడు

అంగదుడు బలాధిపతి

హనుమంతుడు అధిష్ఠాత

వీరు ముగ్గురూ కలిశారంటే పని జరిగి తీరాలి, నిశ్చింతగా వుండండి మీ అన్నదమ్ములు” అన్నాడు.

తన సేవకులు ఎంతటివారో, వారు ఘనకార్యాన్ని సాధించుకు వచ్చినప్పుడు చిన్న అకార్యం చేసినా వారిని క్షమించాలనీ ఎరిగిన ప్రభువు సుగ్రీవుడు. అటువంటి వివేకం కల అధికారి ఉంటే హనుమంతుని వంటి అనుచరులుంటారు.

వారందరినీ తక్షణం రమ్మన్నానని చెప్పు, అన్నాడు సుగ్రీవుడు.

వనపాలకుడు వినిపించిన సుగ్రీవాజ్ఞతో అందరి మత్తూ దిగిపోయింది. మిడతల దండులా వచ్చి పడ్డారు.

చూశాం సీతను, చూశాం సీతను అని హర్షధ్వానాలు చేస్తుంటే రాముడు : మీలో సీతను చూసిన వాడెవడో నా దగ్గరగా రండి, అనగానే అందరూ హనుమంతుని ముందుకు పంపారు.

హనుమ : స్వామీ. చూశాను సీతను. నిన్నే స్మరించుకుంటూ నీ మీదనే మనసుంచి జీవిస్తున్నది. వికారాకారాలు కల రాక్షస నారీ జనం ఆమె చుట్టూ కూర్చుని భయపెడుతున్నారు. జుట్టు దువ్వుకోకుండా, కటిక నేల మీద పరుంటున్నది. రాక్షస రావణుని బాధ నుండి

విముక్తి పొందాలని ఆత్మహత్యకు సన్నద్ధురాలైన సమయంలో నేను చూసి, మీ ఇక్ష్వాకువంశ కీర్తనంతో ఆవిడకు ఉత్సాహం కలిగించి, ఆత్మహత్యా ప్రయత్నం నుండి విరమింపజేసి, సుగ్రీవునితో మీ స్నేహం విషయం చెప్పాను.

అప్పుడావిడ నన్ను రామదూతగా నమ్మి, చిత్రకూటం మీద వున్న రోజులలో కాకాసురుని మీద బ్రహ్మాస్త్రం విడిచిన గాథ చెప్పింది. గోదావరీ తీరంలో మణిశిలతో తిలకం దిద్దిన విషయం చెప్పింది. ఈ చూడామణి ఆనవాలుగా యిచ్చింది.

ఇంక నెలరోజుల కంటె జీవించనని చెప్పింది, అప్పుడావిడకు నేను ధైర్యం కలిగించి వచ్చాను, అన్నాడు.

అంగద, జాంబవంతుల దగ్గర చెప్పిన తన ప్రతాప ప్రదర్శన విషయాలేమీ యిక్కడ చెప్పలేదు, పైగా మొత్తం కథ అంతా పాతిక శ్లోకాలలో ముగించాడు.

అదీ ఆయన వివేకం, ఎవరికి ఎంత చెప్పాలో ఏది చెప్పాలో, ఎలా చెప్పాలో తెలిసిన ధీమంతుడు కనకనే ఈనాటికీ మనం ఆయనను ఆరాధిస్తున్నాం.

ఆరాధనతో పాటు రామాయణాన్ని నిత్యం దీక్షతో చదువుతూ హనుమంతుని వివేకంలో సహస్రాంశమైనా మనం సాధించుకోగలగాలి, అప్పుడూ రామాయణ ప్రయోజనం తెలిసేది.

❊ ❊ ❊

అంతా విన్నాక రాముడంటాడు...

ఇంత ఘనకార్యం సాధించి వచ్చిన నీకు నేనేం ఇవ్వగలను, అని గాఢంగా ఆలింగనం చేసుకున్నాడు.

అంతకంటె ఏం కావాలి స్వామి భక్తి పరాయణుడికి. సీతాదేవికి మాత్రమే లభించిన ఆలింగన భాగ్యాన్ని పొందిన మహనీయుడు హనుమంతుడు. అంతగా తన ఆనందాన్ని వ్యక్తం చేసిన ప్రభువు రామభద్రుడు.

ఈ సన్నివేశం దగ్గర వ్యాఖ్యాతలు చక్కని లోకనీతిని వివరించారు.

ప్రత్యక్షే గురవస్తుత్యాః
పరోక్షే మిత్రబాంధవాః
కర్మాంతే దాస భృత్యాశ్చ
న కదాచన పుత్రకాః॥

"గురువులను వారి సన్నిధానంలో స్తుతించవచ్చు, స్నేహితుల, బంధువుల మంచిని గురించి వారికి, మనకూ తెలిసినవారి ఎదుట పొగడాలి. సేవకుల విషయంలో చెప్పిన పనిని సక్రమంగా నిర్వహించినపుడు ప్రశంసించాలి. కన్న సంతానాన్ని ఎప్పుడూ పొగడరాదు."

అనంతరం యుద్ధయాత్ర ప్రారంభమయింది.

సముద్రతీరం చేరారు. సేతు నిర్మాణం చేశారు.

అప్పుడు విభీషణుడు గగనమార్గాన వచ్చి రామభద్రుని శరణు వేడాడు.

రాముడు సుగ్రీవ, అంగద, జాంబవంతాదు లందరినీ సంప్రదించాడు. వారందరూ విభీషణునికి అభయమివ్వడం ప్రమాదహేతువే అన్నారు.

అప్పుడు హనుమంతుని వైపు తిరిగాడు రాముడు.

హనుమంతుడు వినయంగా– రామభద్రా! నీ వంటి ధీమంతునికి మరొకరు ఆలోచన చెప్పాలా. ఇప్పుడు మాట్లాడిన ప్రముఖులందరి కంటె నేను తెలిసినవాడినీ కాదు. వారి అభిప్రాయాన్ని వ్యతిరేకించడం నా ఉద్దేశం కాదు. అయితే ఈ సమయంలో నా ఊహ మీకు నివేదించడం నా విధి, అని ఆరంభించాడు.

అథ సంస్కార సంపన్నో
హనుమాన్ సచితోత్తమః
ఉవాచ వచనం శ్లక్ష్ణం
అర్థావన్మధురం లఘు॥

వీనికి రావణుని అధర్మ వర్తనం దుర్మార్గ కార్యాచరణం సహించలేక నీ వంటి ఉత్తమ పురుషుని ఆశ్రయించాలని వచ్చాడు. వీని మాటలూ, ముఖకవళికలూ పరిశీలిస్తే ఎక్కడా శంకించవలసిన అవసరం కనపడడం లేదు.

నీ పురుషకారం గురించి విన్నాడు. రావణుని మోసాలూ, మాయలూ చూశాడు. వాలిని చంపి సుగ్రీవుని పట్టాభిషిక్తుని చేసిన నీ సాహస పరాక్రమాలు గ్రహించాడు. అందుకే రాజ్యకాంక్షతో నిన్ను అర్థించడానికి వచ్చాడు కనక వీనికి అభయ ప్రదానం ఇవ్వడం అనుచితం కాదు. ఆ పైన మీరు ఆలోచించండి, అన్నాడు.

ఆ మాట వినగానే రాముడు ప్రసన్నవదనుడయాడు.

అథః రామః ప్రసన్నాత్మా
శ్రుత్వా వాయుసుతస్య హి॥

సుగ్రీవ, అంగద, జాంబవంతాదుల అభిప్రాయాలలోని గుణాలను వివరించి, రామచంద్రుడు :

సకృదేవ ప్రపన్నాయ
తవాస్మీతి చ మాచతే
అభయం సర్వభూతేభ్యో
దదామ్యే తద్వ్రతం మమ॥

ఎవరయినా సరే నా ఎదుట నిలబడి శరణు వేడితే వారికి అభయప్రదానం చేయడం

నా జీవితవ్రతం, ఆ వ్రతం భంగం కారాదు, రావణుడు వచ్చి శరణు వేడినా అభయం అనుగ్రహిస్తాను, అన్నాడు. అదీ రామావతార ప్రధాన లక్ష్యం.

లంకలో కాలు పెట్టాక చివరి ప్రయత్నంగా రావణుని దగ్గరకు అంగదుని పంపి రాయబారం నడిపారు.

వినలేదు రావణుడు, వినిపించదు మృత్యువు నెత్తి మీద తాండవిస్తున్న వానికి. యుద్ధానికి సిద్ధపడ్డారు.

ఇంతకుముందే రావణుడు తన వద్దనున్న మహా మాయావి విద్యుజ్జిహ్వుని ద్వారా రాముని ఖండిత శిరస్సు, సీతాదేవి పంపిన చూడామణి రూపొందించి అశోకవనానికి పోయి ఆమెను భయపెడతాడు. ఈ దృశ్యం చూస్తున్నప్పుడు రావణునికి పరాక్రమం కంటె మాయాజాలం మీదనే నమ్మకం ఉన్నట్టు బోధపడుతుంది.

యుద్ధం సాగుతున్నది. రావణుడు రథారూఢుడై వచ్చాడు. ఎదురుగా హనుమంతుడు నిలబడ్డాడు.

వానరా! మీ రాజు చాలా గొప్పవాడు సుమీ, నా వంటి త్రిలోక విజేత ఎదుట నిలిచి పోరాడలేక నీ వంటి యువకులను పంపి బలి యిస్తున్నాడు, అని రావణుడు అపహసించగా హనుమంతుడు :

రావణా! ఆపు నీ ప్రసంగం, మన బలాబలాలు చూసుకుందాం, అని హుంకరించాడు.

రావణుడికి సంతోషం కలిగింది– నేటి వరకూ రణరంగలో నాకెదురు నిలిచి పోరాడిన వాడు లేడు. అటువంటి నాతో యుద్ధం చెయ్యాలని కుతూహలపడుతున్నావు, బావుంది. రా, నా దగ్గరగా వచ్చి నా రొమ్ము మీద నీ పిడిగుద్దు వేసి చూపించు, అప్పుడు చూస్తాను నీ బలం, అనగానే మారుతి తన అరచేతులు రెండూ కలిపి బిగించి రావణుని గుండె మీద విసిరాడు.

ఆ పిడిగుద్దుకు రావణుని గుండె అదిరింది. కనులు మూతలు పడ్డాయి. ఊపిరి ఎగతన్నింది. గాలి వానలో అరటిచెట్టులా ఆ మహాకాయం ఊగిసలాడింది.

కొంతసేపటికి ఊపిరి పీల్చి : భేష్, నీ బలం నాకు నచ్చింది. ఇప్పుడు నీతో యుద్ధం చేస్తాను, అన్నాడు రావణుడు.

హనుమ : రావణా, నా పిడికిలిపోటు తిని బ్రతికినవాడు లేడు, ఈ దెబ్బతిని నువ్వింకా మాట్లాడుతున్నావంటే నా శక్తి ఎంతటిదో తెలిసింది, పో, మా వీరులతో పోరాడు, అంటాడు.

* * *

సంగ్రామం సాగుతోంది.

కుంభకర్ణుడు నేలకూలాడు.

ఇంద్రజిత్తు ప్రయోగించిన బ్రహ్మాస్త్రం రామలక్ష్మణ సుగ్రీవులతో వానర భల్లూక యోధులందరినీ మూర్ఛితులను చేసింది. ఆ అస్త్రశక్తికి లొంగనివారు విభీషణ, హనుమంతులు. వీరిద్దరూ రణరంగం అంతా తిరుగుతూ ఎవరెవరు ఏ దశలో వున్నారో చూస్తూ జాంబవంతుని సమీపించారు.

విభీషణుడు నెమ్మదిగా జాంబవంతుని చెవిలో– తాతా! ఎలా వున్నావు? అనగా ఆ వృద్ధయోధుడు!

నాయనా వార్ధక్యం వల్ల ఆ బాణఘాతం నా చూపును మందగింపజేసింది, అయినా నీ కంఠస్వరాన్ని బట్టి నువ్వు విభీషణుడవనుకుంటున్నాను. ఇంతకూ అంజనా నందనుడు మా మారుతి కుశలంగా వున్నాడా! అని ప్రశ్నించాడు.

విభీషణుడు : తాతా! రామలక్ష్మణుల విషయం కాని, మీ ప్రభువు సుగ్రీవుని విషయం కాని అడగకుండా మారుతి ఒక్కడిని గురించే అడుగుతున్నావేమయ్యా!

జాంబవంతుడు : విభీషణా ! వాడొక్కడు బ్రతికి వుంటే ఈ మహాయోధులందరూ హతులయినా బ్రతికించగలం, వాడు లేడో వీరందరూ వున్నా వూడినట్టే!

ఆ మాటలు వింటూనే హనుమంతుడు జాంబవంతుని పాదాలకు ప్రణామం చేశాడు.

✳ ✳ ✳

తస్మిన్ జీవతి వీరే తు
హత మప్యహతం బలం
హనుమత్యుజ్ఝిత ప్రాణే
జీవం తోపి మృతావయం॥

✳ ✳ ✳

తతో వృద్ధ ముపాగమ్య
నియమే నాభ్య వాదయత్
గృహ్యా జాంబవంతః పాదౌ
హనుమాన్మారుతాత్మజః॥

✳ ✳ ✳

జాంబవంతుడు : నాయనా! వీరందరి ప్రాణాలూ నువ్వు రక్షించాలి. తక్షణం బయలుదేరి హిమగిరి మీద కైలాస శిఖరం దగ్గర దివ్యకాంతులతో వెలిగే మృతసంజీవనీ, విశల్యకరణీ, సావర్ణ్యకరణీ, సంధానకరణీ అనే ఔషధులున్నాయి, అవి క్షణాలలో తీసుకు వచ్చి వీరందరినీ ఉద్ధరించాలి, అనగానే హనుమంతుడు వెళ్ళి ఆ ఔషధులున్న గిరి శిఖరం పెల్లగించుకు వస్తాడు.

శ్రీ మద్రామాయణాన్ని భక్తి శ్రద్ధలతో అధ్యయనం చేసే వారికి యిందులో ఏ అద్భుతం జరిగినా అవతార పురుషుడైన శ్రీరామచంద్రుని మహిమగా, అనుగ్రహంగా కనిపిస్తుంది.

అలాకాక ఆదికవి వాల్మీకి రామాయణ రచనకు ప్రాతిపదికగా పేర్కొన్న సంపూర్ణ మానవ చరిత్రగా గ్రహించినప్పుడు, రామభద్రుని అనంతరం మిగిలిన వారిలో ఏఏ గుణశీల సాహస పరాక్రమాలున్నాయో, అన్ని వున్నవారు కూడా రామసేవకు ఎందుకు అంకితమయ్యారో గ్రహించగలుగుతాం.

రామలక్ష్మణ సుగ్రీవుల కంటె కూడా హనుమంతుడెంత స్థిరచిత్తుడో, విపత్తులు మీద పడినప్పుడు నిర్భయంగా తన శక్తితో ఆ ప్రాణాపాయ దశను ఎలా తప్పించగలడో–

సీతాదేవి ఆత్మత్యాగానికి ఉపక్రమించినప్పుడు తన సంభాషణతో విరమింపజేశాడు.

రామలక్ష్మణ సుగ్రీవాదులు బ్రహ్మాస్త్రబంధితులైనప్పుడు తన దేహబలంతో వారందరినీ రక్షించడానికి ఓషధులున్న పర్వతాన్నే తెస్తాడు.

అందుకే అనుభవజ్ఞుడైన జాంబవంతుడు హనుమంతుని గురించి అంత ప్రశంసించాడు.

అంత శక్తిమంతుడైన జాంబవంతుని పాదాలకు నమస్కరించి తన వినయాన్ని ప్రదర్శించాడు, ధీమంతుడు కనక హనుమంతుడు.

❋ ❋ ❋

రావణుడు తన ఎదుట నిలిచిన విభీషణుని మీది ఆగ్రహంతో శక్తిని ప్రయోగించాడు, ఆ శక్తి తగిలిందంటే నేలకూలక తప్పదని గ్రహించి, లక్ష్మణుడు తన అన్నగారు విభీషణునికిచ్చిన అభయం గుర్తుకొచ్చి, ఆ శక్తికి అడ్డంగా వెళ్ళి నేలకు ఒరిగాడు.

అంతలో లక్ష్మణుడు మరణించాడనే భావించిన రాముడు :

నా బహిప్రాణమైన సోదరుడు లక్ష్మణుడు లేనప్పుడు నాకు ఈ ప్రపంచంతో పని లేదు. యుద్ధం అనవసరం, సీత అనవసరం, రాజ్యం వద్దు, ఈ జీవితం కూడా అనవసరం.

దేశే దేశే కళత్రాణి
దేశే దేశే చ బాంధవాః
తం తు దేశ న పశ్యామి
యత్ర భ్రాతా సహోదరః!

ప్రపంచంలో భార్యను సంపాదించుకోవచ్చు, ఆ వంకన బంధువులూ దొరుకుతారు, కాని, రక్తం పుంచుకుపుట్టే సహోదరుడు దొరకడు; అని అతి దీనంగా గుండెలవిసేలా విలపిస్తూ, నాకోసం రాజభోగాలు విడిచి, అరణ్యంలో కష్టాలు పడడానికి వచ్చిన సోదరుడు ఈ దశలో పడడం చూస్తే –

లజ్జతీవ హి మే వీర్యం
భ్రశ్యతీవ కరాద్ధనుః
సాయకా వ్యవసీదంతి
దృష్టి ర్బాష్ప వశం గీతా॥
అవసీదంతి గాత్రాణి
స్వప్నయానే న్యణామివ
... ...
నహి యుద్ధే న మే కార్యం
నైవ ప్రాణై ర్న సీతయా॥

కోదండం జారుతోంది, అవయవాలు పట్లు తప్పుతున్నాయి, కన్నులు బాష్పపూర్ణాలై చూపు మందగించింది, అంటాడు.

(సరిగ్గా కురుక్షేత్ర ప్రారంభంలో గీతా ప్రబోధవేళ అర్జునుడు యిదే దశలో పడ్డాడు).

సీదంతి మమ గాత్రాణి
ముఖంచ పరిశుష్యతి
....
గాండీవం స్రంసతే హస్తాత్
త్వాక్ చైవ పరిదహ్యతే॥

❊ ❊ ❊

ఇంతవరకూ మనం లక్ష్మణస్వామికి అన్నగారి మీద వున్న గౌరవం, అనురాగం చూశాం, అంతే తప్ప రామునికి సోదర ప్రేమ ఎంత వున్నదో ఎక్కడా కనిపించదు. ఆయన మనస్సు తమ్ముని మీద ఎంత గాఢానురాగంతో వున్నదో యిక్కడే గోచరిస్తుంది.

అది వాల్మీకి మునీంద్రుని విశిష్టత. అయినదానికీ కాని దానికీ అలింగనం చేసుకుంటూ వాత్సల్యాన్ని ప్రకటించడం ఉత్తమ పురుషులు చేసే పని కాదు. అవసరమ యినప్పుడు మాత్రమే తమ మనస్సులోని భావాలనూ, ఊహలనూ అభివ్యక్తం చేస్తారు.

సరే, ఆ తరువాత రాజవైద్యుడు – సుషేణుడు వచ్చి లక్ష్మణుని పరిశీలించి–

రామభద్రా! ఎందుకయ్యా యింత శోకం, నీ సోదరుడు మూర్ఛపోయాడు, కావాలంటే చూడు.

ఈ ముఖం వికారంగా లేదు, శరీరం వివర్ణం కాలేదు, వదనం ప్రసన్నంగానే వుంది. అరచేతులు అరుణ పద్మాలవలెనే వున్నాయి. కన్నులలో ప్రశాంతత గోచరిస్తున్నది. గుండె చలిస్తూనే వున్నది, శ్వాస తగ్గలేదు, అని జీవి లక్షణాలన్నీ వివరించి, హనుమంతుని పిలిచి:

నాయనా, నీకు మళ్ళీ పని తగిలింది, జాంబవంతుల వారు చెప్పిన ఓషధులు మళ్ళీ తీసుకురావాలి, అని పంపి ఆ ఓషధులతో చికిత్స చేస్తాడు. లక్ష్మణస్వామి సుఖ నిద్ర పొందినవానిలా లేచి కూర్చుని అన్నగారి దశ చూసి :

నీవంటి సత్యపరాక్రముడు నీరస పడడం, చేసిన ప్రతిజ్ఞను విస్మరించడం ఉచితం కాదయ్యా; సత్పురుషులిలా ప్రవర్తించరు, రావణ సంహారానికి ఉపక్రమించు, అని ప్రబోధిస్తాడు.

అప్పుడు ప్రారంభమైన సంగ్రామంలో రామ రావణులు తమ అస్త్రవిద్యలను ప్రదర్శించి లోకభీకరంగా పోరు సాగిస్తారు.

గగనం గగనాకారం
సాగరం సాగరోపమః
రామ రావణయోర్యుద్ధం
రామరావణయోరివ ॥

అంటాడు వాల్మీకి. అంటే ఆకాశానికి ఆకాశమే ఉపమానం. అంతకంటె విశాలమైనది లేదు. అలానే సముద్రాన్ని దేనితోనూ ఉపమించలేం. దాని గాంభీర్యం దానిదే. రామ రావణ యుద్ధానికీ మరో ఉపమానం లేదు.

ఈ సమయంలోనే రాముడంటాడు :

అరావణమరామం వా
జగద్రక్ష్యథ వానరా॥

ఈనాటి యుద్ధంలో రావణుడో, రాముడో ఒక్కడే మిగులుతాడు, ఈ మాట చదివినప్పుడు రాముడు రాజపుత్రుడుగా రణరంగంలో నిలబడ్డట్టే అనిపిస్తుంది. అలాకాక భగవంతుడే అయితే హిరణ్యాక్ష, హిరణ్యకశిపులను చీల్చినట్లు ఒక్క క్షణంలోనే రావణుని పడగొట్టేవాడు.

రామరావణ సంగ్రామం "ఒక బాణం"తో తేలలేదు, ఒక్కరోజులోనూ తేలలేదు. సుమారు వారం రోజులు ముల్లోకాలకూ అద్భుతాన్నీ, భయాన్నీ కలిగించిన యుద్ధం అది. రావణుడు నేల కూలాక మండోదరి వచ్చి విలపిస్తూ :

ఆనాడే చెప్పాను. ఎందుకీ యిల్లాలిని తెచ్చావూ, ఇందరు సుందరాంగులతో తృప్తిగా బ్రతకలేక, ఈవిడ మీద మోహంతో సర్వనాశనం తెచ్చిపెడుతున్నావు, అని నెత్తీ నోరూ మొత్తుకున్నాను. నీ చెవికెక్కలేదు. లంకానగరం సహా మేమంతా అనాధలమయ్యాం, అంది.

రావణ దహనం జరిగింది, విభీషణుడికి పట్టాభిషేకం జరిపించి రమ్మని లక్ష్మణస్వామిని పంపుతాడు రాముడు. ఇక్కడే కాదు సుగ్రీవ పట్టాభిషేకం కూడా లక్ష్మణుడే నడిపిస్తాడు.

అంటే పితృవాక్పాలన దీక్ష అంత పట్టుదల రామునికి. నగరంలో కాలు పెట్టడు. పదునాలుగేళ్ళూ అరణ్యంలో వుండవలసిందే.

❋ ❋ ❋

అనంతరం రాముడు హనుమంతుని పిలిచి రావణ రాక్షసుడు నేల కూలిన వార్త సీతాదేవికి చెప్పి రమ్మంటాడు.

హనుమంతుని నోట ఆ శుభవార్త విని సీతాదేవి సంతోషభరిత హృదయంతో :

నాయనా! ఇంత చక్కని మాట చెప్పిన నీకు ఈ భూమండలంలో మణి, రత్న, భూషణాలన్నీ యిచ్చినా ఋణం తీరదు, అని ఆయన వాక్య విశారదత్వాన్ని కొనియాడుతుంది.

నహి పశ్యామి తత్సౌమ్య
పృథివ్యా మపి వానర
సదృశం మత్ప్రియాఖ్యానే
తవ దాతుం భవేత్సమం॥
హిరణ్యం వా సువర్ణం వా
రత్నాని వివిధాని చ
రాజ్యం వా త్రిషు లోకేషు
నైదర్హతి భాషితమ్॥

అప్పుడు హనుమంతుడు : అమ్మా! ఇంతకాలం నిన్ను బాధించిన ఈ రాక్షసస్త్రీలను యిప్పుడు నేను హింసిస్తాను, అనగా ఆవిడ : నాయనా! వీరంతా సేవకులు, ప్రభువు ఆజ్ఞ పాలించారు. సేవాధర్మాన్ని నిర్వర్తించారే తప్ప మరే దోషమూ చెయ్యలేదు, అటువంటి వారిని హింసించరాదు, అని రాజనీతి బోధించింది.

ప్రభుత్వాలు మారినప్పుడు అంతకు ముందువారి ఆదేశాలను పాలించినవారిపై కక్ష చూపరాదనే నీతి యిక్కడ కనపడుతుంది.

ఆ ప్రసంగం అయాక జానకీదేవి : హనుమా! నాకు ఒక్కమారు వారిని చూడాలని వుంది. అనగానే తిరిగి వచ్చి ఆ మాట వినిపించాడు మారుతి.

అప్పుడు రాముడు విభీషణునితో :

విదేహ రాజనందన అంగరాగాలతో భూషణాలంకృతయై నా యెదుటకు రావాలి అన్నాడు.

ఇక్కడ రాముని రాజనీతి మర్యాద కనిపిస్తుంది. తాను పరరాజ్యంలో వున్నాడు, అక్కడ ఏం జరగాలన్నా ఆ రాజుగారి అనుమతి కావాలి. అందుకే విభీషణునితో చెప్పాడు.

విభీషణుడు అంతఃపురానికి సీతాదేవిని రప్పించి, రాముని ఆదేశం వినిపించాడు. అప్పుడు సీతాదేవి :

ఎలా వున్నదాన్ని అలాగే వస్తా అంటుంది.

అస్మాతా ద్రష్టు మిచ్ఛామి
భర్తారం రాక్షసాధిప॥

అప్పుడు విభీషణుడు : రామపత్నీ! ఆయన ఎలా చెబితే అలాగే చెయ్యాలని ఎరుగనివారా మీరు! అంటాడు.

యదా హి రాజా భర్తా తే
తత్తథా కర్తు మర్హసి॥

అప్పుడు ఆవిడకు అభ్యంగనం జరిపించి అలంకరించి, పల్లకీ మీద తీసుకు వస్తున్నారు. దానిచుట్టూ రాజలాంఛనంగా చీనాంబరాలు కప్పి, వేత్రహస్తులు కాపలాగా ఉండి తీసుకు వస్తున్నారు.

ఏ యిల్లాలి కోసం రామభద్రుడింత సంగ్రామం సాగించాడో ఆ దేవిని చూడాలనే కుతూహలంతో వానర భల్లూక యోధులు చుట్టుముడుతుంటే, సేవకులు వారిని గర్జించి దూరంగా వుంచుతున్నారు.

ఆ ధ్వని విని విషయం తెలుసుకుని రాముడు :

విభీషణా! కష్టాలలో, యుద్ధసమయంలో, దేశంలో సంక్షోభం ఏర్పడినప్పుడు స్వయంవర వేళ, యజ్ఞశాలలో వివాహాది శుభకార్యాలలో ఈ అభ్యంతరాలు అవసరం లేదు, నా దగ్గరకు వస్తున్నప్పుడు మరీ అనవసరం. అందరూ చూడడానికి వీలుగా పల్లకీ దిగి రావచ్చు, అన్నాడు.

సీతాదేవి నడచి వచ్చి రాముని పక్కనే తలవంచి నిలబడింది.

చూశాడు రాముడు – పూర్ణచంద్ర కాంతితో అలరారుతున్నది జానకీదేవి.

చూచిన క్షణంలో ఆయన కన్నులు ఎర్రవారాయి, గుండెలో క్రోధం రేగింది.

కళ్యాణీ! విధి ప్రేరణవల్ల నా భార్యను అపహరించిన రావణుని సంహారం పూర్తి చేశాను. అందుకు ఈ వానర భల్లూక సేనలు ఎంతో శ్రమపడి సహాయం చేశాయి. నా వంశ గౌరవాన్ని రక్షించుకున్నాను. నా పరాక్రమం ముల్లోకాలలో కీర్తిపాత్రమయింది.

ఇక యిప్పుడు–ఇంతకాలం పరగృహంలో వున్న నిన్ను స్వీకరించడానికి నా మనస్సు అంగీకరించడం లేదు. రాక్షస రావణ స్పర్శ శోకిన నిన్ను గ్రహించి మా వంశకీర్తిని గంగలో కలపలేను.

"ఇప్పుడు నీకు ఎక్కడ సుఖంగా వుంటే అక్కడ వుండవచ్చు. లక్ష్మణుడా, భరతుడా, వానరేశ్వరుడా, రాక్షసాధిపతి విభీషణుడా? వీరిలో ఎవరి యింట వుండాలని వుంటే అక్కడే వుండు" అన్నాడు.

ఆ మాటలు విన్న సీతాదేవి కంటివెంట బాష్పవర్షం ఆరంభమయింది. ఏనుగు తొండంతో పెకలింపబడ్డ చిగురాకు తీగలా గజగజలాడుతూ :

నీ వాక్కులతో ఎందుకయ్యా హింసిస్తావు? సామాన్య స్త్రీల వలె నేను కూడా ప్రవర్తించాననుకుంటున్నావు. నువ్వు పంపిన హనుమంతుడు చూశాడు, నేనిక్కడ ఏ దశలో వున్నానో. ఇంత మాట పడ్డాక నాకు బ్రతకాలని లేదు.

కాని వీరందరినీ ఎందుకింత శ్రమ పెట్టావు? రాక్షస సంహారం దేనికోసం సాగించావు. చిన్ననాడు నా పాణిగ్రహణం చేశావు. నాటి నుంచీ నీయందు భక్తితో, పాతివ్రత్య దీక్షతో ఎలా సేవించుకున్నానో ఎరిగి వుండీ అంతా త్రోసిపుచ్చి నన్ను శంకిస్తున్నావు, అని లక్ష్మణుని వైపు తిరిగి;

నాయనా! చితి పేర్చవయ్యా, ఇప్పుడింక అదే దారి, అంది.

లక్ష్మణస్వామి చితి పేర్చాడు. అగ్నిజ్వాలలు రేగుతుండగా సీతాదేవి రామునికి ప్రదక్షణం చేసి అగ్నిగుండం ఎదుట నిలబడి :

ఈనాటి వరకూ నా హృదయం రామునియందే లగ్నమైవుంటే– నేటివరకూ నా నడవడి అకల్మషంగా సాగితే– మనోవాక్కాయాలతో నే నెన్నడూ అతిగా చరించకపోతే ఈ అగ్ని హోత్రుడు నన్ను రక్షించాలి–

అంటూ అగ్నిగుండంలో దూకింది.

మరుక్షణంలో అగ్నిహోత్రుడు చేతులు జోడించి, "రామభద్రా! ఈ యిల్లాలు ఏ పాపం ఎరగదు, నిరంతరం త్రికరణాలూ నీ మీదనే నిలిపి వున్న పతివ్రతా శిరోమణి" అంటూ ఏ దివ్యాంగ రాగభూషణాంబరాలతో దూకిందో అలానే ఆ యిల్లాలిని రామభద్రునికి అప్పగించాడు.

* * *

అనంతరం సుగ్రీవ, విభీషణుల కోరిక ప్రకారం వారితో వారి సేనలు కూడా అయోధ్యకు రావడానికి రాముడంగీకరించాడు. అందరూ పుష్పకం ఎక్కారు?

పెనుగాలిలో కదిలే మేఘంలా విమానం లేచి సాగుతోంది.

విమానం కదులుతూండగా రామభద్రుడు సీతాదేవితో–

వైదేహీ! ఇదిగో ఇక్కడ రావణుని చంపాను, అక్కడ కుంభకర్ణుడు, ప్రహస్త, ధూమ్రాక్షులిక్కడ నేలకూలారు. మన లక్ష్మణుడు ఇక్కడ ఇంద్రజిత్తును సంహరించాడు. ఆ పక్కనే విరూపాక్ష, మహాపార్శ్వ, అకంపనాదులు ప్రాణాలు వదిలారు. ఇక్కడే రావణ పట్టమహిషితో యితర నారీజనం విలపించారు.

అదిగో సముద్రం దాటుతున్నాం. ఇది మన నలుడు కట్టిన సేతువు. ఆ కనిపించేది మైనాక శిఖరం. ఇదిగో ఇక్కడ విభీషణుడు నాతో స్నేహం చేసుకున్నాడు.

అప్పుడే కిష్కింధ చేరుతున్నాం, అంటుండగా సీతాదేవి

స్వామీ! వానరరాజు సుగ్రీవుని ప్రాణసఖి తారా, వారి ఇతర నారీమణులను కూడా అయోధ్యకు తీసుకువెడదాం అన్నది.

రామాజ్ఞతో విమానం క్రిందికి దిగింది.

సుగ్రీవాజ్ఞతో వానర స్త్రీలందరూ విమానం ఎక్కారు.

విమానం భరద్వాజుని ఆశ్రమం దగ్గర దిగింది. అందరూ మహర్షికి నమస్కరించి, ఆయన అనుమతితో అక్కడ విశ్రమించారు.

అప్పుడు రాముడు హనుమంతుని పిలిచి:

మారుతీ! హుటాహుటి అయోధ్యకు వెళ్ళి, జరిగిన కథ అంతా మా భరతునికి చెప్పు. మేమిక్కడ ఆశ్రమంలో వున్నామని చెప్పు. చెపుతూన్న సమయంలో వాని వదనంలో మార్పులు గమనించు, మాటలలో వాని హృదయం పట్టుకో, రాజ్యకాంక్ష, అధికార దాహం వున్నట్టు కనపడితే రాత్రికి రాత్రి వెనుదిరిగి రా; అన్నాడు.

అంటే హనుమంతుడు తిరిగి వచ్చి భరతుని మనసులో రాజ్యకాంక్ష వున్నదని చెపితే, రాముడు అయోధ్య వైపు చూడడు. మళ్లీ అరణ్యవాసమే.

అదీ రామావతార వైశిష్ట్యం.

ఒకనాడు పితృవాక్పాలన కోసం రాజ్యాన్ని తృణప్రాయంగా వదిలాడు.

ఈనాడు సోదరునికి రాజ్యం మీద ఆశ ఉంటే నిశ్చింతగా విడిచిపెట్టగలడు. అంత ధర్మనిష్ఠ ఆయనది.

※ ※ ※

ఇక్కడ రెండు సన్నివేశాలు వాల్మీకంలో సూచనగా విడిచి పెట్టినవి, నేటికీ వ్యాఖ్యాత లెవ్వరూ వివరించనివి విశ్వనాథ వారు తమ రామాయణ కల్పవృక్షంలో విశదం, చేసినవి చూడాలి.

※ ※ ※

రాముడు సీతాదేవిని చూస్తూనే ఆగ్రహంతో మాట్లాడాడు, చాలా దారుణంగా మాట్లాడాడు. ఆ దారుణాన్ని భరించలేక జానకీదేవి నిప్పులో దూకేసింది.

లంకలో రాక్షసాంతఃపురంలో వున్నందున ప్రజలేమనుకుంటారో అనే శంకతో రాముడు అలా పరుషంగా మాట్లాడాడన్నారే తప్ప వాల్మీకి ఎందుకంత విషాద సన్నివేశం అందించాడో చూడలేదు వ్యాఖ్యాతలు.

దాన్ని పట్టారు విశ్వనాథవారు.

విమానం కిష్కింధ నుంచి భరద్వాజాశ్రమం వైపు పోతున్నది. అప్పుడు సీతాదేవి–

"మనం అత్రి ముని ఆశ్రమానికి వెళ్ళాలి" అంటుంది. విమానం అత్రి ముని ఆశ్రమ సమీపాన దిగింది.

రామలక్ష్మణులిద్దరూ ఆశ్రమ ప్రాంగణంలో వున్న మహర్షికి అభివాదం చేసి కూర్చున్నారు.

సీతాదేవి లోపలకు వెళ్ళి అనసూయాదేవి పెరటి వైపు మల్లెతీగ దాకా నడిపించి కూర్చోబెట్టి, ఆవిడ పాదాలు ఒత్తుతూ :

నీవు ఒసంగినప్డు
కరుణించితి వంచనిపించె గాని
తల్లీ వరమద్దినాడు మసలెన్
పరిణామ విషాద గాథగా
నా విభు కన్నుదోయికిని
నాకసతీ నిభమూర్తి నౌటయే
ఏవము కల్గజేసినది
ఏ చిన ఒక్క దురంత వేళకున్॥

అమ్మా, అప్పుడు నీ దర్శనానికి వచ్చినపుడు దయతో అనుగ్రహించిన అంగరాగాలతో ఆయన దగ్గరకు వచ్చాను, రావణ సంహారానంతరం.

నీ వరప్రభావం వల్ల ఆయన కంటికి శచీదేవిలా కనిపించాను. మిగిలినవారందరికీ లంకలో ఏడాదిపాటు పడిన క్లేశాలతో కృశించినట్లే కనిపించి ఉంటాను.

ఏడాది లంకలో వున్నా అప్సరసలా కనపడేసరికి ఆయనకు ఆవేశం వచ్చి ఎంతెంత మాటలన్నారో తెలుసా!

ఇదీ విశ్వనాథ విశిష్ట వ్యక్తిత్వం.

ఎక్కడో అయోధ్యాకాండలో అనసూయాదేవి యిచ్చిన అంగరాగాలు, వాటి ప్రభావం మనస్సులో నిలబడదు. వాల్మీకి కూడా ఈ మాట వివరించకుండా సీతాదేవిని రప్పించి రాముని చేత అంతంతమాటలనిపించాడు. ఈ కీలకం తెలియనివారందరూ ప్రజాపవాదానికి భయపడి రాముడు అలా అన్నాడన్నారు.

రామాయణానికి సంబంధించినంత వరకూ రాముడు దశరథ మహారాజు కొడుకు, పూర్తిగా రాచబిడ్డ. అవతార పురుషుడననీ, భగవంతుడననీ అనుకోలేదు, అనలేదు, పోగా

ఆత్మానం మానుషం మన్యే
రామం దశరథాత్మజం॥

అని స్పష్టంగా చెప్పాడు. అందువల్లనే కల్పవృక్ష కవి ఈ విశేషాన్ని వివరించాడు. ఆ

వివరణ చాలు విశ్వనాథ ఎంత గాఢంగా రామాయణం లోతులు తరచాడో చెప్పడానికి.

ఎలాగూ కల్పవృక్షం నీడకు చేరాం కనక దానిలోని రెండు మూడు విశేషాలూ వాల్మీకంలో లేనివి, వాల్మీకి కూడా సంతోషించేవి చూద్దాం.

సీతాదేవి ఈ మాట అనగానే అనసూయాదేవికి విపరీతమైన కోపం వచ్చింది. కోపంతో పోయి రాముని చూసి ఏమీ అనకుండా తిరిగి చక్కా వచ్చింది.

ఆ పతివ్రతామతల్లి కంటి ఎరుపు చూచి గజగజలాడాడు, రావణ, కుంభకర్ణాది యోధులను నేల కూల్చిన జగదేక ధానుష్కుడు.

అంటే పాతివ్రత్య శక్తి ముందు ఏ బలం, అస్త్రం ఎందుకూ కొరగావు, అని ఈ దేశీయుడు మాత్రమే - సంస్కార హృదయం ఉంటే గ్రహించగలడు.

ఇక్కడతో యిది పూర్తి కాదు -

అయోధ్య చేరుతున్నారు. వస్తూన్న సీతా రామ లక్ష్మణులకు స్వాగతం యివ్వడానికి భరత శత్రుఘ్నులు వశిష్ఠుల వారిని ముందుంచుకుని బయలుదేరారు.

అందరికంటె ముందుగా అరుంధతీదేవి వున్నది.

అల్లంత దూరాన ఆ సాధ్వీమతల్లిని చూచి రాముడు :

మిథిలానాథ కుమారి!
నీ కరుణ మున్మీలింపవే
తత్తపః పృదు తెజఃఖనితో వచింపకువె
తత్తేజొ నిధానంతో
అధరంబున్ కదలింప కేగె అనసూయాదేవి
ఈ దేవి స్ఫూర్జధువౌ సర్వ పతివ్రతా నిలయ
తేజః స్ఫార వార్వాహమై॥

ఓ జనకరాజపుత్రీ కొంచెం కోపం తగ్గించి, దయతో నా మాట విను. అగ్నిప్రవేశం కథ అనసూయాదేవికి చెప్పినట్లు ఈ పూజ్యురాలికి చెప్పకు. ఆవిడ కరుణించి నన్ను ఆగ్రహదృక్కులతో విడిచిపెట్టింది శపించకుండా.

ఈ అరుంధతీదేవి వున్నదే, ఈవిడ పెదవి కదపనవసరం లేదు, చూపు కదిలిస్తే చాలు, ఆ వేడి వానకాలపు మబ్బులో పుట్టిన విద్యుత్తులా దహించగలదు-అని బ్రతిమాలుతాడు.

పాతివ్రత్య శక్తిని ఎంత ఉన్నతంగా, ఉదాత్తంగా ప్రతిపాదించి, మనలను ఆశ్చర్యచకితులను చేసి ఆనందసీమలకు తీసుకుపోయారో ఈ సన్నివేశాలలో గోచరిస్తుంది.

❊ ❊ ❊

మరొక్క మెరుపున్నది.

భరద్వాజుల ఆశ్రమంలో అందరూ మహర్షికి నమస్కారాలు చేశారు, ఆయన అభయహస్తముద్రతో అందరినీ పంపించాడు. చివరగా హనుమంతుడు వచ్చి పాదాల మీద పడ్డాడు. అప్పుడు –

మునియున్ మారుతి కౌగిలించుకుని
సమ్మోదంబునన్ పల్కె – అంతన
అబ్ధిన్, విపదబ్ధి దాటితివి నిన్ దాటించి తన్నన్
మహాముని అప్డప్పుడు మీరు మీర్మను
అంభో యాన పాత్రీకృతాత్మ నితాంతోగ్ర
తపశ్చటా వితతీ పంపన్ నేను గుర్తించితిన్ ॥

భరద్వాజుడు ఆ క్షణంలో హనుమంతుని లేవనెత్తి దగ్గరగా హత్తుకుని, "నాయనా! చాలా ఆనందంగా వుంది నిన్ను చూస్తుంటే, శతయోజన విస్తీర్ణమైన సముద్రాన్ని దాటావు. సీతారాములను వియోగ సముద్రం నుండి దాటించావు. చాలా గొప్పవాడివి", అన్నాడు.

అప్పుడు హనుమంతుడు వినయంగా చేతులు జోడించి :

"మహర్షీ! ఏమిటంటున్నారు మీరు? ఇదంతా నా గొప్పతనమా! మీవంటి మహామునుల తపశ్శక్తి నన్ను తీసుకెళ్ళింది కానీ, నేను సముద్రం దాటగలవాడినా? మీ అనుగ్రహంతో యిది సాధించాను. ఆశీర్వదించండి", అని పెద్దల ముందు మనం ఎలా వుండాలో విశదం చేశాడు.

✳ ✳ ✳

రామపట్టాభిషేకం అయింది.

అందరికీ సత్కారాలూ బహుమానాలూ యిచ్చారు.

హనుమంతుడికి ఏమీ ఇవ్వలేదు. అందరూ తెల్లబోయి చూస్తున్నారు. రెండు క్షణాలు రామభద్రుడు ప్రసన్నగంభీరంగా సభాసదులందరినీ తిలకించి –

మణిప్రవర జోష్టంచ ముక్తాహార మను త్తమం
సీతాయై ప్రదదౌ రాః చంద్రరశ్మి సమప్రభవం॥

✳ ✳ ✳

ప్రదేహ సుభగే హారం
యస్య తుష్టాసి భామిని
పౌరుషం విక్రమా బుద్ధిః
యస్మిన్నేతాని సర్వశః॥

చంద్రకాంతులీనే ముత్యాల హారాన్ని తన మెడ నుండి తీసి సీతాదేవికి అందించాడు రామభద్రుడు. ఆ యిల్లాలు తెల్లబోయి రామచంద్రుని కన్నులలోకి చూసింది. రాముడు చిరునవ్వుతో –

"జానకీ, ఈ సదస్యులలో నీ అభిమానానికి పాత్రులైనవారికి దీనిని బహూకరించు. ధీమంతుడు, ధీరుడు, పౌరుషవంతుడు అని ఎవరిని భావిస్తున్నావో వారికియ్యి" అన్నాడు.

అప్పుడు పట్టమహిషి సీతాదేవి రత్నసింహాసనం దిగి మందహాసంతో, ఆదరాభిమాన పురస్సరంగా హనుమంతునికి బహూకరించింది. అదీ ప్రభు లక్షణం. తన పరిజనంలో ఎవరు ఎంతటివారో, వారిని ఎలా సన్మానించాలో తెలిసినవాడు రామచంద్రుడు. అటువంటి మహాపురుషులు సింహాసనాల మీద ఉంటేనే ధీ, ధీరశక్తులు కల హనుమంతుని వంటి స్వామికార్య నిర్వహణదక్షులు తమ పరాక్రమ సాహసాలు ప్రదర్శించి ప్రతిభా సంపదను లోకక్షేమానికి వినియోగించి సంతృప్తిపడతారు.

లోకాః సమస్తాః సుఖినోభవంతు.

ఉపన్యాస భారతం

రథం బయలుదేరింది.

బయలుదేరనున్న రథానికి శైబ్య, సుగ్రీవ, మేఘపుష్ప, వలాహకాలనే గుర్రాలను కట్టి సారథి దారుకుడు కళ్ళాలు బిగబట్టి కొరడా ఝుళిపిస్తున్నాడు. రథం మీద బయలుదేరవలసిన వాసుదేవుడు – కృష్ణ పరమాత్మ శిబిర అంతర్భాగంలో దేవబ్రాహ్మణ పూజలు జరిపి అలంకారాలు పూర్తి చేసుకుంటున్నాడు.

* * *

ఇది ద్వారక కాదు ఉపప్లావ్యం.

పాండవులు అరణ్యవాస, అజ్ఞాతవాసాలు ముగించి అనంతరం విరాట నగరం వీడి ఉపప్లావ్యం చేరి తమ రాజ్యభాగం తమకిప్పించమని ద్రుపద పురోహితులను పంపారు. దానికి సమాధానంగా ధృతరాష్ట్రుడు తన ఆంతరంగిక సచివుడైన సంజయుని రాయబారం నడిపించాడు.

కర్ర విరగకుండా పాము చావకుండా సాగించిన సంజయ రాయబారానికి ప్రతిగా పాండవులు శ్రీకృష్ణుని పంపడానికి నిశ్చయం చేసి ఒక సాయంకాల సమయంలో సభ చేశారు. ఆ సభలో వారి మామగారు ద్రుపదమహారాజు, వియ్యంకుడు విరటరాజు వున్నారు.

అప్పటికే యుద్ధసన్నాహాలతో వచ్చిన ఏడక్షౌహిణుల సేనాపతులు, దండనాథులు. సుఖాసీనులై వున్నారు.

ఆ సభా మధ్యంలో నవ్వు రాజిల్లెడు మోముతో కూర్చున్న వాసుదేవుని వైపు తిరిగి ధర్మరాజు :

కృష్ణా! జరిగిన గాథలు నీకు తెలియనివి కావు. జరగవలసినదేమిటో నీకు మరొకరు చెప్పనవసరం లేదు. అయినా మనసులోని మాట విప్పి చెప్పాలి కదా.

మాకు వారు ఎన్నో అన్యాయాలూ, మోసాలూ, ద్రోహాలూ చేసినా మేము క్షమాబుద్ధితో అన్నీ విస్మరించి వారితో సోదర స్నేహాన్నే కోరుతున్నాం. మా రాజ్యభాగాన్ని – న్యాయంగా మాకు రావలసిన దానిని జూద నియమానుసారం అరణ్య, అజ్ఞాతవాసాలు కాగానే వారు ఇస్తామని వాగ్దానం చేసిన దానినే మేము కోరుతున్నాం; ఒకవేళ అర్ధరాజ్యం యివ్వడానికి వారు అంగీకరించకపోతే మా సోదరులయిదుగురికీ అయిదు గ్రామాలిచ్చినా తృప్తిగా బ్రతుకుతాం.

అవిస్థలం వృకస్థలం మాకందీ వారణావతం
కంచి దేకంచ గోవింద.

ఎలా అయినా సంగ్రామం లేకుండా శాంతిగా సంధి సాగాలనేదే మా ఆకాంక్ష. జన క్షయానికీ, సర్వనాశనానికీ మూలమైన యుద్ధం ఎవరికీ మంచిది కాదు. అందుచేత శాంతంగా సంధి సాగించుకురా– అని ధర్మరాజు సుదీర్ఘంగా తన శాంతి కాంక్షను వెల్లడించాడు.

వాసుదేవుడు చెక్కుచెదరని చిరునవ్వుతో భీమసేనుని వైపు కనులు తిప్పాడు.

బావా! మా అన్నగారి మాట మాకు శిరోధార్యం, అదే వేదవాక్కు. ఆయన అభిప్రాయాన్ని ఏనాడు మేము తిరస్కరించలేదు. ఈ సమయంలో ముఖ్యమైన విషయం ఒకటి గుర్తు చెయ్యాలి; మా పెదనాన్నగారి పెద్దబ్బాయి దుర్యోధనుడున్నాడే వాడు దురభిమాని, దురహంకారి. అందుచేత నువ్వు ఏమాత్రం ఆవేశపడకుండా, మెత్తమెత్తగా శాంతచిత్తంతో నవ్వుతూ మాట్లాడి సంధి చేసుకురా, అని భీమసేనుడనగానే కృష్ణభగవానుడు పకాలున నవ్వి, భీమసేనుని భుజం తట్టి :

బావా! మాట్లాడుతున్నది భీమసేనుడేనా! మెలకువగా వున్నావా! మైకంలో వున్నావా చాలా ఆశ్చర్యంగా వుంది. పర్వతాలు దూదిపింజల వలే ఎగురుతున్నా, అగ్నిహోత్రుడు మంచుముద్దల్లా చల్లబడ్డా, హిమగిరి ప్రచండాగ్ని కాంతులు జిమ్ముతున్నా, భూమ్యాకాశాలు తలక్రిందులయాయన్నా ఆశ్చర్యం లేదు. కాని భీమసేనుని వంటి మహాయోధుడు శాంతిపాఠం వల్లిస్తున్నాడంటే తెల్లబోతున్నాను.

అరణ్యవాస సమయంలో రాత్రులు నిద్రపట్టక, పళ్ళు పటపటలాడిస్తూ, గదాదండం

గిరగిర త్రిప్పుతూ, నేల అదిరేలా పాదాలతో త్రొక్కుతూ శత్రువుల శిరసులు తాటిపళ్ళలా నేలకు రాలుస్తాను, అని గర్జించే మల్లయోధుడేనా యీ శాంతిసూక్తాలు వల్లిస్తున్నది.

ఒక్క సంవత్సరం విరటరాజుగారి వంటింట్లో గరిటె పట్టినంత మాత్రాన నీ శూరత్వం అంతా బూరెల వంటకే అంకితం అయిందా!

అని పరిహసించడం ఆరంభించాడు. అంతలో భీమసేనుడు కోరమీసం ఎగదువ్వి, గదా దండం పైకెత్తి :

కృష్ణా! నాతో వున్న చనువు వల్ల నా శక్తిసామర్థ్యాలు అర్థం కాక చులకనగా మాట్లాడుతున్నావు. నేను తలచుకుంటే భూమి మీదికి ఆకాశాన్ని దింపగలను, క్రింద పడే ఆకాశాన్ని పైకి విసరగలను. కొండలు పిండి చేసి, సముద్రాలు యిగరగొట్టి, వాయువేగంతో ఈ గదా దండాన్ని కదిలించి ఎదురు వచ్చిన శత్రుసేనను ముద్దలు ముద్దలు చేయగలను.

పెద్దవాడు కదా అన్నగారు, అనే గౌరవంతో ఆయన మాటను కాదనలేక సంధి సాగించమన్నాను; అని బుసలు కొట్టే పాములా ఉచ్ఛ్వాస నిశ్వాసలు వదులుతూ కూర్చున్నాడు.

బావా! నాకు తెలుసునయ్యా నీ వీరత్వం, నీ మాటల తీరుచూసి ఎందుకింత నీరసపడ్డావా అని అలా మాట్లాడాను అంటూ ఓదార్చాడు.

ఇక్కడ మనకొక విషయం తెలుస్తుంది.

భీముడికి దేహబలం వున్నదేకాని ధీశక్తిలేదు. అందుచేతనే ధర్మరాజు శాంతి శాంతి అంటే శాంతి శాంతి అన్నాడు; వాసుదేవుడు పరిహాసంతో రెచ్చగొడితే యుద్ధానికి కాలుదువ్వాడు. అదీ వ్యాసుల వారి మనస్తత్త్వ పరిశీలన.

* * *

కృష్ణభగవానుడు అర్జునుని వైపు తిరిగాడు.

అర్జునుడు కూడా చాలావరకూ శాంతిపాఠమే వినిపించి, తప్పనిసరి అయితే యుద్ధానికి దిగుదాం, అన్నాడు.

నకులుడూ అంతలోనే ఆగాడు.

నలుగురు అన్నలు అలా శాంతి వచనాలు పలుకుతుంటే వినిన సహదేవుడు ఆగ్రహంతో,

బావా! అరణ్యవాస అజ్ఞాతవాసాల నాటి వీరి మనస్సు వేరు. ఇప్పుడందరూ మారిపోయి శాంతి శాంతి అంటున్నారు.

నువ్వు కురుసభా భవనంలో కాలుపెడుతూనే ఒక్కమాట చెప్పు.

దుర్యోధనా! ఆడినమాట తప్పకుండా మా రాజ్యం మాకిస్తావా? మీ నూరుగురి తలలు తరిగి పోగులు పెట్టడానికి నన్ను రమ్మన్నావా! అంతే! అంతకుమించి మరోమాట అనవసరం, అని కూర్చున్నాడు.

ఆ పలుకులు ఆలకిస్తూనే సాత్యకి లేచి :

సెహబాస్ సహదేవా! మంచిమాట చెప్పావు. రాచపౌరుషం నిలబెట్టావు, అని అభినందించాడు.

ఇక్కడ ప్రధానాంశాన్ని విస్మరించరాదు.

ధర్మజ, భీమ, అర్జున, నకుల సోదరులు నలుగురు కంటె చిన్నవాడయిన సహదేవుడు పరమ తీవ్రవాది.

ఈ అతివాద ధోరణికి కారణం?

రక్తం పొంగుతోంది. నరాల బిగువు సడలలేదు. కండరాలు తిరిగివున్నాయి. ఆ వయసులో వున్నవాడెవరికీ శాంతి, సహనం కిట్టవు. కిట్టనందువల్లనే ఈనాటి సహదేవులు సైతం ఏమంటున్నారు.

రక్తం పారాలి,

తలలు తెగాలి,

విప్లవం వర్ధిల్లాలి.

అనే నినాదాలతోనే సమస్యలు పరిష్కారం కావాలని భావిస్తున్నారు. సహదేవుడి వలెనే చిన్నవాడయిన సాత్యకి కూడా అదే ధోరణిలో లేచాడు.

పొంగుతూన్న రక్తంతో వుండేవాడు ఏనాడైనా యిచ్చే విప్లవ నినాదాన్నే భారతంలోని సహదేవుడు కూడా పలికాడు.

అయితే నాడు ధర్మరాజు కంటిచూపుతో, వాసుదేవుడు మందహాసంతో వారిని ఆపగలిగేవారు. ఈనాడు ధర్మరాజులు, వాసుదేవులు లేరు. అందరూ సహదేవులే! ఎవరికి వారే నాయకులు. ఎవరి కూటమి వారిదే. అందువల్లనే యింత అల్లకల్లోలమై అస్తవ్యస్త దశలో పడింది దేశం.

* * *

ఇంతవరకూ మగవారి ధోరణి చూశాం. ఇప్పుడు వస్తున్నది నారీ శిరోమణి ద్రౌపదీదేవి.

నవ్వు రాజిల్లెడు మోముతో వాసుదేవుడు :

అమ్మాయీ! నీ అభిప్రాయం ఏమిటమ్మా? అన్నాడు.

వస్తున్నది ద్రుపద రాజపుత్రి!

వంటింట్లో కాదు, పడక గదిలో కాదు.

మహామహులు నిండి వున్న సభామధ్యానికి వస్తున్నదావిడ.

ఎలా వున్నది వస్తున్న ఆ యిల్లాలు!

సర్వలక్షణ సంపన్నం
మహాభుజగ వర్చసం
కేశపక్షం వరారోహ
గృహ్యా వామేన పాణినా!

బరిమీద బుస కొడుతూన్న నల్ల కోడెత్రాచులా నిగనిగలాడే కేశపాశాన్ని ఎడం చేత్తో పట్టుకుని ముందుకు వేసి :

అయం తే పుండరీకాక్ష
దుశ్శాసన కరో ధృతః
స్మర్తవ్య స్సర్వ కార్యేషు
పరేషాం సంధి మిచ్ఛతి॥

కృష్ణా! పదమూడేళ్ళ క్రితం దుష్ట దుశ్శాసనుడు పట్టి లాగగా మిగిలిన ఈ జుట్టు ముడిని మరచిపోకుండా సంధి సంప్రదింపులు నడిపించు.

వీరందరి మాటలూ వింటూంటే నా గుండె ఉడికిపోతోంది. వాసుదేవా! నే నెవరినయ్యా!

వరమున బుట్టితిన్
భరతవంశము జొచ్చితి
అందు పాండుభూవరునకు కోడలైతి,
జన వంద్యుల పొందితి,
నీతి విక్రమ స్థిరులగు పుత్రులన్ బడసితిన్
సహజన్ముల ప్రాపుగాంచితిన్
సరసిజనాభ! యిన్నిట ప్రశస్తికి
నెక్కినదాన నెంతయున్॥

ద్రుపద మహారాజు యజ్ఞవేదిక నుండి ప్రభవించాను. పాండురాజుగారి కోడలి నయాను; మహాయోధుల భార్యను, ధీమంతులూ, ధీరులూ అయిన బిడ్డలను కన్నాను. సోదరుల ఆదరాభిమానా లున్నాయి. ఇంతటిదాన్ని నన్ను వారేం చేశారయ్యా!

రాజసూయావభృథంబు నందు
శుచియై పెనుపొందిన "వేణి" పట్టి
ఈ యేవురు చూడగా సభకు నీడ్చె
కులాంగన నిట్లొనర్తురే॥

రాజసూయ యాగం పూర్తి అయ్యాక అవభృథ స్నానంతో పవిత్రమైన ఈ కేశపాశాన్ని

ఆ దుర్మార్గుడు తన పాడు చేతులతో అపవిత్రం చేశాడు, అయినా యింటి యిల్లాలిని యీ విధంగా చేసే వారుంటారా!

ఈ వెంట్రుకలు పట్టి యీడ్చిన
ఆ చేయి తొలుతగా పోరిలో
దుస్ససేను తను వింత లింతలు
తునియలై చెదరి రూపరియున్న
కని ఉడు కారుగాక -

దుష్ట దుశ్శాసనుని దేహం ముక్కలుముక్కలై చెల్లాచెదరుగా పడివున్నప్పుడు ఈ కళ్ళతో చూస్తే తప్ప నా గుండె మంట చల్లారదు.

గదాదండమూ, గాండీవమూ ధరించే భీమార్జునుల బాహుబలం అస్త్ర శక్తి దేనికయ్యా!

నన్ను అవమానించిన దుర్యోధనుని పీనుగు నా కంటబడాలి. అంతవరకూ శాంతి లేదు.

నా తెలివితక్కువ తనం కొద్దీ ఏమేమో మాట్లాడాను. మీరంతా పెద్దలు, లోకంలో పేరుప్రతిష్ఠ లున్నవారు. మీ మంచితనం పోకుండా జాగ్రత్తగా వ్యవహారం సాగించుకోండి; అంది.

అప్పుడు వాసుదేవుడు ఆమెను ఓదారుస్తూ :

యమ మహిష ఘంటికానాదము విన
కౌతూహలంబు తళుకొత్తెడు చిత్తము గల
కౌరవుల కిష్టములగునె సంధికార్యశాంత వచనముల్

సోదరీ, మృత్యుదేవత నెత్తి మీద తాండవిస్తున్నవారికి శాంతిసూక్తాలు చెవికెక్కవు, నీ బాధకు కారణభూతులైన కురువంశీయుల అంతఃపుర స్త్రీలందరూ ఇంతకంటె దారుణంగా రొమ్ములు బాదుకుంటూ కురుక్షేత్రంలో విలవిల విలపించే రోజు ఎంతో దూరం లేదు. నీ పరాభవానికి అదే ప్రతీకారం, అన్నాడు.

⁕ ⁕ ⁕

తెలతెలవారుతూండగా రథం బయలుదేరుతున్నది.

బయలుదేరుతున్న వేళ ధర్మరాజు వాసుదేవుని సమీపించి :

కృష్ణా! నువ్వు వచ్చానని వినగానే పరమసంతోషంతో, విన్ను చూడటానికి ఎదురు చూసేది మీ మేనత్త, మా అమ్మ కుంతీదేవి. ఆవిడ ఏ నాడూ సుఖపడ్డ క్షణం లేదు. అయిదుగురు కొడుకులు వున్నా, కన్నతల్లి కష్టసుఖాలు చూడలేని దశలో వున్నాం. పాలలో పడ్డ బల్లిలా వుంది ఆవిడ హస్తినాపురంలో, దాయాదుల కొంపలో.

ఇంక ఆ బాధలకు స్వస్తివాక్యం పలుకుతున్నాం; అని చెప్పు. మా అందరి వందనాలూ అందించు అన్నాడు.

ఇక్కడ ధర్మసూక్ష్మం –

పాండునందనులలో పెద్దవాడు ధర్మరాజు, పెద్దకొడుకు బాధ్యత ఏవిటో తరతరాలకు బోధించడానికే ఈ సన్నివేశం అందించాడు వ్యాసమహర్షి.

పితృ సమో జ్యేష్ఠః –

తండ్రి అనంతరం తల్లి బాధ్యత, తమ్ముళ్ళ అక్కచెల్లెళ్ళ కష్టసుఖాలు కనిపెట్టి చూడవలసిన వాడు పెద్దకొడుకు. ఈ కుటుంబజీవన ధర్మప్రబోధమే భారతం నిండా గోచరిస్తున్నది. ఇది చాలా సామాన్య విషయంగా కనిపించవచ్చు. కాని సామాన్య విషయాలనే పదే పదే గుర్తు చేసుకోవాలి. లేకపోతే మరచిపోతాం. అందువల్ల ఎన్ని అనర్థాలు వస్తాయో యీనాడు సంసారాలలో అనుభవిస్తున్నాం.

అందుకే భారతాన్ని నిరంతరం వినిపించాలి. వినాలి. వింటూ మనిషి మనిషిగా బ్రతకడానికి అవసరమయిన సూక్ష్మవిషయాలు తెలుసుకుంటూండాలి, వాటిని ఆచరించడానికి ప్రయత్నించాలి.

* * *

వాసుదేవుడు హస్తినాపురానికి రాయబారిగా వస్తున్నాడని విన్నాడు ధృతరాష్ట్రుడు; వచ్చే రాయబారికి జరుపవలసిన మర్యాదలు సత్కారాలు వివరిస్తూ :

దుర్యోధనా! వాసుదేవుని స్వాగత సత్కారాలు సముచితరీతిని నిర్వర్తించు. నగరంలోని భవనాలన్నీ రంగురంగుల తోరణాలతో, ముంగిళ్ళన్నీ రంగవల్లులతో అలంకరించాలి. పౌర, జానపదులందరూ ఆబాలగోపాలం చిరునవ్వులు చిందే ముఖాలతో రాజమార్గాని కిరువంకల బారులుతీరి నిలబడి స్వాగతం పలకాలి. ఆయన సంతోషిస్తే లోకాలన్నీ సంతోషిస్తాయి.

హస్తినాపురం రాగానే ఆయనను దుశ్శాసన మందిరంలో విడిది చేయించాలి. ఆ భవనం ఇంద్రభవనంలా అలంకరించండి –

అని అందరినీ ఆజ్ఞాపించి, మహామంత్రి విదురుని దగ్గరగా రమ్మని –

ధీమంతుడా! మణిరత్న సువర్ణభూషణాలతో, నవయౌవన శోభితలయిన నారీమణులను కూడా ఆయనకు కానుకగా యిస్తాను. అంతే కాదు; దుశ్శాసన మందిరంలో ఆయన విడిది చేసినప్పుడు ఆ మందిరంలోని ఏ వస్తువు ఆయన కనులకు ఇంపుగా కనుపిస్తే, ఆ వస్తువును ఆయనకు అర్పించాలి; అన్నాడు.

విదురుడు : మహారాజా! శ్రీకృష్ణుని అనుగ్రహం పొందడం కంటె కావలసింది లేదు. అయితే పాండవులయిదుగురికీ అయిదు గ్రామాలివ్వడానికి కూడా మీరు అంగీకరించలేదే! ఇప్పుడిన్ని సత్కారాలు తలపెట్టడంలో మీ అంతర్యం ఏమిటి?

"శౌరికి లంచమిచ్చి సంప్రీతుని జేసి

కార్యగతి భేదము జేయగ జూచెదు॥

ఇవన్నీ లంచంపెట్టి ఆయనను పాండవులకు వ్యతిరేకంగా మన పక్షానికి త్రిప్పుకుందామనుకుంటున్నావా! అది అసంభవం.

అర్జునుడంటే ఆయనకు ప్రాణం! కనక పాండవులకు మేలు చేస్తే ఆయన సంతోషిస్తాడు. అంతకు మించి ఆయనను తృప్తిపరిచే దారి లేదు.

దుర్యోధనుడు : మహామంత్రీ! మనం ఏం చేసినా ఆయన పాండవుల మీది అభిమానం వదలడు. ఇప్పుడు మనం ఏవో దానాలు చేస్తే భయపడి చేశామనే అపకీర్తి తప్ప ప్రయోజనం లేదు.

ఆయన వచ్చి పాండవులకు అర్ధరాజ్యం యిమ్మంటాడు; అది జరిగే వ్యవహారం కాదు. అంతకంటే వాసుదేవుని మనం యిక్కడ బంధించి పడేస్తే పాండవులు రెక్కలు విరిగిన పక్షులవలె పోతారు.

ఆ మాటలు విని ధృతరాష్ట్రుడు నెత్తి మొత్తుకొని! ఓరి పాపాత్ముడా! మనకాయన చేసిన కీడేమిటి? ఎందుకింత దారుణానికి దిగుతున్నావు; అని మందలించాడు.

అప్పుడు భీష్మపితామహుడు : ధృతరాష్ట్రా! విన్నావా నీ కొడుకు దుర్మార్గం! ఇటువంటి ఊహ కలిగిందంటే ఆ క్షణంలో వీరు మృత్యు ముఖంలో ప్రవేశించారనుకో. ఇటువంటి మాటలు వినడానికి కూడా నా మనస్సు అంగీకరించడం లేదు, అని సభ నుంచి వెళ్ళిపోయాడు.

* * *

వాసుదేవుడు హస్తినాపురం చేరి, సభాభవనంలో అడుగు పెట్టి కురువృద్ధులకూ, గురువృద్ధులకూ అభివాదాలు తెలిపి, మిగిలినవాకి యోగ క్షేమాలు విచారించి :

మహారాజా! ప్రయాణంలో బాగా అలసి వున్నాను. ఈ రాత్రికి విశ్రమించి ఉదయమే నేను వచ్చిన పని నిర్వర్తిస్తాను; అని విదురుని వెంట వాని మందిరానికి వెళ్ళి కొంతసేపు పాండవుల కుశల విషయాలు ప్రస్తావించి, కుంతీదేవి భవనానికి వెళ్ళాడు.

వచ్చిన మేనల్లుని చూచి కొంతసేపు దుఃఖించి : కృష్ణా! నా బిడ్డలకు రావలసిన కష్టాలా ఇవి? హాయిగా మంగళ గీతాలు వింటూ హంసతూలికాతల్పాల మీద శయనించవలసిన రాజపుత్రులు అరణ్యాలలో పెద్దపులుల గాండ్రింపులు వింటూ, బండరాళ్ళ మీద పడుకుంటున్నారు. పంచభక్ష్యాలతో ఆరగించవలసినవారు కందమూల ఫలాలతో కాలం గడుపుతున్నారు. ఇంతకంటె దురదృష్టం ఏముంది?

దీనికంతకూ మా బావగారూ, ఆయన పెద్దకొడుకూ, కారణమని వారిని

ఆడిపోసుకోవటం దేనికి? ఇట్టి క్రూరుల యింటికిచ్చిన మనవారి నందుగాక

వీరి మంచి చెడ్డలు తెలుసుకోకుండా ఆ యింటి కోడలుగా నన్ను పంపిన మన కన్నవారిని తిట్టుకోవాలి. తప్పు మనది. అని కొంతసేపు శోకించి :

సర్వైః పుత్రైః ప్రియతరా

ద్రౌపది యే జనార్ధన

నా బిడ్డలందరికంటె నాకు నా కోడలంటేనే మమకారం. అటువంటి కోడలిని నిండుసభలో పరాభవించిన దుర్మార్గులతో సంధి సంప్రదింపులకు వచ్చావా? ఎంత అవమానం యిది! జరిగిందేదో జరిగింది.

నువ్వు తిరిగి వెడుతూ, రాజమాత ఏ మహోద్దేశంతో సంతానాన్ని కంటుందో ఆ కార్యం నెరవేర్చే సమయం ఆసన్నమయిందని చెప్పు. అంతేకాదు ద్రౌపది ఎలా చెపితే అలా నడుచుకోమన్నానని చెప్పు. వెళ్ళిరా, అంది.

రాత్రి విదురుని యింట విశ్రమించి, మరునాడు ఉదయమే సభాభవనానికి సగౌరవంగా వచ్చాడు.

* * *

వాసుదేవుని సందేశం వినాలనే కుతూహలంతో వచ్చిన కణ్వ, పరశురామ, నారదాది మునీంద్రులకు అతిథి సత్కారలను నడిపి, ఉన్నతాసనాలు చూపించాడు భీష్మపితామహుడు.

సదస్యులందరి దృష్టులూ కృష్ణుని మీద కేంద్రీకృతమై వున్నాయి. నిశ్శబ్ద వాతావరణాన్ని చీలుస్తూ మేఘ గంభీర స్వరంతో పరాత్పరుడు శ్రీకృష్ణుడు :

మహారాజా! ఈనాటివరకూ సాగిన గాథలూ, జరిగిన మోసాలూ, చేసిన అన్యాయాలూ నీకు తెలియనివి కావు. కాకపోయినా మీ ఉభయ వంశాల హితవు కోరి చెప్పవలసిన మాటలు వినిపించడానికి వచ్చాను.

ప్రపంచంలో మీ భరత వంశం న్యాయబద్ధమూ, సత్యధర్మ సంయుతమూ అయిన దారిని నడుస్తూ అందరి మన్ననలూ పొందుతున్నది. ఆ కీర్తిని కాపాడుకోవడం మీ విధి. వారూ, మీరూ, క్షీర నీర న్యాయంగా కలసి మెలసి ఉండాలని అందరూ కోరుతున్నారు. నీవు కూడా ఈ ఉభయులనూ సమాన దృష్టితో చూడటం అవసరం. నీ బిడ్డలు ధర్మమార్గం విడిచి, ముందు వెనుకలు చూడకుండా తమ పినతండ్రి బిడ్డలపై చెయ్యని అత్యాచారం లేదు. అయినా పాండవులు అన్నీ విస్మరించి స్నేహం వాంఛిస్తున్నారు.

వారు శాంతిని కోరుతున్నారు. వారే కాదు వివేకం కలవారెవరయినా శాంతినే వాంఛిస్తారు. అలాకాక యుద్ధమే సిద్ధమంటారా! దానివల్ల సర్వనాశనం తప్పదు. నీ సంకల్పానికి తిరుగులేదు. తలచుకుంటే శాంతి సాధించగలవు. నీ బిడ్డలను నువ్వు సక్రమంగా

నడుపు. పాండవులను నేను నడుపుతాను. అప్పుడు యుద్ధం వుండదు. అందరూ సుఖంగా వుంటారు.

చిన్ననాడే నీ తమ్ముడు పాండురాజు దివంగతుడైతే, వాని బిడ్డలను తండ్రిలా పెంచి పెద్దచేశావు. ఇప్పుడు వారిని విడిచి పెట్టడం న్యాయం కాదు. వారు నేటికీ నిన్ను అదే గౌరవంతో చూస్తూ తమ రాజ్యం తమకిమ్మన్నారు.

ఈ సభాసదులందరికీ ఒక్క మాట చెప్పమన్నారు :

సారపు ధర్మమున్ విమలసత్యము
పాపముచేత బొంకుచే పారము పొందలేక
చెడబారినదైన అవస్థ
దక్షులెవ్వారలుపేక్షచేసిరది
వారల చేటగు కాని ధర్మనిస్తారకమయ్యు
సత్య శుభదాయకమయ్యును దైవముండెడిన్॥

ధర్మం మీద అధర్మం, సత్యం మీద అసత్యం దాడిచేసి అణగద్రొక్కుతూంటే చూస్తూ వూరుకునేవారు కూడా ఆ పాపఫలం అనుభవించక తప్పదు. సత్యధర్మాలను రక్షించి నిలబెట్టడానికి దైవం ఎప్పుడూ చూస్తూనే వుంటుంది, అని చెప్పమన్నారు.

మరొక్కమాట మహారాజా!

వారలు శాంతిశూరులు
భవచ్చరణంబులు గొల్వ బూనికప్రియమేని
ఇంతకుం పోరికి వచ్చుచుందు మీరు భూవరా!
రెండు తెరంగులందు నీ కారమ
పథ్యమేది యగు అవ్విధ మేర్పడ నిశ్చయింపుమా!॥

ధర్మరాజాదులు ఎంత శూరులో అంత శాంతిస్వభావులు. కనకనే యిన్ని అన్యాయాలు జరిగినా నిన్ను సేవించడానికే కుతూహలపడుతున్నారు. అది కుదరదంటావా! ఆయుధాలతో సంగ్రామానికి సన్నద్ధులయారు. ఈ రెండు దారులలో ఏది నీకు కావాలో చెప్పు.

శ్రీ కృష్ణుని సందేశం విన్న అనంతరం కణ్వ, పరశురామ, నారదులు దుర్యోధనుని మందలిస్తూ ఉపాఖ్యానాలు వినిపించి ధర్మబోధ చేశారు.

భీష్మ ద్రోణులు కూడా హితవు చెప్పారు. అయినా దురాగ్రహం, దురభిమానం మూర్తీభవించిన దుర్యోధనుని చెవి కెక్కలేదు.

జానామి ధర్మం న చ మే ప్రవృత్తిః
జానా మ్యధర్మం న చ మే నివృత్తిః

మునులారా! నన్ను విధి ఏమని పుట్టించె అట్టులయ్యెడుగాక. ఈ విన చవిగాని పలుకులకు పని గలదే ఉడుగుడింక బహు భూషణముల్.

"ధర్మం నాకు తెలుసు. కాని నా మనస్సు ధర్మమార్గాన నడవదు. అధర్మం అని తెలిసినా దాన్ని విడిచి పెట్టలేను. అదీకాక నేను పుట్టినవాడు బ్రహ్మ నా నుదుట రాసినట్లు నడవక తప్పదు. ఎందుకు మీరంతా వృధాగా మాట్లాడుతారు.

కృష్ణా! గురువులూ, ద్రోణాచార్యులూ, తాత భీష్ముడూ, మా తండ్రి నిరంతరం నన్ను నిందిస్తూనే వున్నారు. వారితో పాటు నువ్వు కూడా నేనే ద్రోహం చేశాననీ, అన్యాయం చేశాననీ అంటున్నావే!

ఏవిటి నేను చేసిన ద్రోహం?

ధర్మరాజు జూదరి, ఆ వ్యసనంతో సర్వం కోల్పోతే అది నేను చేసిన అన్యాయమా?

ఈనాడు వారు వారి మామగారినీ, వియ్యంకునీ, యితర మిత్ర రాజులను కూడగట్టుకుని కయ్యానికి కాలు దువ్వుతుంటే చేతులు ముడుచుకు కూర్చోమంటావా?

రణరంగంలో దిగాక దేవేంద్రుడు వచ్చినా తల వంచేది లేదు. విజయమో, వీరస్వర్గమో తప్ప మార్గాంతరం లేదు.

అసలు విషయానికి వస్తే, "చిన్నతనంలో మా తాతగారూ, నాన్నగారూ, ఈ రాజ్యాన్ని పంచిపెట్టారు. ఇప్పుడు మళ్ళీ, ఆ పొరపాటు జరగనివ్వను.

పాండవులు ఆనాడు రాజభోగాలు బాగా రుచి మరిగి, యిప్పుడు మళ్ళీ ఆశపడుతుంటే ధారపోయడానికి సిద్ధంగా లేను. వాడి సూది మొన మోపిన నేల కూడా విడిచిపెట్టను. వారికి వీరత్వం ఉంటే సంగ్రామానికి వచ్చి తేల్చుకోమను" దుర్యోధనుని మాటలు వింటున్న పుండరీకాక్షుని కన్నులలో అరుణరేఖలు ప్రసరించాయి.

దుర్యోధనా! నీ కోరిక ఎందుకు కాదనాలి. నిశ్చింతగా సంగ్రామంలోనే నేలవ్రాలుదువు కాని, అప్పుడు నీ చుట్టూ వుండే వీరందరూ ఏం చేస్తారో చూద్దాం.

నువ్వు చేసిన ద్రోహం ఏమీ లేదని కాదూ అంటున్నావు : నువ్వు చెయ్యని అన్యాయం, అక్రమం ఉన్నదా! చిన్ననాడే విషం కలిపిన అన్నం పెట్టావు. త్రాచుపాములచేత కరిపించావు. నదిలో త్రోయించావు. లక్క యింట్లో పెట్టి నిప్పు ముట్టించావు. ఇన్ని చేసినా వారి ధర్మబుద్ధి వారిని రక్షించింది. వారి భోగభాగ్యాలూ, సిరిసంపదలూ చూచి ఓర్వలేక మాయాజూదం ఆడించి సర్వనాశనం చేశావు. అక్కడికీ నీ మనసు చల్లబడలేదు. నీ పినతండ్రి యింటి పెద్దకోడల్ని జుట్టుపట్టి సభా భవన మధ్యంలో నిలబెట్టి వస్త్రాపహరణం చేయించడానికి ప్రయత్నించావు.

లోకంలో యింత దారుణం జరిగినట్టు వినలేదు. కనలేదు.

ఇంతవరకూ యింతటి అక్రమాలు సాగించిన వారున్నారని విన్నావా! ఇన్ని చేసి వూరుకున్నావా! ఆ సభలో నీ ప్రాణమిత్రుడు కర్ణుడూ, నువ్వూ ఆడిన మాటలు వినలేక యీ పెద్దలందరూ కళ్ళు మూసుకు తలలు వంచుకు కూర్చున్నారే!

ఇంత చేసినా సహించి ధర్మబద్ధంగా నీ సోదరులు శాంతినే కోరుతున్నా నీ బుద్ధి మారడం లేదు.

చివరగా ఒక్కమాట విను –

సంధి చేసుకుంటే అది వారికే కాదు మీకూ శ్రేయస్కరమే. ఈ విషయాన్ని విస్మరించకుండా నీ నిశ్చయం చెప్పు,

అంటుండగానే దుర్యోధనుడు తల విసురుతూ సభనుంచి వెళ్ళిపోయాడు. వాని వెంట దుశ్శాసన, కర్ణ, శకుని ప్రభృతులతో మిత్రరాజులందరూ అనుసరించారు.

అది చూసి భీష్ముడు :

ఔరా! ఇందరు పెద్దలు ఆసీనులై వున్న సభనుండి దురహంకారంతో వెళ్ళిపోయాడు; వాని ఆప్తులూ వెళ్లారు. ఏ దురుద్దేశంతో పోయారో, వీరందరికీ కాలం మూడినట్లుంది, అన విని వాసుదేవుడు :

పితామహా! వీరందరినీ హింసించడం యిష్టంలేక యింతసేపు శాంతంగా మాట్లాడుతుంటే వీడెంతకు తెగించాడు! అయినా వంశ రక్షణకోసం ఒక్క దుష్టుని విడిచిపెట్టలేరా! అంతతో యిందరూ సుఖంగా పదికాలాలు బ్రతుకుతారు.

శరీరంలో ఒక అవయవం రోగగ్రస్తమైతే దాన్ని ఖండించి, మిగిలిన శరీరాన్ని కాపాడే వైద్యునివలె – మా మేనమామ కంసుడు అధర్మంగా ప్రవర్తిస్తుంటే వానిని యమపురికి పంపి మిగిలిన వారందరికీ సుఖశాంతులు ప్రసాదించాను. అలానే ఈ దుర్మార్గుని కూడా విసర్జించి వంశాన్ని రక్షించుకోండి. ఇంతకంటె మార్గాంతరం లేదు; అంటుంటే ధృతరాష్ట్రుడు:

మహామంత్రీ : ధీమంతురాలయిన పట్టమహిషిని తీసుకురా, ఆవిడ చెపితే వీడి బుద్ధి మారుతుందేమో? అన్నాడు.

విదురుడు వెళ్ళి సగౌరవంగా గాంధారిని తీసుకువచ్చి ఉచితాసనం మీద కూర్చోబెట్టాడు.

ధృతరాష్ట్రుడు : మహారాణీ! నీ పెద్దకొడుకు పరమ మూర్ఖత్వంతో యిందరు పెద్దలు చెప్పే మాటలు వినకుండా తలబిరుసుతో వున్నాడు. వానిని దారిలో పెట్టుకో.

గాంధారి : మహారాజా! వాడు అన్యాయాలకు దిగాడనీ, మూర్ఖంగా వున్నాడనీ యిప్పుడు తెలిసిందా! ఇన్నాళ్ళూ వాడి ఇష్టం వచ్చినట్టు వదిలావు. ఇప్పటికయినా నువ్వు ఏం చెయ్యదలచుకున్నా అడ్డుకునే వారెవరు!

నీ పుత్రు డవినీతు డగుట
ఎరిగి ఎరిగి వాని వశంబున
ఏల పోయె దీవు పాండవులను
ఏమి యిచ్చితేని అడ్డపడ నెవ్వరికి వచ్చు?

అయినా తల్లిని గనక చెపుతాను, రమ్మనండి వాణ్ణి. అనగానే విదురుడు వెళ్ళి దుర్యోధనుని పిలుచుకు వచ్చాడు.

వచ్చిన దుర్యోధనుని చూసి :

ఓరిమూర్ఖుడా, క్రూరకర్ముడా! ఇందరు పెద్దలు, వంశ వృద్ధులు నీ శ్రేయస్సు కోరి చెప్పే మాటలు చెవి కెక్కడంలేదు. దుర్మంత్రులతో చేరి సర్వనాశనం చేసుకోకు.

శత్రువుబలం తెలసి, నీ శక్తి తెలిసి ప్రవర్తించు. ఒక్క మాట విను.

సింహాసనం కోరేవానికి రెండు ప్రధాన గుణా లుండాలి. అందులో మొదటిది రాజ్యరక్షణ విషయంలో అప్రమత్తత.

రెండవది సిరి సంపదలనూ, భోగ భాగ్యాలనూ బంధుమిత్ర పరివారంతో సుఖంగా అనుభవించడం.

నీకు అనుభవించడం బాగా తెలుసు, రక్షణ విషయం తెలియదు.

వారికి రక్షణ బాగా తెలుసుకనక అర్ధరాజ్యం వారికిస్తే నిస్సందేహంగా బాంధవ్యం మనసులో వుంచుకుని మన రాజ్య రక్షణ భారం కూడా వారే నిర్వహిస్తారు, అని రాజనీతిని సూక్ష్మంగా వివరించి చెప్పినా వినిపించుకోకుండా దుర్యోధనుడు సభ విడిచిపోయి, కర్ణ శకుని దుశ్శాసనులతో సంప్రదించి, కృష్ణుని బంధించడానికి సభలోకి వస్తుండడం గమనించి, సాత్యకి వారి దుర్మార్గం వాసుదేవునికి విశదం చెయ్యగా, కృష్ణుడు :

మామా, మాటలతో పని పూర్తిచేసుకుందామనుకుంటే, మీ వాడు చేతలకు దిగుతున్నాడు. అది నాకు తెలియని విద్యకాదు. ఇప్పుడే పూర్తి చేయగలను. కాని, భీమసేనుడు దుర్యోధన, దుశ్శాసనులను సంహరిస్తానని ప్రతిజ్ఞ చేశాడు. ఆ యోధుని మాట వ్యర్థం కాకూడదు కనక వీరికి మరి కొంతకాలం ఆయుర్దాయం అనుగ్రహిస్తున్నాను.

ఇవి కూడా గాలిమాటలనీ, నేను నిస్సహాయుడననీ నీ కొడుకు భావిస్తున్నట్టున్నాడు. ఒక్కసారి నే నెవరినో చూడు దుర్యోధనా! అంటూ విశ్వరూపం ప్రదర్శించాడు.

ఆ విశ్వరూపాన్ని దర్శించే శక్తిలేక సదస్సులందరూ భయంతో కన్నులు మూసుకోగా, వాసుదేవుడు అక్కడవున్న మునీంద్రులతో, భీష్మ, విదుర, ద్రోణ, సంజయులకు తన దివ్య రూపదర్శన శక్తి అనుగ్రహించాడు. ధృతరాష్ట్రుడు కూడా ప్రార్థించగా వానికీ దృష్టి ప్రసాదించాడు.

విశ్వరూపాన్ని దర్శించి తన్మయుడై ధృతరాష్ట్రుడు : కృష్ణా! ఇంక ఈ దృష్టి తొలగించు. నీ దివ్య మోహనరూపం దర్శించిన కన్నులతో ఈ పాడు లోకాన్ని చూడలేను, అన్నాడు.

వాసుదేవుడు సభాభవనం విడిచి, రథారూఢుడై, కుంతీ దేవిని దర్శించి, అత్తా! అనుకున్నంతా అయింది. నిశ్చింతగా వుండు. కొద్ది రోజులలో నీ బిడ్డలు రాజభోగాలు అనుభవించబోతున్నారు. రాజమాతగా నువ్వు సుఖశాంతులతో వుంటావు, అని తిరుగుముఖం పట్టి, వీడ్కో లివ్వవచ్చిన అందరిదగ్గరా సెలవు తీసుకుని –

కర్ణా! నన్ను నగరం పొలిమేరవరకూ సాగనంపి వద్దువుగాని రా, అని వెంటబెట్టుకుని నదీతీరాన, ఒక చెట్టునీడకు రథం ఆపి దిగి –

కర్ణా! పరమరహస్యం చెపుదామని పిలిచా!

ధర్మం మార్గం తెలిసి పెద్దల సేవచేసే జ్ఞానివి, నీకు మరొకరు చెప్పవలసినది లేదు.

అయినా సందర్భం వచ్చింది కనక చెప్పాలి. ఈనాటివరకూ నిన్ను పెంచి పెద్దచేసిన వారి బిడ్డవుకావు నువ్వు, చిన్నతనంలోనే సూర్యుని అనుగ్రహంవల్ల నిన్ను కుంతీదేవి కన్నది. అంటే నువ్వు ధర్మరాజుకంటె పెద్దవాడివి, అంటూంటే కర్ణుడు :

కృష్ణా! ఇంతకాలం గుట్టుగావున్న ఈ రహస్యం ఇప్పుడు బైటపెట్టడం దేనికి. దీనివల్ల ఎవరికి కీర్తి.

కర్ణా! ఎంత అమాయకంగా అడుగుతున్నావయ్యా. నిన్ను వెంటబెట్టుకు వెళ్ళి పాండవులతో నేను చెపుతా నీ విషయం. మీ తల్లి కుంతీదేవి చేత చెప్పిస్తాను. ఆ క్షణంలో పాండవు లయిదుగురూ నిన్ను అన్నగారిగా సేవిస్తారు. ఈ రాజ్యలక్ష్మి అంతా నీ వశమౌతుంది. రక్తపాతం లేకుండా రాజ్యలక్ష్మి లభిస్తుంది.

మరొక్కమాట – అలనాడు ద్రౌపదీ స్వయంవర సమయంలో నువ్వు కూడా మనసుపడ్డావు. ఇప్పటికీ నీకు ఆమె మీద మనసువుంటే నిన్ను ఆరవ భర్తగా స్వీకరిస్తుంది. ఆలోచించుకో. కౌరవ రాజ్యలక్ష్మి, పాంచాల రాజపుత్రి అనాయాసంగా నీకు లభిస్తాయి, అన్నాడు.

వాసుదేవా! కుంతీదేవి నన్ను కని గంగలో విడిచిందని వారూ వారూ గుసగుసలాడు కుంటుంటే నేనూ విన్నాను. అయితే నేను దొరికింది మొదలు నన్ను తన పొత్తిళ్ళలో పెంచి, నా మల మూత్రాలు ఎత్తి, పెంచి పెద్దచేసి, పెళ్ళిజరిపి ఈనాడు నాకు కలిగిన బిడ్డలను తన మనుమలుగా అనురాగంతో పెంచుకుంటున్న ఇల్లాలు రాధ; అంత సేవచేసి వాత్సల్యంతో పెంచిన వారికి ఈ వార్ధక్యంలో యధాశక్తి సేవ చెయ్యాలి కాని రాజ్య వ్యామోహంతో వారిని కాలదన్ని రమ్మంటావా!

నేను ధర్మం తెలిసినవాడిననీ, వృద్ధులను సేవించి జ్ఞానం పొందినవాడిననీ నువ్వే

అన్నావు. అటువంటి నేను పెంచిన తల్లిదండ్రులను ఈ ముసలితనంలో విడిచి రావడం ధర్మమా!

అదీకాక –

నే నెవరినో, నా శక్తి సామర్థ్యాలు ఎంతటివో తెలియకుండానే నన్ను గాఢాలింగనం చేసుకుని దుర్యోధనుడు అంగరాజ్యానికి నన్ను అభిషిక్తుచేసి, తనతో సమంగా చూసుకుంటున్నాడే. అటువంటి ప్రభువు, ఆప్తమిత్రుడు – నన్ను నమ్మి–యుద్ధ సన్నాహాలు సాగిస్తుంటే వానిని విడిచి స్వామిద్రోహం, మిత్రద్రోహం తలకెత్తుకోమంటావా!

ఇంకోమాట –

అలనాడు జూదంలో ఓడిన పాండవులను పరిహసిస్తూ దుశ్శాసనుడు చేసిన దురాగతానికి ప్రతీకారంగా వాని రొమ్ము చీల్చి రక్తం త్రాగుతానని భీమసేనుడు ప్రతిజ్ఞ చేశాడు; అలానే ద్రౌపదికి తొడ చూపించిన దుర్యోధనుని తొడలు విరగకొడతాననీ శపథం చేశాడు;

కురువృద్ధుల్ గురువృద్ధ బాంధవు లనేకుల్
చూచు చుండన్ మదోద్ధరుడై
ద్రౌపది నిట్లుచేసిన ఖలున్ దుశ్శాసనున్
లోక భీకర లీలన్ వధియించి
తద్విపుల వక్షశ్శైల రక్తౌఘ నిర్ఝర
ముర్వీపతి చూచుచుండ 'అని' నాస్వాదింతు నుగ్రాకృతిన్॥

* * *

ధారుణి రాజ్యసంపద మదంబున
కోమలి కృష్ణ జూచి రంభోరు నిజోరు దేశమున
నుండగ బిల్చిన యద్దురాత్ము మదీయ దుర్వార
బాహు పరివర్తిత చండ గదాభిఘాత
భగ్నోరు తరోరు జేయుదు సుయోధను
భావి రణాంగణమ్మునన్॥

* * *

కృష్ణా! నా మీద అభిమానంతో హితోపదేశం చేశావు, కాని అది నా మనసు కెక్కడంలేదు. ఒక్కమాటయివ్వు; నేను కుంతీసుతుడననే రహస్యాన్ని యుద్ధం పూర్తి అయేవరకు బైటపడనివ్వకు. నేను తన అన్నగారినని తెలిసిన క్షణంలో ధర్మరాజు నా పాదాలమీద పడి సామ్రాజ్యం నాకు ధారపోస్తాడు. రాజ్యాన్ని ధర్మరాజే పాలించాలి. మరొకరూ మరొకరూ పనికిరారు.

నువ్వు అధ్వర్యుడవై ధర్మరాజుచేత సాగించే రణయజ్ఞంలో మేమందరం పశువులం అవుతాం.

సంగ్రామ యజ్ఞాంతంలో ధర్మరాజు విజయఫలం పొందుతాడు, ఈ సంగతి నాకు తెలుసు.

ఈ కలహానికి మూలం నేనూ, శకునీ, దుశ్శాసనుడూ; వారిరువురూ పాండవపక్షానికి వస్తే నేనూ రాగలను.

ధర్మరాజే రాజ్యం ఏలాలని ఎందుకంటున్నానో తెలుసా!

ఈ రాజ్యం నాకు దక్కితే నేను దీనిని దుర్యోధనునికి ధారవోస్తాను. నా కృతజ్ఞత చూపడానికి; దుర్యోధనుడు సింహాసనం ఎక్కడానికి వీలులేదు.

ఎందుకంటావా!

పినతండ్రి కోడలిని నిండు సభలో నిలబెట్టి పరాభవించిన దుర్మార్గుడు సింహాసనంమీద ఉంటే యింక దేశంలో ఆడుజాతికి రక్షణ వున్నదా కృష్ణా! అందుకే యింతగా చెపుతున్నాను.

మరి అంతటి దుర్మార్గులతో యింతకాలం కలిసి, వారు ఆడేఆటలకు వంతపాటలు పాడినమాట వాస్తవం.

దానికి కారణం, వారు నాకు చేసిన ఉపకారం; నన్ను అంగరాజును చేసి రాజభోగాలు సమకూర్చిన వారికి ఈ జీవితాన్ని అంకితం చెయ్యక తప్పదు. అది మానవత్వ లక్షణం; అయితే పాండవులనూ, ద్రౌపదినీ అవహేళన చేసి, పరుషభాషలతో హింసించడానికి కారణం దుర్యోధనాదులకు తృప్తి కలిగించడమే. ఆ పాప కర్మలు చేసింది మొదలు పశ్చాత్తాపంతో నా గుండె ఉడికిపోతూనే ఉంది. ఆ బాధతో రాత్రులు నిద్రపట్టడం లేదు. ఎంత త్వరగా ప్రాణాలు పోతాయా అని ఎదురుచూస్తున్నాను.

య ద్య బ్రుత మహం కృష్ణ
కటు కానిస్మ పాండవాన్
ప్రియార్థం ధార్త రాష్ట్రస్య
తేన తప్పే హ్య కర్మణా॥

ఇంక నాకేమీ చెప్పకు. పోనియ్యి రథాన్ని, అన్నాడు.

కర్ణా! నా మాట నీ చెవి కెక్కకపోతే, వెళ్ళి మీ మహారాజుతో చెప్పు. శరత్కాలం వెళ్ళి హేమంతం వస్తున్నది. యుద్ధానికి తగిన కాలం అది.

ఎండవేడీ ఉండదు. చలీ ముదరదు. పశువులకు కావలసినంత గ్రాసం దొరుకుతుంది. చెట్లనిండా పళ్ళు, ఆహారధాన్యాలు సమృద్ధిగా ఉన్నాయి. వారం రోజులలో అమావాస్య రానున్నది. యుద్ధాని కది మంచిరోజు; నాడే కురుక్షేత్రంలో రణభేరీ మ్రోగుతుందని మీ వారందరికీ చెప్పు. ఇంక వెళ్ళిరా, అని రథాన్ని ముందుకు సాగించాడు.

కర్ణుడు తన రథంమీద హస్తినాపురం వైపు వెళ్ళాడు.

✳ ✳ ✳

ఇక్కడితో రాయబార ఘట్టం ముగిసింది.

ముందుకు నడవబోయే ముందు యిక్కడ నిలబడి ఈ సన్నివేశంలో మానవ హృదయాన్నీ, మనస్సులోని ఆలోచనల అంతర్యాన్నీ మహర్షి వ్యాసుడు ఎలా నిక్షేపించినదీ చూద్దాం.

రాయబారానికి వచ్చిన కృష్ణుడు ఆ పూట మహామంత్రి విదురునితో, రాజమాత కుంతీదేవితో సంభాషించి కాని రాయబార సందేశం వినిపించలేదు.

అంటే హస్తినాపురంలో ప్రజాభిప్రాయం ఎలా వున్నదీ ముందు గ్రహించాలి. పాండవులమీద అక్కడి వారి అభిమాన అనురాగాలు ఈ పదమూడేళ్ళలో ఎలా వున్నాయో తెలుసుకోకుండా వెడితే వ్యవహారం వికటించవచ్చు.

కుంతీదేవి కృష్ణుని చూస్తూనే గోలు గోలున విలపిస్తుంది. పదమూడేళ్ళుగా దాయాదుల యింట పడివున్నా ఒక్కరూ కూడా తన పుట్టింటి నుంచి వచ్చి చూచినవారు లేరు. ఆ కోపంతోనే ఆవిడ –

వారినీ వీరినీ అనడం దేనికి, ఈ కొంపలో నన్ను పడేసిన పుట్టింటివారిని తిట్టుకుంటున్నాను, అంది.

ఆనాడు కుంతీదేవి ఆడిన మాటలే ఈనాడు ఏ యిల్లాలయినా అంటుంది. ఆవిడ కిష్టం లేని పని జరుగుతున్నా, కావలసినది సమకూరకపోయినా –

మా అమ్మకూ, నాన్నకూ బుద్ధిలేక నా గొంతు కోసి యీ కొంపలో పడేశారు, అని తిట్టుకుంటుంది. అది స్త్రీ ప్రకృతి.

అంతవరకూ ఆవిడ కూడా సామాన్య స్త్రీయే. కాని ఆవిడ పాండురాజు భార్య, మహాయోధులయిన పాండవులను కన్న రాజమాత.

రాజమాతగా చెప్పవలసిన మాటలూ చెప్పింది. అన్యాయాలకు ప్రతీకారం జరపకుండా శాంతిసూక్తులు వల్లించడం రాజలక్షణం కాదు, అని.

✳ ✳ ✳

ఈ ప్రకరణంలో ప్రధానమయింది కర్ణుని పాత్ర –

సామ్రాజ్యం, సౌందర్యరాశి ద్రౌపది అవలీలగా అందుతున్నా లక్ష్యపెట్టకుండా పెంచి పెద్దచేసిన తల్లిదండ్రుల కోసం, వృద్ధిలోకి తెచ్చిన స్నేహితుల కోసం, తన వీరసమాజం కోసం ప్రాణాలు వదలడానికి సిద్ధపడ్డాడు.

అంతేకాదు దుర్యోధనాదులు దుర్మార్గులని తెలిసినా వారివల్ల తన జీవితం సుఖంగా

సాగుతున్నందున వారి పాపాలకు వంత పాడుతున్నాడే కాని లోలోపల ఈ దుర్మార్గులమీద మమకారం లేదు. అయినా ఎందుకు తిరగబడలేదు కర్ణుడు?

మానవత్వానికి ప్రధాన లక్షణమైన కృతజ్ఞత కర్ణుని అంతరాంతరాలలో పీట పెట్టుకు కూర్చున్నది. అందువల్లనే అన్నిటినీ వదిలి యుద్ధంలో ప్రాణాలు కోల్పోయాడు. అదీ కర్ణుని వ్యక్తిత్వం. అంతేకాదు కర్ణుని వంటి మహామహులను దుర్యోధనుని వంటివారు ఏవేవో సత్కారాలతో లొంగదీసుకుని వారిని జీవితాంతం తమకు దాసులుగా వుంచుకుంటారు.

మహాభారతం నాడే కాదు, ఈ నాటి భారతదేశంలో కూడా దుర్యోధనునివంటి దుష్టసంపన్నులు కర్ణుని వంటి మేథావులనూ, శూరులనూ చేరదీసి ఎన్ని అకార్యాలు చేయిస్తున్నారో చూస్తే 'భారతం' ఈనాటికీ సజీవంగా ఎందుకు వున్నదో బోధపడుతుంది.

సంగ్రామం

కురుక్షేత్రంలో ఉభయ సేనలూ మోహరించాయి, రణభేరీభాంకారాలు, గజఘీంకారాలు, అశ్వాహౌషారవాలు, సైనికుల సింహనాదాలు, శంఖధ్వానాలు .... భూనభోంతరాలు దద్దరిల్లుతున్నాయి.

అప్పుడు అర్జునుడు : బావా! ఒక్కసారి మన రథాన్ని ఉభయ సేనా మధ్యానికి నడిపించు, అందులో ఎవరెవరున్నారో చూస్తాను.

అనగానే వాసుదేవుడు రథాన్ని ముందుకు నడిపాడు.

చూశాడు అర్జునుడు.

ఎదురుగా పితామహుడు, ధనురాచార్యులు, మేనమావలు, బావలు, సోదరులు, స్నేహితులు. అందరూ ఆప్తులే, ఆత్మీయులే; చూస్తూనే అర్జునుడు :

బావా! రథాన్ని వెనక్కు త్రిప్పెయ్యి; యుద్ధం నేను చెయ్యలేను. కళ్ళు తిరుగుతున్నాయి. నాలుక ఎండిపోతున్నది, అవయవాలు స్వాధీనం తప్పుతున్నాయి, గాండీవం చెయ్యి జారిపోతున్నది, అన విని –

వాసుదేవుడు నవ్వు రాజిల్లెడు మోముతో – అర్జునా! ఇంతలో ఏమయింది! వీరందరినీ ఒక్క రోజులో సంహరిస్తానని రథారూఢుడవై వచ్చావే, అని ప్రశ్నించాడు.

అర్జునుడు : బావా! ఇప్పుడు నే నెవరిని చంపాలయ్యా ! మా కింకా జ్ఞానం రాని రోజులలో కన్నతండ్రి మరణిస్తే మమ్మల్ని చేరదీసి తొడమీద కూర్చోబెట్టుకుని వెన్ను దువ్వి, వెన్నముద్దలు తినిపించి, విద్యాబుద్ధులు నేర్పించి మమ్ము యింతటి ధీరులుగా, ధీమంతులుగా దిద్దితీర్చిన తాతగారు – భీష్ములవారినా చంపవలసింది.

చూడవయ్యా, ఆయన ప్రక్కనే బ్రహ్మతేజస్సుతో వెలుగుతున్న అచార్యులవారు –

కన్న కొడుకుకి కూడా అస్త్రవిద్యారహస్యాలన్నీ నేర్పకుండా అన్ని విద్యలూ నాకు నేర్పి ఈనాడు నా అంతటివాడు ధనుర్విద్యలో లేడనేకీర్తి ప్రపంచంలో సమకూర్చిన గురువుగారు - ద్రోణాచార్యులవారు; అయన నేర్పిన విద్యకు ఆయననే బలి తీసుకోవడమా మే మిచ్చే గురుదక్షిణ!

ఆ ప్రక్కగా కనిపిస్తున్నారా!

ధనుర్విద్యలో ఓనమాలు నేర్పిన మహనీయుడు కృపాచార్యుడు; ఏ పాపం చేశాడని యమసదనం చేర్చమంటావు, ఆయనను.

ఆ ప్రక్కగా మా పిన్ని మాద్రికి సోదరుడు, మా నకుల సహదేవుల మేనమామ శల్యుడు, వానికి కొంచెం దూరంలో మా దుర్యోధనాదుల మేనమామ శకుని, వాడు ఎంత కుటిలుడైనా మా పెద్దమ్మ గాంధారికి సోదరుడయ్యా.

ఇంకా నిదానించి చూడు, మా భీష్మపితామహులకంటె పెద్దవాడు, కురువంశవృద్ధుడు బాహ్లికుడు.

వీరందరూ ఒక ఎత్తు. సేనలో కొంచెం వెనుకగా రథం మీద కేరింతాలు కొడుతున్నాడే, ఎవడు వాడు? కోరమీసం ఎగదువ్వుతున్నవాడు.....

మా నూట అయిదుగురు అన్నదమ్ములకూ ఒకే ఒక్క తోబుట్టువు - దుస్సల. దాని భర్త సైంధవుడు; వాణ్ణి నరికేయాలి.

ఏం జరుగుతుందయ్యా అప్పుడు!

ఈ ఇంట్లో తోరణం కట్టి. గడపకు పసుపురాసి శుభకార్యానికి నలుగురు ఆడవాళ్ళను పిలిస్తే వారి కాలికి పసుపు పారాణి రాసి నుదుట కుంకుమ పెట్టి వాయనం అందించవలసిన ఆడబిడ్డ నుదుట పసుపు కుంకుమలు చెరిపెయ్య మంటావా?

చెయ్యలేను బావా, ఈ దారుణానికి నా మనస్సు అంగీకరించడం లేదు, త్వరగా రథాన్ని వెనుకకు మళ్ళించు.

అరణ్యాలలో పర్ణశాల వేసుకుని కందమూలాలు తింటూ బ్రతుకుతాం, నిశ్చింతగా.

తినజాలను నెత్తురు కూడు మాధవా!

అని జారిపోతూన్న అర్జునుని వెన్నుతట్టి -

అశోచ్యా నన్వశోచ స్త్వం
ప్రజ్ఞా వాదాంశ్చ భాషసే... ....

బావా! ఏమిటంటున్నావు! వీరందరూ నీకు రక్తబంధువులా, గురువులా, స్నేహితులా! నేనెరుగని విషయాలు చాలా చెపుతున్నావు. ఆపు నీ ఉపన్యాసం.

నిజంగా వీరందరూ నీకు ఆప్తులూ, ఆత్మీయులూ అయితే ఆనాడు సభాభవనంలో

పాంచాల రాజనందన పరాభవం పొందుతూంటే ఒక్కరయినా నోరు విప్పి ఈ దుర్మార్గులను మందలించి ఆ అకార్యాన్ని ఆపగలిగారా!

అంత అవమానం చేసినవారూ, చేయించినవారూ చేస్తుంటే చూస్తూ వూరుకున్న ఈ దుర్మార్గుల కోసమా ఏడుస్తున్నావు!

ఎవడు మరణిస్తే లోకం పరమాన్నం వండుకు తింటుందో అటువంటివారిని సంహరించడానికి యింత శోకిస్తున్నావా?

వీల్లేదు, వీరందరినీ సంహరించవలసిందే. అడవులలో ముక్కు మూసుకు కూర్చుని మోక్ష మార్గం వెతకడం రాజ వంశీయుల పని కాదు.

నీ ధర్మాన్ని, క్షాత్ర కర్తవ్యాన్ని నిర్వర్తించి తీరవలసిందే, మార్గాంతరం లేదు.

కర్మణ్యే వాధికార స్తే
మా ఫలేషు కదా చన

పని చెయ్యడమే నీ వంతు, ఫలితంతో నిమిత్తం లేదు.

గీతా ప్రారంభంలో యిచ్చిన సందేశం యిది. ఏ ప్రాణి అయినా కర్తవ్య నిర్వహణ సాగించాలి, ఫలాపేక్ష లేకుండా.

ఫలితాన్ని దృష్టిలో వుంచుకుని పని చెయ్యడం మొదలుపెడితే అది పూర్తిగా నిర్వహించలేం. అందుచేతనే నీ పని నువ్వు చేస్తూ వుండు. ఫలితం అదే వస్తుంది, అనే సూక్తిని అందించాడు పరాత్పరుడు వాసుదేవుడు.

ఇక్కడ ఒక్కసారి గీతాసారం చూద్దాం.

గీతలోని 18 అధ్యాయాలలో మొదటి ఆరు అధ్యాయాలూ కర్మఘట్టం, తరువాయి ఆరూ జ్ఞానఘట్టం, చివర ఆరూ భక్తిఘట్టం.

కర్మ, భక్తి, జ్ఞానం – మూడే మార్గాలు జీవితానికి.

మూడు మార్గాలూ మానవుని కోసమే. శరీరంలో శక్తి పెరిగి కండరాలు బలంగా వుండి, నరాల బిగువు సడలనంతకాలం కర్మచేస్తూ వుండాలి. కర్మ అంటే ఏదో యజ్ఞ, యాగాది క్రతువులు కావు. ఎవడు ఏ పని చెయ్యడానికి పుట్టాడో, ఏ పని చెయ్యగలడో ఆ పని చేస్తూ ఉండాలి. సోమరిగా పడి ఉండరాదు. కర్తవ్య నిర్వహణ మానవుడి ప్రథమ ప్రధాన లక్ష్యం; అదీ మొదటి ప్రబోధం.

వయసు మళ్ళి, జవసత్వాలు తగ్గేవేళకు తాపత్రయాలన్నీ వదిలి పరలోకచింతనతో జ్ఞానమార్గాన్ని అనుసరించాలి. అలాకాక ఈ సిరిసంపదలూ భోగ భాగ్యాలూ ఏమవుతాయో అనుకుంటూ కూర్చుంటే మనోవ్యాధితో రక్తపుపోటు, గుండెదడ వంటి దీర్ఘరోగాలతో – కట్టుకున్న వారిచేత, కన్నవారిచేత ఈ సడింపుల బ్రతుకు అవుతుంది.

ఇక భక్తిమార్గం – కోటికీ ముక్కోటికీ ఒక రుంటారు, భక్తులు. వారికి ఈ లోకంతో నిమిత్తం లేదు. సుఖ దుఃఖాలూ తాపత్రయాలూ వారిని అంటవు. ఆత్మ సాక్షాత్కారంతో వారు జీవన్ముక్తులవుతారు.

ఇదీ గీత చెప్పిన, చూపిన మార్గం; ఇందుకోసమే ఆబాలగోపాలానికీ గీతను బోధించి, వారిని కర్మమార్గాన ప్రవేశపెట్టి, భక్తిమార్గం చూపించి, జ్ఞానపథం అందించాలి; అలా కాక యిదేదో ముసలమ్మల, సన్యాసుల వేదాంతగ్రంథం అని భావించి ప్రచారం చేసేవారు ఆత్మవంచకులై, లోకద్రోహానికి ఒడిగడుతున్నారు.

భక్తి విషయంలో ఒకమాట చెప్పాలి; వివేకవంతులు సావధానచిత్తంతో గ్రహించవలసిన మాట

అనన్యాః చింతయంతో మాం
యే జనాః పర్యుపాసతే
తేషాం నిత్యాభియుక్తానాం
యోగ క్షేమం వహా మ్యహం॥

మనస్సును యితర విషయాలపైకి పోనివ్వకుండా పరమేశ్వరుని యందే ఏకాగ్రం చేసినప్పుడే వాడు భక్తుడవుతాడు. అటువంటి భక్తుల యోగ క్షేమాలనే తాను చూస్తున్నానన్నాడు వాసుదేవుడు.

మనస్సు దురాలోచనలతో నిండి, పైకి హరేరామ హరేకృష్ణ, హరహరా అని ఎంత అరిచినా అది పరమేశ్వరారాధనకాదు; ఈ పరమ రహస్యం తెలియకుండా ఎంత గొంతు చించుకుని భజనలు చేసినా, కడుపు మాడ్చుకుని ఉపవాసాలూ, వ్రతాలూ చేసినా బూడిదలో పోసిన పన్నీరే.

సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ
అహం త్వా సర్వ పాపేభ్యో మోక్షయిష్యామి మా శుచ॥

సర్వ ధర్మకార్యాలూ కూడా విడిచిపెట్టి, నన్నే స్మరించి శరణు వేడుకునేవారి పాపాలను ప్రక్షాళణం చేసి, వారికి జన్మ రాహిత్యం అనుగ్రహిస్తాను, అన్నాడు. అంటే ఇంద్రియా లన్నిటినీ స్వాధీనంలో ఉంచుకుని నిశ్చల ధ్యానంతో కూర్చునే వారి విషయమే పరమేశ్వరుడు చూస్తాడు.

దేవుడున్నాడా, వుంటే చూపించు అని రొమ్ము విరుచుకు నిలబడి ప్రశ్నించేవారికి గీత అవశ్యపఠనీయం.

దేవుడనేవాడు ఎక్కడో లేడు. పిపీలికాది బ్రహ్మ పర్యంతం వ్యాపించి వుంటుంది దైవశక్తి. అది నీలో నాలో అంతటా ఉంది. నీలో వున్న ఆ దైవాన్ని దర్శించాలంటే

జ్ఞానేంద్రియాలను, కర్మేంద్రియాలను, మనస్సును స్వాధీనంలో ఉంచుకుని, అంతర్ముఖులమై ఆ శక్తిని దర్శించాలి; అదే దైవం; దీనినే భాగవతంలో ప్రహ్లాదుడు వివరిస్తూ –

ఇందుగల డందు లేదని
సందేహము వలదు చక్రి సర్వోపగతుం
డెందెందు వెదకి జూచిన
అందందే కలదు దానవాగ్రణి వింటే॥

అంతటా వున్నవాడు నాకు కనిపించదేమయ్యా అంటే, వెదకి చూడాలి అన్నాడు భాగవత కర్త. ఎక్కడ వెదకడం? బైటకాదు. కొండలలో కోనలలో ఆలయాలలో కాదు. గుండెలో చూడాలి. అందుకే లో లోపలకు చూడాలనీ, వెదకాలనీ విజ్ఞులు బోధిస్తారు.

ఈ దృష్టి లేకుండా యాత్రలు చేశాం, తీర్థాలలో మునిగాం అని బాధపడితే లాభం లేదు. ఇవేమీ చెయ్యకపోయినా మనస్సును స్వాధీనంలో ఉంచుకుని పరమేశ్వర నామ జపంలో ఏకాగ్రంగా వుంచితే చాలు. అదే దైవసాక్షాత్కారానికి నిదర్శనం. అన్యధాశరణం నాస్తి. ఈ ప్రయత్నం చెయ్యకుండా వాదోపవాదాలకు దిగితే కాలం వ్యర్థమే తప్ప ప్రయోజనం లేదు.

'శాస్త్రీయ దృక్పథం పెంపొందాలి' అనేవారు – హేతువాదులు – ఈ విషయంలో ఏ కృషీ చెయ్యకుండానే హేళనకు దిగుతున్నారే తప్ప భగవద్దర్శనానికి అవశ్యమయిన ప్రక్రియాసాధన చెయ్యడం లేదు. అది చెయ్యకుండా దేవుడు లేడు అనడం శాస్త్రీయ, హేతువాద దృక్పథమా!

* * *

గీత ప్రబోధించి ఏం చేశాడు?

పద్ధెనిమిది అక్షౌహిణీల సైన్యాన్ని నేల కూల్పించాడు.

అంటే గీతాపఠనం, మనలను కర్తవ్యోన్ముఖులను చేస్తుందే తప్ప సోమరులుగా, నిర్వ్యాపారులుగా కూర్చోబెట్టదు.

దానితోపాటు భక్తిమార్గాన మనశ్శాంతినీ, జ్ఞాన పథాన మోక్షాన్నీ అనుగ్రహిస్తుంది.

పర్యవసానంగా గీత మానవత్వాన్ని మానవదశనుంచి దివ్య మానవలోకాలకు నడిపించడానికే అనుగ్రహించాడు వాసుదేవుడు.

వివేకం కలవాడు ఈ దృష్టితో గీత పఠించాలి. కాలక్షేపానికి పఠించడంవల్ల ప్రయోజనం లేదు. దాన్ని మననం చేసుకుని, మనస్సును వికసింపజేసుకుని ఆచరణలో పెట్టాలి. కానినాడు గీతాపఠనం వ్యర్థం.

* * *

రణభేరి మ్రోగింది.

అప్పుడు ధర్మరాజు ఆయుధాలు రథం మీద విడిచి, క్రిందికి దిగి చక చక శత్రుసేనవైపు తలవంచి అడుగులు వేస్తున్నాడు.

యుద్ధం ప్రారంభం కాకుండానే శత్రుసేనకు తలవంచుతున్న అన్నగారిని చూసి భీమార్జున నకుల సహదేవులు ఆందోళన పడుతూంటే, కృష్ణుడు చిరునవ్వుతో వారించి; చూస్తూ వుండండి, మీ అన్నయ్య ఏం చేస్తాడో అన్నాడు.

ధర్మరాజు

ధర్మరాజు వినయంగా భీష్ములవారి పాదాలకు నమస్కరించి :

తాతా! మీరు ఆశీర్వదించి అనుమతిస్తే యుద్ధం చేస్తాను, అన్నాడు.

భీష్మ : నాయనా! వంశ మర్యాదను కాపాడావు. నీ వినయానికి సంతోషించి నీకు అనుమతి యిచ్చాను. వెళ్ళు, అవసరమయినప్పుడు మరోసారి కలుసుకో.

ఆయన దగ్గర నుంచి ద్రోణాచార్యుల దగ్గరకు వెళ్ళి పాదాభివాదం చేసి ఆశీర్వాదం పొంది, కృపాచార్యులకు, శల్యునికి నమస్కరించి అనుజ్ఞ తీసుకుని తిరిగి వస్తున్నాడు.

అందరూ తెల్లబోయి చూస్తున్నారు.

ధర్మరాజు నిస్సందేహంగా యుద్ధం మాని అడవికి పోతాడనే భావించారు.

కృష్ణుడు : అర్జునా! అర్థమయిందా మీ అన్నయ్య తెలివి ఎంతటిదో. సగం యుద్ధం పూర్తిచేశాడు, అంటే తెలిసిందా! భీష్మ, ద్రోణ, కృప, శల్యులు మీమీద బాణం విడవరు; కత్తి విసరరు. మిగిలిన సగం యుద్ధం మీరు నలుగురూ నడిపి విజయం సాధించండి, అని చిరునవ్వు నవ్వాడు.

వినయంతో, శాంతంతో సాధించగల విజయాలు ఆయుధాలతో అందవని గ్రహించాలిక్కడ.

* * *

ఇంతకు ముందు రథికులనూ, అతిరథికులనూ నిర్ణయిస్తూ భీష్మపితామహుడు కర్ణుని అర్ధరథునిగా తేల్చినప్పుడు ఆ వీరుడు ఆగ్రహంతో –

ఈ ముసలి యోధుడు నేల కూలేవరకూ నేను కత్తిపట్టి కదనరంగంలో కాలుపెట్టను, అన్నాడు.

అందుచేత యుద్ధప్రారంభ దినాన ప్రేక్షకాగారంలో కూర్చున్నాడు కర్ణుడు. (నాటి యుద్ధాలను చూడడానికి గేలరీలను నిర్మించేవారు. ఈనాడు క్రికెట్ పోటీలు చూచేవారికి కట్టే స్టేడియంవలె.)

'అక్కడకు వెళ్ళి కృష్ణుడు: కర్ణా! ఈ ముసలియోధుడు కూలేవరకూ విశ్రాంతిగా కూర్చునేకంటే మా పక్షాన పోరు సాగించరాదా, అన్నాడు.

కృష్ణా! ఎందుకయ్యా ఈ అపహాస్యం. ఈ జీవితం దుర్యోధనుని సేవకే అంకితం; మరెవరికీ నా సేవలు అందవు, అన్నాడు కర్ణుడు.

ఈ సన్నివేశాన్ని నిశితంగా చూస్తే కృష్ణుడు కర్ణుని ఎంత క్రిందికి దిగజార్చాడో తెలుస్తుంది. ఆ మనస్సు ఎంత దుర్బలం అవుతుంది కృష్ణుని మాటలతో,

ఏ పక్షంలో నిలబడినా నువ్వు సాధించగలిగింది ఏమీ లేదనే కదా కర్ణుని యీసడించాడు కృష్ణుడు.

ధర్మరాజు నమస్కార బాణాలతో నలుగురు సేనాపతులను జయించాడు. కృష్ణుడు అవహేళనతో కర్ణుని వంటి యోధుని గెలిచాడు. యుద్ధం ప్రారంభం కాకుండా జరిగిన గాథ లివి.

* * *

యుద్ధం ప్రారంభించేవేళ ధర్మరాజు ఉభయపక్ష యోధులను తిలకించి –

ఈ క్షణంలో శత్రుపక్షంలో మాతో చేరదలిచినవారు నిస్సంకోచంగా రావచ్చు. ఇక్కడివా రెవరయినా శత్రువుల మీద అభిమానంతో వెళ్ళదలచుకుంటే వెళ్ళవచ్చు, అని ఎలుగెత్తి పలికాడు.

అప్పుడు ధృతరాష్ట్రునికి పరిచర్య చేసిన యువతివల్ల కలిగిన యుయుత్సుడు ధర్మజుని పక్షంలో ప్రవేశించాడు.

* * *

పాంచజన్య, దేవదత్త శంఖధ్వానాలు మోగాయి.

భీష్మపితామహుడు నారి మ్రోగించాడు.

రథికులు రథికులతో, ఆశ్వికులు ఆశ్వికులతో, గజారూఢులు గజబలంతో పోరు సాగించాలన్నాడు భీష్ముడు, సర్వసేనానిగా.

ఆయుధం లేనివానితో, అలసినవానితో, పారిపొయ్యేవానితో యుద్ధం చెయ్యరాదని శాసించాడు.

యుద్ధ నియమాలన్నీ మరోమారు ప్రకటించి, బాణం సంధించాడు పితామహుడు.

ఆయన సర్వసేనాపతిగా పదిరోజుల యుద్ధం నడిపించాడు.

పది రోజులలో పేరున్న మహారథికు డెవడూ నేల కూలలేదు. అల్పబలులు, సామాన్యయోధులు మరణించారు.

అంతటి మహాయోధుడు కదా భీష్ముడు; ఒక్క మహారథికుని కూడా నేల పడగొట్టలేకపోవటమా అటువంటి వానికి సేనాధిపత్యం ఎలా కట్టబెట్టారు.

ఈనాటి వలెనే బంధుపక్షపాతంతోనే దుర్యోధనుడీ పని చేశాడా?

అంతకంటె కర్ణునికే ఆ అవకాశం యిచ్చివుంటే ఎంత బావుండేది, అని ప్రశ్నించేవారుండకపోరు.

ధర్మతత్వజ్ఞులు ధర్మశాస్త్రంగా భావించడానికి కారణం ఆలోచించగలవారికి భీష్మపితామహుని సేనాధిపత్యంలోని విశేషం గోచరిస్తుంది.

ధర్మం, సత్యం అనేవి మానవులకే తప్ప, పశు పక్షి జాతులకు ధర్మాధర్మాలు, సత్యాసత్యాలు లేవు. దొరికిన తిండి తినడం, సంతానాన్ని కనడం, ప్రాణ రక్షణ చేసుకుంటూ, విశ్రాంతిగా నిద్రించడం, క్రూరప్రాణి కనిపిస్తే భయంతో పారిపోవటం–అంతే వాటి లక్షణం. ఇవన్నీ మానవజాతికీ వున్నాయి. ఆహారం, నిద్ర, భయం, వంశాభివృద్ధులవరకూ యితర ప్రాణికోటితో మనిషి కూడా సమానుడే.

మరి వాటికంటె వీని విశిష్టలక్షణం ఏమిటి?

ఏది మంచి? ఏది చెడు? అని ఆలోచించగల మనస్సు, అందులో మంచివైపు నడిపించే బుద్ధి మానవుని కొక్కనికే లభించిన వరం. దాన్ని సక్రమంగా వినియోగించుకున్న మానవుడు దివ్యత్వం వైపు సాగుతూ, తోటివారి ఆరాధనలు అందుకోగలుగుతాడు.

అందుకే సత్యం, ధర్మం మానవుడు ఆచరించి, అనుసరించాలి. ఈ ధర్మం వున్నదే యిది ఎప్పుడూ ఒకలా ఉండదు.

సామాన్య ధర్మం, విశేషధర్మం. ఆపద్ధర్మం–అని మూడు మార్గాలలో ఉంటుంది. ఈ రహస్యం గ్రహించడానికే శాస్త్రాలు చదవాలి, చదివి మననం చేసుకుంటూ, ఆచరణలో పెట్టాలి.

అలా పెట్టినవాడు భీష్మపితామహుడు.

ఆయన కూడా మానవుడు. మనలానే ఆయనకూ రాగ ద్వేషాలున్నాయి, సుఖ దుఃఖాలు అనుభవించాడు.

అయితే ఆయన ద్వేషం అకారణంగా ప్రాణిహింసకు దిగేది కాదు, రాగం కారణంగా అక్రమాలకు ఒడిగట్టేవాడూ కాడు.

సుఖాలలో పొంగి ఎగిరినవాడు కాడు, దుఃఖాలకు కృంగి నేలవాలలేదు. అన్నిటినీ ఉచితరీతిని గ్రహించి ఉదాత్తంగా జీవితం నడిపినవాడు; కనకనే అందరి మన్ననలూ అందుకున్నాడు.

యౌవ్వనం అంకురిస్తున్న రోజులలో రక్తం పొంగుతున్న వయస్సులో కన్నతండ్రి కోసం బ్రహ్మచర్య దీక్ష వహించి, సింహాసనాన్ని తృణప్రాయంగా విడచిన విజ్ఞుడాయన.

అటువంటివాడు జీవితచరమ సంధ్యలో కనుల యెదుట తన వంశీయులు ఒకరిమీద

ఒకరు కత్తులు దూస్తూ, అస్త్ర శస్త్రాలు సంధించుకుంటుంటే సహించలేకపోవడం సామాన్య మానవధర్మం.

ఈ ధర్మదృష్టి కారణంగానే ఆయన యుద్ధంలో నిలబడిన పది రోజులలో మహారథికు డొక్కడూ నేల కూలలేదు. సామాన్యులు, పిరికివారు పడిపోయారు.

తన వంశమే కాదు వీరయోధ కుటుంబం మరణించడం ఆయన కిష్టం లేదు.

అయితే ఆయన సర్వసేనాధిపత్యంలో ఒక గొప్ప విశేషం ఉంది. ఈ రహస్యం సామాన్యులకు తెలిసేది కాదు.

పితామహుడు

యుద్ధం తీవ్రంగా సాగుతున్న రోజులలో ఒకనాడు భీష్మపితామహుని తీవ్ర విజృంభణానికి ఆగలేక శ్రీకృష్ణుడు చక్రధారియై రథం దిగాడు. అప్పుడు అర్జునుడు పరుగు పరుగున పోయి ఆయనను బ్రతిమాలి వెనుకకు తీసుకు వచ్చాడు.

మరోమారు తాతగారి శరవర్షానికి తట్టుకోలేక అర్జునుడు ఉక్కిరి బిక్కిరి అవుతున్నాడు, గుర్రాలను సక్రమంగా నడపలేక కృష్ణుడు చికాకుపడుతున్నాడు. భీష్మపితామహుడు ఊపిరి సలపకుండా బాణప్రయోగం చేస్తున్నాడు.

అర్జునుని వల్ల ప్రయోజనం లేదని కృష్ణుడు చక్రధారియై దిగి నడుస్తూంటే

కుప్పించి యెగసిన కుండలంబుల కాంతి
గగన భాగం బెల్ల గప్పి కొనగ
చక్రంబు చేపట్టి చనుదెంచు రయమున
పైనున్న పచ్చని పటము జార
నేడు భీష్ముని జంపుదు నిన్ను గాతు
అంటూ వస్తున్నాడు కృష్ణుడు.
భీష్మపితామహుడు చిరునవ్వుతో :
త్రిజగన్మోహన నీలకాంతి తనువుద్దీపింప
ప్రాభాత నీరజ బంధుప్రభమైన చేలము పయిన్ రంజిల్ల
నీలాలకవ్రజ సంయుక్త ముఖారవింద మతి సేవ్యంబై విజృంభింప

రావయ్యా! ఎంత అదృష్టం నీ చేతులలో కైవల్యంపొందడం

అంటూ ఆకర్ణాంతం నారి సారించి బాణం సంధించి చిరునవ్వుతో రణక్రీడకు నిలబడిన మహాయోధు డాయన!

ఎదురుగా వస్తున్నది జగన్నాటక సూత్రధారి, లీలామానుష విగ్రహుడు వాసుదేవుడని

తెలుసు, ఆయన చేతులలోని సుదర్శనం కదిలిందో ప్రాణాలుండవనీ తెలుసు. అయినా వీరధర్మాన్ని విడిచి పెట్టకుండా నిలబడి ఎదిరిస్తూనే వున్నాడు.

అదికా దిక్కడ విశేషం –

యుద్ధంలో ఆయుధం చేతబట్టను, మాట సాయం చేస్తాను; సారధ్యం వహిస్తాను అని ప్రతిజ్ఞ చేసిన పరాత్పరునిచేత రెండు మారులు చక్రం పట్టించిన పరాక్రమ సంపన్ను డాయన.

మరో ధర్మసూక్ష్మం వున్నదిక్కడ.

ఈ దేశంలో పరమేశ్వరుడు భక్తపరాధీనుడు; తన భక్తుడు ఏ నామంతో, రూపంతో ధ్యానిస్తే ఆ నామరూపాలతో క్రిందికి దిగి వచ్చి భక్తుని అభీష్టానుసారం నడుస్తాడు. భక్తుడైన భీష్ముడు కృష్ణునిచేత చక్రం పట్టిస్తానన్నాడు. కనుక వాసుదేవుడు భక్తుని కోరిక చెల్లించాడు.

ఈ భక్తి రహస్యం, భగవత్తత్వం తెలియనివారు రకరకాల దుర్వ్యాఖ్యలు చేసి తమవంటి దుర్మేధ కలవారి హర్షధ్వానాలతో తమ అవివేక రూపంలోకి మరికొన్ని మండూకాలను లాగుతారు, లాగారు.

అంతకంటె – ఇన్నివేల సంవత్సరాలుగా ఎందరో సామాన్యులకు హృదయాహ్లాదం కలిగిస్తూ, ధర్మపథ నిర్దేశం చేసే గ్రంథంలోని సూక్ష్మాంశాల వెనుక వున్న తత్వం ఏమిటి? అని తర్కించరు. పై పై పరామర్శతో పోయి పరిహాసం పాలవుతూనే వున్నారు ఈ వితండవాదులు.

ఇంతకూ భీష్మపితామహుని శక్తి ఎంతటిదో చూశాం.

గ్రీష్మకాల మధ్యందిన మార్తాండునివలె సాహసపరాక్రమాలు ప్రదర్శించిన యోధుడు సాయంకాల సూర్యునివలె కాంతిహీనుడై అంపశయ్యమీద ఒరిగాడు.

పితామహుడు నేల కూలడంతో ఉభయపక్షాలయోధులూ ఆయుధాలు క్రిందపెట్టి, తలపాగలు తీసి నడ్డికి కట్టుకుని దీనపదనులై తలలు వాల్చి : చేతులు జోడించి ఆయన చుట్టూ చేరారు.

శరీరం నిండా బాణాలు గుచ్చుకుని వున్నా, చిరునవ్వు చెదరకుండా వుంది.

దరహాసవదనంతో అందరినీ ఒక్కమారు తిలకించి దుర్యోధనుని వైపు తిరిగి :

నాయనా! శరీరం అంతా అంపశయ్యమీద ఉంది. తలక్రింద తలగడ కావాలి అనగానే దుర్యోధనుని ఆజ్ఞానుసారం సేవకులు మెత్తని దిండ్లు తెచ్చారు.

భీష్ముడు : నాయనా, ఈ బాణాలతోనే తలగడ కావాలి?

అర్జునుడు తన గాండీవం సంధించి బాణాలతో తలగడ సమకూర్చాడు.

అప్పుడు పితామహుడు : నాయనా, దాహబాధ విపరీతంగా వుంది; అనగా దుర్యోధనుడు సువర్ణకలశాలతో మంచినీరు తెప్పించాడు.

నాయనా! ఈ దశలో పాతాళ గంగా జలాలు కావాలి, అన్నాడాయన.

అర్జునుడు అస్త్రం సంధించి భూమిని ఛేదించి జలధారలు తాతగారి నోటి దగ్గరకు రప్పించాడు.

ఆయన దాహశాంతి చేసుకుని : నాయనా, దుర్యోధనా! చూశావా, వీని అస్త్రశక్తి. ఇప్పటికయినా నా మాట విని యుద్ధం ఆపి, సంధి చేసుకుని మీరుభయులూ సుఖశాంతులతో ఉండండి, అన్నాడు.

దుర్యోధనునికి ఆ మాటలు రుచించలేదు. ఎవరి దారిని వారు వెళ్ళారు.

అందరూ వెళ్ళాక, కర్ణుడు అల్లంత దూరాన రథం ఆపి, పాదచారియై వచ్చి తాతగారి పాదాలకు నమస్కరించి :

మహాయోధుడా! నా మీద కోపం విడిచి అనురాగంతో చూడు. ఇప్పుడు నాకు కర్తవ్యం బోధించు, అని ప్రార్థించగా భీష్ముడు తనకు రక్షగా వున్న సేవకులందరినీ దూరంగా పంపించి :

నాయనా! నీమీద నాకు కోపం లేదు, అన్నదమ్ముల మధ్య కలహం పెంచి వంశనాశనానికి దోహదం చేస్తున్నావని నిన్ను మందలించిన మాట నిజం.

ఇప్పుడు నీకొక పరమ రహస్యం చెప్పాలి. నువ్వు సామాన్యుడవు కావు, దైవశక్తివల్ల కుంతీదేవికి కలిగిన మొదటి బిడ్డవు. అంటే నువ్వు కూడా పాండవులలోని వాడివే. నీమీద నాకు వాత్సల్యం వుంది కాని ఆగ్రహం లేదు. ఇప్పుడింక నా మాట విని పాండవులతో కలిసి యుద్ధం ఆపుచెయ్యి. ప్రజాక్షయం తప్పుతుంది, అన్నాడు.

తాతా! నేను కుంతీ నందనుడను అనే విషయం యింతకు ముందే విన్నాను. కాని ఈనాడు దుర్యోధనుని విడిచి పాండవపక్షం చేరడం ఉచిత మంటావా?

నేటివరకూ దుర్యోధనుడు నాకు చేసిన ఉపకారాలు, నామీద చూపిన అభిమానం అన్నీ విస్మరించి యిప్పుడు పాండవపక్షానికి వెళ్ళడం ధర్మమా!

నిన్నటి దాకా పాండవులకు జరిగిన పరాభవాలతో, జరిపిన అవమానాలతో నేనూ వున్నాను. ఈ ఉభయుల వైరం వృద్ధిచేసిన వాడిని నేను.

ఇంత జరిపించిన నేను ఈ సంగ్రామవేళ వారిదగ్గర జేరడం వీర లక్షణమా తాతా! అయినా,

దైవాధీనము సర్వమున్
మన మతిం తప్పింపగా వచ్చునే!
నీ వింతన్ నీకు నొందు బల్కక
పరానీకంబుపై పంపు
మ త్సేవా ధర్మము నిర్వహించెద

అన్నాడు, భీష్ముడు నవ్వి :

నాయనా, అలాగే కానియ్యి, వెళ్ళిరా! అని పంపాడు.

న్యాయాన్యాయాలు

మహాభారతాన్ని తమ రంగు కళ్ళతో చూచిన వారందరికీ ఒకటే బాధ.

భారతంలో కర్ణుడికి అన్యాయం జరిగిపోయింది. అంత దారుణం సహించలేం, అని గుండెలు బాదుకునేవారిలో భారతం పూర్తిగా చదివినవా రెందరు :

చదివి వుంటే అన్యాయం జరిగిం దెవరికో తెలిసి ఉండేది.

చదవకుండా, చదివిన వారివద్ద కూర్చుని విశదంగా వినకుండా విమర్శకు దిగడం ఈ శతాబ్దంలో ప్రభవించిన కుహనా మేధావుల లక్షణం.

ఇటువంటి దుష్ప్రచారం సాగించే వారందరూ ప్రధానంగా ఒక విషయాన్ని ముందు తేల్చుకోవాలి.

భారతం జరిగిందని మీరు విశ్వసించి మాట్లాడుతున్నారా?

జరిగిందనే విశ్వాసం వున్నట్లయితే, ఆ కథాకాలంనాడు వుండి అంతనూ గ్రహించిన వ్యాసుని రచనలో ప్రతి అక్షరాన్నీ ప్రమాణంగా స్వీకరించాలి.

అలాకాక మీ వాదానికి బలం కలిగించే సన్నివేశాలే జరిగాయనీ, మిగిలినదంతా కల్పన అనీ అంటే అది మీ అవివేకానికే నిదర్శనం.

కులద్వేషం

యదువంశానికి చెందిన శూరసేనుని కుమార్తె కుంతి. సూర్యభగవానుని అనుగ్రహంవల్ల కర్ణుని ప్రసవించింది. ఇంతవరకూ విశ్వసించినవారు, కర్ణుడు సూతుడని ఎలా భావిస్తున్నారు! సూతుడనుకోవడం వల్లనే కర్ణునికి అన్యాయం జరిగిందని బాధపడుతున్నారు. అందుకు కారణం ఇంగ్లీషు ప్రభువుల పుణ్యమా అని దేశంలో కులద్వేషాలు ప్రబలడం.

ఈ కులవిద్వేష జాడ్యాన్ని భారతం దాకా తీసుకుపోయిన వీరి వివేకం ఎంత సంకుచిత సుడిగుండంలో పడిందో చూడాలి.

కాదండీ! భారతం అంతా కల్పన అంటారా?

అప్పుడింక పేచీయే లేదు, వ్యాసులవారు తమకు కావలసినరీతిలో కథ వ్రాసి లోకానికి అందించారు. ఆ కథ అలా వున్నందువల్లనే యిన్నివేల సంవత్సరాలుగా ప్రపంచ మానవాళిని ఆకర్షించి అలరిస్తున్నది.

పర్యవసానంగా భారతం జరిగినా, జరగకపోయినా దానిలోని పాత్రలన్నీ నేటికీ సజీవంగా మన ముందు నడుస్తున్నాయి. ఆ నడిచే జీవత్పాత్రలలో కర్ణుడికి జరిగిన అన్యాయమేమీ లేదనే విషయం ఉద్యోగ, భీష్మపర్వాలలో కర్ణుని ప్రవర్తన పరిశీలించినప్పుడు తెలుస్తుంది.

దుర్యోధన, శకుని, దుశ్శాసనులతో కలిసి వున్నప్పటి కర్ణుడు వేరు. ఆ కర్ణుడు దుర్యోధనునికి అమ్ముడు పోయిన మనిషి; తన మనస్సు, హృదయం అన్నీ అమ్ముకున్నవాడు. వారు చేసే అత్యాచారాలకు అన్యాయాలకు తాళం వేస్తూ సంతోషింపజేయడమే జీవిత పరమావధిగా గలవాడు.

కాని రాయబారానంతరం కృష్ణునితో మాట్లాడిన కర్ణుడు, భీష్ములవారు అంపశయ్యమీద వున్న సమయంలో ఒంటరిగా వెళ్ళి మాట్లాడిన కర్ణుడు వేరు. కర్ణుని అంతర్యం వాని సుగుణం ఇక్కడే కనిపిస్తుంది; అదీ భేదం.

దుర్యోధనుడు తనకు చేసిన ఉపకారంతో పొంగిపోయిన కర్ణుడు దానికి ప్రత్యుపకారంగా తన జీవితాన్ని, వ్యక్తిత్వాన్ని వానికి ధారపోశాడు అంతే!

నాడు కర్ణుడేకాదు, నేటికీ ఎందరో మేధావులు, ధీరులు ఇలా శ్రీమంతులకు అమ్ముడుపోయి వెట్టిచాకిరి చేస్తూ తమ వ్యక్తిత్వానికి తిలోదకాలిస్తూనే వున్నారు. ఈ రహస్యం గ్రహించగలిగితే భారతంలో కర్ణుడికి జరిగిన అన్యాయం అనేది వుంటే అది దుర్యోధనాదుల దుర్మంత్రంవల్లనే, కాకుంటే కర్ణునిలో గూడుకట్టుకున్న సేవాధర్మ దీక్షవల్లనే. ఇక్కడ ఈ విషయం ఆపి ముందుకు సాగుదాం.

భీష్ములవారి అనంతరం సర్వసేనాధిపతిగా ద్రోణాచార్యుల వారే వుండాలని సూచించినవాడు కర్ణుడు. వాని మాటమీదనే దుర్యోధనుడు ద్రోణాచార్యులవారికి సేనాధిపత్యం అప్పగించాడు.

భీష్మ నిష్క్రమణంతో కురుసేన గజ గజలాడి, దిక్కులు చూస్తూ కర్ణుని రాకకోసం నిరీక్షిస్తున్నది.

వచ్చిన కర్ణుడు విషాదవదనంతో పెద్దలందరినీ చూసి :

దమమును సత్యముం తపము దానము శీలము
అస్త్ర వీర్య శౌర్యములను భీష్ము నందకలవు
అట్టి మహాత్ముడు పోర నీల్గె.... అంచు విషణ్ణమూర్తియై.

భీష్మ పితామహుడు అంపశయ్య చేరేవరకూ ఆయనగురించి ఏనాడూ మంచిమాట ఆడి ఎరుగని కర్ణుడు ఈనాడు మాట్లాడుతున్న పద్ధతి చూస్తే ఆయన విషయమై కర్ణుని అంతరంగం అర్థమవుతుంది.

మనసులోపలి మనసులో భీష్ములవారి మీద అపారమైన గౌరవమర్యాదలున్నా దుర్యోధనాదుల తృప్తి కోసమే యింతకాలం కర్ణుడు ఆయనను పరుషభాషణతో అవమానించాడు.

ఇప్పుడింక అ ధోరణి విడిచి వాస్తవాన్ని, తన అంతరంగాన్ని నిర్భయంగా ప్రకటించాడు.

కర్ణుడే కాదు, నేటికీ ఎందరోయిలా ప్రవర్తించే నాయకులు మన కంటబడుతూనే వుంటారు.

బ్రతికినంత కాలం ప్రతిపక్షనాయకులను విమర్శించి, అవమానించినవారే, మరణానంతరం –

ఆహా! వారు లేనిలోటు తీరేది కాదు. ఒక మహానాయకుడు మరణించాడు. ఆయనకు తల వంచుతున్నాం, అంటూ శ్రద్ధాంజలి లర్పించే వారందరికీ కర్ణుడే గురువు.

విషాదభరితమైన మనస్సుతో వాస్తవం పలికిన కర్ణుడే, కొంతసేపటికి ఉపశమనం పొంది ఏమన్నాడో కూడా ఓపికగా చిత్తగించండి.

పాండవులతో పాటు వారి వెంట వున్న సాత్యకి ప్రముఖుల గర్వం అణగద్రొక్కి నేలకూల్చి రాజ్యలక్ష్మిని దుర్యోధనునికి అప్పగిస్తాను, అని గర్జించాడు.

మరికొద్ది క్షణాలలోనే –

కౌరవులం గాచుచు
రణశూరుల పాండవుల నోర్చుచుం
కీర్తి కరస్ఫార విహారత భీష్ముని చేరం
జనుకంటె ఒప్ప సెప్పం గలదే!

మనవారిని రక్షిస్తూ, పాండవులతో పోరాడుతూ మహావీరుడైన భీష్ముని చేరడం కంటె ఏం కావాలి, అని తన మనసులోని భావాన్ని వ్యక్తం చేశాడు. భీష్మునంతటివాడు పడిపోయాక ఇంకెవరు నిలుస్తారనే ఊహ కలిగింది కర్ణునికి.

ఈ మాటలు వింటున్నప్పుడు మనిషి మనసు క్షణాలలో ఎలా మారుతుందో బోధపడుతుంది. మానవ మనస్తత్వాన్ని మహర్షి వ్యాసుడు ఎంతగా అవగాహన చేసుకుని భారత మహేతిహాసాన్ని అందించాడో తెలిసినప్పుడు వివేక హృదయం పొంగి పులకించి తీరుతుంది.

❊ ❊ ❊

అనంతరం కర్ణుడు మరొకమారు భీష్మపితామహుని దర్శనానికి వెళ్ళినపుడు ఆ వృద్ధయోధు డంటాడు –

జన్మమున నయ్యెడు చుట్టరికంబు కంటె
సుస్థిరతరమైన సంగడముచేనగు
బాంధవ మెక్కుడంద్రు –

అంటాడు.

అంటే అన్నదమ్ముల బాంధవ్యం కంటె స్నేహం బలమైనది, అనే విషయం నాటినుంచి నేటివరకూ అనుభవంలోకి వస్తున్న విషయం.

కర్ణుడు తిరిగిరాగానే దుర్యోధనుడు మన సేనకు అధిపతిని నిర్ణయించు, అన్నాడు.

అప్పుడు కర్ణుడు మాట్లాడిన తీరు రాజకీయవాదులందరూ అనుదినం పాఠంగా స్వీకరించవలసినది.

మహారాజా! మన సేనలో సేనాధిపతి పదవికి అందరూ తగినవారే. అయితే ఆ అధికారం ఎవరికిస్తే అందరూ ఆమోదిస్తారో వానినే నిలబెట్టాలి.

మన సేనలో అంతటివారు ద్రోణాచార్యులు.

ఆయన మనందరికీ గురువు, విప్రవరుడు, వృద్ధుడు, అన్నిటినీ మించి రణకోవిదుడు. కనక సర్వసేనాధిపతిగా ఆయనను అభిషేకించాలి, అన్నాడు.

అదీ కర్ణుని అంతరంగం నిన్నటిదాకా భీష్మ, ద్రోణులను తూలనాడుతూ మాట్లాడినా సమయంలో తన వివేకాన్ని పదునుపెట్టి వారి వారి విశిష్ట లక్షణాలను నిరాఘాటంగా వ్యక్తం చేయగల ఉదార హృదయుడు కర్ణుడు. అంతేకాదు ధీమంతుడు కూడా.

ద్రోణాచార్యులు సర్వసేనాధిపతికాగానే, దుర్యోధనుని కావలసిన వరం కోరుకోమన్నాడు.

ఆచార్యా, ధర్మరాజుని సజీవంగా బంధించి తీసుకువస్తేచాలు, అన్నాడు దుర్యోధనుడు.

సంతోషంతో ద్రోణాచార్యులు : నాయనా, ధర్మరాజు అజాత శత్రువనే మాట యిప్పుడు యథార్థమైంది కత్తులు చూసి రణరంగంలో నిలబడినప్పుడు కూడా వానిని చంపమనకుండా, సజీవంగా బంధించి తెమ్మంటున్నావు; అంటే వారికి అర్థరాజ్యం యివ్వడానికి సంకల్పించావా, సంతోషం, అన్నాడు మాయా మర్మం ఎరుగని ధనురాచార్యుడు.

దుర్యోధనుడు వికటంగా నవ్వి : గురుపూజ్యా! ఇప్పుడు ధర్మరాజును సంహరించామో, అర్జునుడు గాండీవం సంధించి శరవర్షంతో మనలనందరినీ ముంచెత్తుతాడు.

కాక, పాండవు లందరినీ నేలకూలిస్తే వాసుదేవుడు సుదర్శన చక్రధారలతో మా సోదర, బంధు, మిత్రులందరినీ యమసదనం చేర్చి, రాజ్యాన్ని తన మేనత్తకు ధారవోసి తీరుతాడు.

అందుచేత, ధర్మరాజును సజీవంగా బంధించి తీసుకువస్తే మళ్ళీ జూదానికి

కూర్చోబెట్టి, సునాయాసంగా అరణ్యానికి పంపి, హాయిగా సామ్రాజ్య భోగాలు అనుభవిస్తాను, ఎలా ఉంది నా దూరాలోచన! అని మిత్రులవైపు తిరిగాడు.

అందరూ వాని ఆలోచనకు సంతోషపడ్డారు.

ద్రోణాచార్యులు చింతాకులిత హృదయంతో ఎంత నీచమైన ఊహ వీనిది, అనుకుని, ఆలోచించి :

దుర్యోధనా, అర్జునుడు ధనుర్ధారియై నిలబడి వుండగా దేవతలు కూడా పాండవులను తేరి చూడలేరు; ధర్మరాజు దగ్గరగా అర్జునుడు లేకుండా చూడగలిగితే అవలీలగా తీసుకురాగలను, అన్నాడు.

ఈ వార్త పాండవ సేనాశిబిరాలకు చేరింది.

ధర్మరాజు దీనవదనుడయాడు.

అర్జునుడు : అగ్రజా! ఆచార్యులవారి మాటకు అంత భయపడవలసిన పనిలేదు. నేనుండగా మిమ్మల్నెవరూ ఏమీ చెయ్యలేరు, అని ధైర్యం చెప్పాడు.

ఇక్కడ దుర్యోధనుని బుద్ధి యింకా ఎంత దుర్మార్గంగా, కుటిలంగా వున్నదో బోధపడుతుంది.

యుద్ధంలో గెలుపు సాధించలేమని అప్పుడే నిశ్చయించుకున్నాడు. అందుకే మళ్ళీ ధర్మరాజుతో మాయాద్యూతం సాగించి వారిని అడవులపాలు చేద్దామనుకున్నాడు.

ఈ మాటలంటున్నప్పుడు కర్ణ, దుశ్శాసనులు దగ్గరేవున్నారు. వారెవరూ ఈ ఆలోచనను ఖండించకుండా మౌనంగా నిలబడ్డారు. అంటే వీని మోసకారితనాన్ని సమర్థిస్తున్నట్లే కదా!

ఇక్కడితో అవలేదు.

ఈ పర్వంలోనే దుర్యోధన, దుశ్శాసనలు చావుదెబ్బలు తిని పలాయనం పఠించిన సందర్భాలూ వున్నాయి.

కృష్ణుని సోదరుడైన సాత్యకితో పోరు సాగిస్తూ వాని ధాటికి నిలబడలేక పారిపోయి వచ్చాడు దుశ్శాసనుడు.

వచ్చిన దుశ్శాసనునివైపు ద్రోణాచార్యులు నవ్వుతూ చూసి :

ఏమి యువరాజు విభునకు సేమమె!
సైంధవుని ఏమిచేసె నరుడు
నీ వేమిటి కిట్లీ రథికస్తోమముతో విరిగితి
ఎందు జొచ్చెదవింకన్॥

రాజుగారి తమ్ముడుగారు కుశలంగా వున్నారా!

సైంధవుని స్థితి ఎలా వుంది, అర్జునుడేం చేస్తున్నాడు! నాయనా, ఇప్పుడెక్కడికి

పారిపోదామనుకుంటున్నావు? యుద్ధమంటే అటుకులూ, బెల్లం కలుపుకు తినడంకాదు. నిండుసభలో నిస్సహాయదశలో వున్న ఆడబిడ్డ చీరలు విప్పడం కాదు.

వెళ్ళు, వెళ్ళు, మీకు సాయపడవచ్చిన వీరుల ప్రాణాలు పోతుంటే నువ్వు ఒళ్ళు దాచుకోకూడదు, అని పంపుతాడు.

ద్రోణాచార్యుల సేనాధిపత్యంలో యిటువంటి సన్నివేశాలు రెండు మూడు కనిపిస్తాయి.

భీష్మపితామహునివలె ఈయనకు సానుభూతి లేదు. ఉభయపక్షాల యోధులూ తన శిష్యులే. వారిలో విద్యను విశేషంగా ప్రదర్శించేవారు కనిపిస్తే ఆయనకు గుండె పొంగిపోతుంది. పలాయనం పఠించే శిష్యులమీద ఆయనకు జాలిలేదు. అసహ్యం.

సరియైన గురువెవరయినా తన శిష్యుడు ముందుకు సాగుతూంటే సంతోషిస్తాడు, మందకొడిగా వెనకబడుతూంటే బాధతో కుములుతాడు. అదే ద్రోణాచార్యునిలో కనిపిస్తుంది.

ద్రోణపర్వంలో ప్రధాన ఘట్టాలు పద్మవ్యూహం, సైంధవ వధ.

అభిమన్యుని చంపడానికి నలుగురయిదుగురు మహారథికులు చుట్టుముట్టవలసి వచ్చింది.

గురు దశ్వంబుల గూల్చెను.

కృపుడు చంపె సారథి –

శకుని, కృతవర్మ, శల్య, బాహ్లిక, కృప, కర్ణ, అశ్వత్థామలు తమ తమ శస్త్రాస్త్ర ప్రయోగంతో చీకాకుపరుస్తున్నా చలించకుండా పోరాటం సాగించాడు, యువవీరుడు అభిమన్యుడు.

చివరకు దుశ్శాసనుని కొడుకుతో సాగిన పోరాటంలో ఉభయులూ నేలకూలుతారు.

ఈ విధంగా అందరు యోధులు కలిసి అభిమన్యుని పడగొట్టారు. ఈ అధర్మానికీ ప్రతీకారంగా చక్రం అడ్డువేసి సంధ్య సమీపించిందనే భ్రమ కల్పించి సైంధవుని తల తరిగించాడు వాసుదేవుడు.

యుద్ధంలో జరిగిన ధర్మాధర్మాల విషయం కర్ణవధ దగ్గర వాసుదేవుని నోటనే వినిపించాడు భారత సంహితా రచయిత వ్యాసమహర్షి.

పాశుపతం

ఈ పర్వంలో అత్యంత ప్రధానమైనది పాశుపతాస్త్ర వినియోగం. అయితే అటు అభిమన్యువధ, ఇటు సైంధవ వధ, ద్రోణవధ యింకా ఎందరో మహారథికుల మరణంతో కోలాహలంగా సాగిన సన్నివేశాలలో పాశుపతం సామాన్యుల దృష్టి ముందు నిలబడలేదు.

అయినా యిది ప్రధానంగా ఎందుకు చెప్పుకోవాలీ అంటే, అర్జునుడు పరమశివుని

మెప్పించి సాధించుకున్న అస్త్రం యిది. దీనికి వినియోగం లేకపోతే అంత శ్రమపడి సాధించడం వ్యర్థం.

అంతటి అస్త్రాన్ని సాధించినందుకు దానికి ప్రయోజనం ఉండాలి కదా!

అది ఎంత ప్రయోజనాన్ని సాధించిందో సావధానంగా చిత్తగించండి.

సైంధవుని శిరసు ఎవని చేతులనుండి నేలపడుతుందో వాని తల వేయి వ్రక్కలవుతుందన్నాడు, సింధురాజు వృద్ధక్షాత్రుడు.

ఇక్కడ ఉదయనుండీ సైంధవ వధోద్యుక్తుడై వూపిరిసలపకుండా పోరు సాగిస్తున్న అర్జునుడు సంధ్యా సమయానికి వాని శిరస్సు ఎగరగొట్ట గలిగాడు. అది క్రిందపడిందో అర్జునుని శిరసుముక్కలవుతుంది. అది తెలిసిన కృష్ణుడు –

ఈ తల పుడమిం పడనీక
అతని తొడమీద వైచునది
ఆ పని విఖ్యాతంబగు
పాశుపతము చేతన యగుగాక
యొంట జెల్లునె మనకున్॥

పాశుపతాస్త్రం సంధించి ఈ శిరసును వాని తండ్రి చేతులలో పడగొట్టు అన్నాడు. అది అలా వెళ్ళి వృద్ధక్షాత్రుని తొడమీద పడడం, ఆయన అసహ్యంతో దానిని నేలమీదకు తొయ్యడం, తక్షణం ఆ వృద్ధుని శిరసు ముక్కలవడం...

అంటే పాశుపతం జగత్సంహారానికే కాక నిర్మాణ కార్యక్రమానికి కూడా ఉపయోగపడే అణుశక్తి వంటిదని గ్రహించాలి.

శక్తి అనేది ఏదయినా సక్రమంగా వినియోగించుకో గలిగితే అది ప్రయోజనాత్మకంగా కూడా పనికి వస్తుందని నేటి వైజ్ఞానికుడు చెప్పే సత్యాన్ని భారతంలో పాశుపత సన్నివేశంతో అనుసంధించుకో గలిగితే నాటి వారి వివేక వికాసం ఎంతటిదో తెలుసుకోగలం.

పాశుపతం అర్జునుడు సాధించుకోక పోయినట్లయితే సైంధవ వధతో భారతం పరిసమాప్తమయేది. దుర్యోధనుడు సింహాసనం ఎక్కేవాడు. ధర్మంమీద అధర్మం విజయం సాధించి నిరాఘాటంగా సాధుహింస సాగేది.

ఆ ప్రమాదం రాకుండా ఉండడానికే పాశుపతం పరమశివుని నుండి అర్జునునికి లభించింది.

దీనిని మానవులమీద ప్రయోగించకూడదని శివుడు శాసించినట్లు ఉద్యోగపర్వంలో అర్జునుడే అంటాడు. అంటే అది జగత్పరిహారానికి మాత్రమే వినియోగపడుతుంది కనక దాన్ని ఎప్పుడుపడితే అప్పుడు ప్రయోగించకూడదని గ్రహించాలి.

*　　*　　*

మొత్తంమీద యీ పర్వంలో మహారథికు లెందరో నేలకూలారు. చివరకు ద్రోణాచార్యులు కూడా దృష్టద్యుమ్నుని కత్తికి బలి అయ్యారు.

అనంతరం కర్ణపర్వం –

ఇందులో శల్య సారధ్యం, కర్ణవధ, రెండూ ప్రధానమైనవే.

సంజయ రాయబారం వలెనే శల్య సారధ్యం కూడా.

కఱ్ఱ విరగదు, పాము చావదు.

రాయబార కృత్యంలో సంజయు డెంతటివాడో, తన కిష్టం లేని వానికి సారధ్యం వహించడంలో శల్యుడూ అంతటివాడే.

ఎందుకంటే రాయబారాన్ని సఫలమూ విఫలమూ చెయ్యకుండా వచ్చాడు సంజయుడు.

అలానే శల్యుడు సారధ్యంలో ఎవరినీ చంపనివ్వలేదు, కర్ణుని చావనివ్వలేదు.

ఉభయులూ పరిస్థితిని చల్లబరిచిన వారే తప్ప అగ్నిని మండించిన వారు కాదు.

అందుకే భారతంలో సంజయ రాయబారమా, శల్యసారధ్యమూ, ఒకే స్థాయికి చెందినవి.

ఇక కర్ణుని మరణం –

శల్యుడు సారధ్యంలో ఉండగా చావలేదు కర్ణుడు. భూమిలోకి క్రుంగిన రథ చక్రం ఎత్తుకుంటుండగా కృష్ణుని ప్రేరణతో అర్జునుడు బాణం సంధించి సంహరించాడు. అంతే తప్ప శల్య సారధ్యం కారణంగా కర్ణుడు చావలేదు.

ఆ సమయంలో కర్ణుడు : కృష్ణా! నువ్వు దగ్గరుండి ఈ అధర్మం చేయిస్తున్నావా? అని ప్రశ్నించాడు.

అప్పుడు కృష్ణుడు : కర్ణా! ఏవిటంటున్నావు. ధర్మమా! ఆశ్చర్యంగా ఉంది. నీకు కానీ, మీ దుర్యోధనునికిగానీ ధర్మశబ్దం తెలుసా.

నాకు సంతోషంగా ఉంది. మృత్యు ముఖంలో పడుతూ అయినా ధర్మమీమాంస తెచ్చావు.

సావధానంగా విను –

నిన్నకాక మొన్న అందరు మహారథికులు చుట్టుముట్టి అభిమన్యుని వధించడం ధర్మమే అనుకున్నావా!

ఉత్తమవంశ సంజాత అయిన ద్రుపద రాజనందనను నిండు కొలువుకు జుట్టుపట్టి యీడ్చి తెచ్చి వస్త్రాపహరణం చెయ్యడం ధర్మమేనా!

మాయాద్యూతం ధర్మమా! లక్క యింటబెట్టి నిప్పు ముట్టించి పాండవులను కడతేరుద్దా

మనుకోవడం, అన్నంలో విషం కలిపిపెట్టడం, పాములచేత కరిపించడం, నదులలో త్రోయించడం ఇవన్నీ ధర్మాలనే భావించారా మీరందరూ.

ఆనాడు ధర్మంగురించి మీ మనసులు ఆలోచించాయా, ఇప్పుడు ప్రాణాలమీదికి వచ్చింది, కనక ధర్మచర్చకు దిగావు. ఈ ధర్మదృష్టి నాడే ఉంటే ఇప్పుడీ వంశనాశనం, ప్రజాక్షయం జరిగేవి కావు. ధర్మకర్మలకూ, పాపకార్యాలకూ ఫలం అనుభవించక తప్పదు. మనం చేసే అన్యాయాలకూ, దుష్కార్యాలకూ ప్రాయశ్చిత్తం యీ జన్మలోనే అనుభవించడం శ్రేయస్కరం. మీరుచేసిన అధర్మాన్ని అధర్మంతోనే ఎదుర్కోవడం దోషంకాదు.

ముల్లు విరిగితే మల్లిమొగ్గతో తియ్యం, ముల్లుతోనే పీకుతాం. వజ్రాన్ని వజ్రంతోనే ఛేదించాలి. అలానే మోసాన్ని మోసంతో భేదించడం లోకధర్మం. ధర్మ విషయంలో నాకంటె తెలిసినవాడివి కావు.

యద్య దాచరతి శ్రేష్ఠః
తత్త దే వేతరో జనాః

అంటూ అర్జునునిచేత బాణం విడిపించడం, అది కర్ణుని శిరసు నేలకూల్చడం ఏకకాలంలో అయిపోయాయి.

* * *

ఇక్కడ మరికొంత ఆలోచించాలి.

ధర్మం అనేది మూడు విధాలు.

సామాన్యధర్మం, విశేషధర్మం, ఆపద్ధర్మం.

సాంసారిక జీవితం సాగిస్తూ, సుఖంగా బ్రతికేవారికందరకూ అవశ్యం ఆచరించదగ్గది సామాన్యధర్మం.

ఆ యా దేశకాల వ్యక్తులకు అనుసరణీయం విశేషధర్మం ఇక విషమ సమస్యలు ఎదురయినప్పుడు, ప్రాణాపాయం ఏర్పడినప్పుడు ఆపద్ధర్మం.

ఈ మూడు ధర్మపథాలూ తెలపడానికే భారతం అవతరించింది. అంతేకాని ధర్మం ఎప్పుడూ స్థాణు రూపంలో ఉండదు. ఈ రహస్యం తెలియకపోతే భారతయుద్ధం అంతా అధర్మంగానే కనిపిస్తుంది.

యుద్ధంలో పాండవులు అన్యాయం చేశారని వాపోయే వారందరూ ఆనాటివరకూ దుర్యోధనాదులు చేసిన దుర్మార్గాలను విస్మరించారా!

లేకపోతే, చచ్చిపోతున్నారు కనక కురువంశీయుల మీద జాలితో యీ వాదానికి దిగుతున్నారా! బాగా ఆలోచించాలి.

సామాన్యులవలె –

ఎంత దుర్మార్గుడయినా వాణ్ణి చంపడం న్యాయంకాదు, అనే ధోరణి వివేకులు అనవలసింది కాదు.

దేశం, కాలం, పాత్ర ఈ మూడింటిమీదా ఆధారపడి ఉంటుంది ధర్మం.

దురదృష్టవశాత్తూ యీనాడు ప్రపంచానికి దుష్ట చతుష్టయ దుర్మార్గమే ధర్మంగా చెలామణీ అవుతున్నది కనక అసలు ధర్మం తెలియక భారత రామాయణాలమీద దుమ్ము జల్లుకుంటూ సంతోషిస్తున్నారు.

వారిని అలా విడిచి – మనం భారత కథలోకివస్తే –

కర్ణుని అనంతరం శల్యుడు సర్వ సేనాపతిగా నడిపాడు, నేలకూలాడు. సేన సర్వం నాశనమయింది.

దుర్యోధనుడు పలాయనం పఠించి, కురుక్షేత్రం పొలిమేరలలో సరోవరంలో దాక్కున్నాడు.

ఆ సంగతి తెలిసిన పాండవులు అక్కడకు చేరి, దుర్యోధనుని అభిమానం రెచ్చగొట్టి పైకి రప్పించి, ద్వంద్వయుద్ధానికి ఆహ్వానించారు.

ఆ గదాయుద్ధంలో భీముడు దుర్యోధనుని తొడలు విరగగొట్టి నేలకూల్చాడు.

ఈ సన్నివేశంలో దుర్యోధనుడు గదాయుద్ధ ధర్మం లేవనెత్తగా కృష్ణుడు కర్ణుని కిచ్చిన సమాధానమే యిచ్చాడు.

* * *

దుర్యోధనుడు ప్రాణావసాన దశలో వున్నాడు.

పాండవులు వెనుదిరిగి తమ శిబిరాలకు నడుస్తూంటే కృష్ణుడు వారిని నదీ తీరానికి నడిపించాడు.

అప్పుడు ధర్మరాజు : వాసుదేవా! ఇప్పుడు నువ్వు హుటాహుటి హస్తినాపురం వెళ్ళి మా పెదతల్లి గాంధారికి ఆగ్రహం రాకుండా ఓదార్చి రావాలి. ఆ పతివ్రతా శిరోమణి ఒక్క పరుషవాక్యంతో మా అయిదుగురినీ యమసదనం చేర్చగలదు, అన్నాడు.

శ్రీ కృష్ణుడు హుటాహుటీ తన రథంమీద హస్తినాపురం చేరి ధృతరాష్ట్రుని పలకరించి, గాంధారిని సమీపించాడు.

ఆవిడ పుత్రశోకంతో విచారిస్తున్నది.

శ్రీకృష్ణుడు : అత్తా! దేనికి విచారిస్తావు. ఈ విపత్తు రాకుండా చెయ్యాలని నువ్వు బోధించావు, మీ వంశవృద్ధులు భీష్ములు, గురువులు ద్రోణులు, నేను, మహర్షులు చెప్పినా వాని చెవికెక్కలేదు; అయిపోయిందంతా. రాజమాతవు, కన్న సంతానం అందరూ రణరంగంలో విరోచితంగా పోరాడి వీరస్వర్గం చేరారు. ఇంతకంటె వీరమాతకు ఏం

కావాలమ్మా! పుట్టిన ప్రాణి గిట్టకతప్పదు. అందుకోసం విచారించడం వివేకం కలవారు చెయ్యవలసిన పనికాదు కన్నీరు వొత్తుకో! పెద్దదానివి. నీకు చెప్పతగిన వారం కాము అనంతరం కర్తవ్యం ఆలోచించు.

గాంధారి : నిజమేనయ్యా! కాని నూరుగురు బిడ్డలు ఒక్కడూ మిగలలేదు. ఎంత రాజమాతనయినా నేనూ కన్నతల్లిని పుత్రశోకం నా గుండెను సుడులు తిప్పుతున్నది.

కొంతసేపు ఆవిడతో అశ్వాసన ప్రసంగం సాగించి, తిరిగి పాండవులను సమీపించాడు.

* * *

అశ్వత్థామ దుర్యోధనుని చేరి సర్వ సైన్యాధిపతిగా అభిషిక్తుడై, పరమశివుని ఉపాసించి, అర్ధరాత్రిలో పాండవ శిబిరాలు ప్రవేశించి ధృష్టద్యుమ్నుని చిత్రవధ చేసి, ఉపపాండవులను సంహరించి, మిగిలిన యోధులను కడతేర్చి, ఆ విషయం దుర్యోధనునికి చెప్పి అడవులలోకి వెళ్ళిపోయాడు. ఆ మాటలు విని దుర్యోధనుడు అంతిమశ్వాస విడిచాడు, తృప్తిగా.

* * *

తెల్లవారుతూండగా అశ్వత్థామ చేసిన అమానుష సంహార కాండ ద్రౌపదీదేవి చెవిని బడింది. ఆవిడ గోలు గోలున విలపిస్తూ తన బిడ్డలను చంపిన అశ్వత్థామను సంహరించే వరకూ తన శోకం చల్లారదని భీమసేనుని పంపింది.

అప్పటికే వాసుదేవుడు ఆ రహస్యం గ్రహించి, అర్జునుని వెంటబెట్టుకుని వెళ్ళాడు.

సుదూరాన అశ్వత్థామ ఒక చెట్టునీడలో తపోదీక్షలో వున్నాడు. భీమసేనుని చూస్తూనే నారాయణాస్త్రం సంధించాడు.

అది గ్రహించి కృష్ణుడు అర్జునునిచేత ప్రత్యస్త్రంగా అదే శక్తిని విడిపించాడు.

అప్పుడు అశ్వత్థామ “అపాండవం” కావాలని విడిచిన అస్త్రం ఉత్తరా గర్భస్థ శిశువును సంహరించడానికి వెడుతూంటే, సుదర్శనంతో ఆ శిశువును రక్షించాడు. రక్షితుడైన ఆ శిశువే పరీక్షిత్తుగా రాజ్యపాలన చేస్తాడు. అది భారతం చివరి కథ.

ఈ సందర్భంలోనే మరొక అద్భుత సన్నివేశాన్ని స్మరించుకోవాలి.

యుద్ధం పూర్తి కాగానే, కృష్ణుడు : అర్జునా! రథం దిగు, అని తన ప్రక్కగా నిలబెట్టుకున్నాడు.

ఆ క్షణంలో రథం భస్మమైంది.

అర్జునుడు తెల్లబోయి చూస్తున్నాడు.

అర్జునా! భీష్మ, ద్రోణులు విడిచిన అస్త్రాలను రథం మీద నిరోధించాను ఇంతవరకూ.

ఆ దివ్యాస్త్రాలను విడిచెయ్యాలి. వాటి శక్తికి రథం బూడిద అయ్యింది, అన్నాడు కృష్ణుడు.

అర్జునుడు ఆశ్చర్యంగా రెండు చేతులూ జోడించాడు.

❋ ❋ ❋

అనంతరం కృష్ణుని వెంటబెట్టుకుని పాండవులయిదుగురూ ధృతరాష్ట్రుని చేరి ఆయన పాదాలమీద పడ్డారు.

అప్పుడాయన : నాయనా! మహాబలిష్ఠుడయిన భీమసేనుని సాహసం నాకెంతో ఆనందం కలిగించింది. వానిని గాఢంగా కౌగలించుకోవాలని వుంది. దగ్గరగా రా భీమసేనా? అనగానే అమాయకంగా భీముడు కదులుతూంటే, కృష్ణుడు వానిని ఆపి అంతక్రితమే తయారు చేయించిన భీముని ఇనప విగ్రహాన్ని ఆయన దగ్గరకు చేర్పించాడు.

ధృతరాష్ట్రుని గాఢాలింగనంలో ఆ ఉక్కుబొమ్మ తునాతునకలయింది.

ధృతరాష్ట్రుడు అట్టహాసం చేస్తూంటే,

కృష్ణుడు : మామా! నీ మనసు తెలిసి ఇనప విగ్రహాన్ని నీ ముందుంచాను. నీ బలశక్తులు నే నెరుగుదును. నువ్వు పిప్పి చేసింది ఆ ఉక్కు బొమ్మను. ఇప్పుడు భీమసేనునితో పాండవులయిదుగురినీ సంహరించినా నీ బిడ్డలలో ఒక్కడయినా బ్రతికి వస్తాడా! అని మందలించాడు.

గాంధారి

ధర్మరాజు వినయంగా చేతులు జోడించి వెళ్ళి గాంధారి పాదాలమీద పడి :

మహారాణీ! వంశ నాశనానికి తలపడిన పాపిని నేను; నన్ను శపించు, బహిష్కరించు, నిందించు, అంటూంటే, భీమసేనుడు వచ్చి:

అమ్మా! నీ కొడుకు లందరినీ సంహరించిన మహాపాపిని నేను. నన్ను దండించు, శపించు, అన్నాడు.

ఆవేదనాభరమైన హృదయాన్ని చిక్కబట్టుకుని ఆ పతివ్రతామతల్లి : నాయనా! నేను పెద్దదాన్ని, ఎలానో ఓదార్పు పొందుతాను. మా కోడలు ద్రౌపది పుత్రశోకంతో వున్నది. వెళ్ళి ఆ బిడ్డను చూసుకోండి, అని పంపుతూ,

దేవకీనందనా? ఒక్క క్షణం ఆగవయ్యా, కొంచెం మాట్లాడాలి అంది.

అంతక్రితమే వ్యాసులవారు వచ్చి :

అమ్మాయీ, కురుక్షేత్రంలో నేలకూలినవారందరినీ చూడడానికి వెడతావా? అని అడిగాడు.

మహామునీ! పెళ్ళిపీటలమీద కూర్చుంటూ పాతివ్రత్యదీక్షతో రెండు కళ్ళకూ గంతలు

కట్టుకుని నేటివరకూ అలానే గడిపాను. జీవితం చరమదశలో ఆ నియమానికి భంగం రానివ్వాలని లేదు. ఈ వస్త్రం యిలా వుండగానే సంగ్రామ రంగాన్ని చూసే అవకాశం కల్పించండి, అంది గాంధారి.

యుద్ధ ప్రారంభవేళ సంజయునికి ఆయన అనుగ్రహించిన శక్తి గాంధారికి తెలుసు కనకనే ఆ కోరిక కోరింది.

ఆయన అనుగ్రహించి వెళ్ళాడు; ఆయనను సాగనంపి శ్రీకృష్ణుడు వచ్చాడు.

గాంధారి గంభీరంగా : సావధానంగా కూర్చోవయ్యా, ఈ పద్దెనిమిది రోజులూ సాగిన సంగ్రామ విశేషాలు చూపిస్తాను, అంది.

మాట్లాడకుండా కూర్చున్నాడు వాసుదేవుడు.

యుద్ధ మధ్యంలో పార్థసారథిగా నిలబడి అతిరథులు, మహారథులు, పద్దెనిమిది అక్షౌహిణీల యోధులు వీరస్వర్గానికి వెడుతూంటే సాక్షిగా నిలిచిన వాసుదేవుడికి చెపుతున్నది.

అంతఃపురంలో కళ్ళకు గంతలు కట్టుకు కూర్చున్న నూరేళ్ళు పై బడన సాధ్వీమణి.

నిశ్శబ్దంగా వింటున్నాడు, సర్వగాథనూ నడిపిన కృష్ణుడు.

గాంధారి : చూడవయ్యా, ఒక్కసారి దృష్టి సారించి.

ఎవరయ్యా, కురుక్షేత్ర రణరంగానికి ఆవలి హద్దున సరోవరం గట్టుమీద ముళ్ళకంచెలమీద బండరాళ్ళ పానుపుమీద తలవుంచి శయనిస్తున్నవాడు, కనిపిస్తున్నాడా తొడలు విరిగి పడివున్నాడు.

ఎరుగుదువా ఎవరో!

ఒకనాడు ఈ దేశంలోని చక్రవర్తు లందరూ నవరత్న ఖచితమైన బంగారు కిరీటాలతో ఆ పాదాలకు నమస్కరించడం ఎరుగుదును.

అంతఃపురంలో హంసతూలికా తల్పంమీద అలవోకగా శయనించి, చిరునవ్వుతో చిటికెలు వేస్తూ.... నవయౌవనాంగుల నాట్యాలూ, మృదుమధుర గళాలతో పాడే గీతాలూ వింటూ సుఖంగా నిద్రించే బిడ్డ!

ఈనాడు కుక్కల, నక్కల అరుపులు సంగీతం!

రాళ్ళు, ముళ్ళ కంపలు హంసతూలికా తల్పం!

ఏ జన్మలో చేసిన పాపఫలం అనుభవించడానికో యింకా బ్రతికి వున్నాను.

నల్లమబ్బుల మధ్య మెరుపు తీగలా కనిపించే ఆ యువకుని చూడు.

వాసుదేవా, చూడవయ్యా! నా బిడ్డ వికర్ణుని శరీరం మీద రాబందు వ్రాలి మొనదేలిన ముక్కుతో ఆ మణికట్టుమీద పొడుస్తుంటే దాని ముక్కు వంగుతున్నదే కాని చేతిలో దిగడం లేదు. చిన్ననాటి నుండీ వ్యాయామంతో, ధనుర్విద్యా సాధనతో ఉక్కులా తయారయిన శరీరం అది.

కన్నులు మరికాస్త దూరానికి నడిపి చూడు, కనిపిస్తున్నదా, చంద్రబింబంలా ఎలా వెలుగుతున్నదో ఆ వదనం!

ఏవరయ్యా, ఆ వీరుడు?

ఎవనిమీద నా బిడ్డ ఆశలు పెంచుకుని, ఏ మహాయోధుని వీరత్వం అండగా రణరంగానికి దిగాడో ఆ వీరుడు కర్ణుడు. పరశురాముని శిష్యుడు, నేలకూలి మూడురోజులైనా యింకా ఎలా వెలుగుతున్నదో వాని వదనార విందం!

నడపవయ్యా, నీ దృష్టిని... ...

కనిపిస్తున్నాయా! కుక్కలూ నక్కలూ పీక్కుతింటున్న పాదాలు ... ...

ఎవరివయ్యా, ఆ పాదాలు!

ఈనాడు ప్రపంచంలో కత్తిపట్టగల యోధుడెవడైనా సరే, ధనుస్సు సంధించగల శూరు డెవడైనా ఆ కాళ్ళు కడిగి నీళ్ళు నెత్తిమీద చల్లుకుని సాష్టాంగ ప్రణామం చెయ్యాలయ్యా. ఆ పవిత్ర పాదాలను కుక్కలూ, నక్కలూ నిర్దాక్షిణ్యంగా పీక్కుతింటున్నాయి. ఎవరాయన? ధనురాచార్యులు ద్రోణాచార్యుల వారు.

దేవేంద్రుడూ, పరశురాముడూ సాధించిన అస్త్రవిద్య అంతా ఆయన అరచేతిలో వున్నదయ్యా. కురు పాండవులే కాదు మీ తమ్ముడు సాత్యకి కూడా ఆయన దగ్గర చేతులు జోడించి నిలబడిన శిష్యుడే.

ఆయన యిల్లాలు కన్నీరు మున్నీరుగా శోకిస్తూ వినిపించే విలాపగీతమే సామగానం అవుతున్నది, చూస్తున్నావా! మిగిలిన శిష్యులందరూ ఆచార్యులవారి ధనుస్సునూ, బాణాలనూ, రథాన్నీ చితిగా పేరుస్తున్నారు.

అస్త్రవిద్య అస్తమించిందయ్యా ఆయనతో.

సహదేవుని చేతులలో నేలకూలిన మా సోదరుడు శకునివాడు, వాడివల్లనయ్యా యింత మారణహోమం సాగింది.

చెప్పాను మా దుర్యోధనుడికి, నాయనా ఈ వంచకుని విడిచి విద్వాంసుల మాటలు చెవి కెక్కించుకోమని. ఎవరెన్ని చెప్పినా వాడి చెవిని పట్టదు, మృత్యువు నెత్తిమీద తాండవిస్తుంటే మరో మాట వినిపించదు.

మా వంశవృద్ధులు బాహ్లికులవారు కనిపించారా, అంత వయసు పండి నేలకు రాలినా యింకా శరత్పూర్ణిమాచంద్రబింబంలా వున్నదాయన ముఖం.

ఇటు చూడు సోమదత్త, భూరిశ్రవసులు....

ఈ ప్రక్క యీయన ఎవరయ్యా, నకుల సహదేవుల కన్నతల్లి మాద్రి తోడబుట్టినవాడు శల్యుడు. పైకి జారివున్న వాని నాలుకను కాకులు పొడుచుకు తినడం చూస్తున్నావా?

మరి కొంచెం ముందుకు చూస్తూ, సావధానంగా విను.... వినిపిస్తున్నదా, గోలుగోలున ఏడుస్తూ, జుట్టు విరబోసుకుని పీనుగు పెంటల మధ్య పిచ్చిదానిలా తిరుగుతున్న బిడ్డ....

ఏమంటున్నదయ్యా! తోడబుట్టినదాని నుదుట పసుపు కుంకుమలు చెరిపే అన్యాయానికి ఒడిగట్టే ధర్మాత్ములనుకోలేదురా, ఈ దుర్దశ నాకు కల్పించి సంతోషిస్తున్నారా అన్నయ్యా!

నా భర్తశిరసు కూడా కనిపించకుండా చేశారా, అని గుండెలు బ్రద్దలయ్యేలా ఎలా ఏడుస్తున్నదో, ఏవిటంటున్నది....

కనులు విస్ఫారించి చూడవయ్యా, రథక్రీడలో శక్తి అంతా ప్రదర్శించి అలసటతో విశ్రాంతిగా నిద్రపోతున్నట్టు లేదు.

వినవయ్యా, ఆ బిడ్డ శోకాలాపం, గుండెతరుక్కుపోతున్నది కృష్ణా!

పరమశివుని నిలబెట్టి పాశుపతం సాధించిన సవ్యసాచి కుమారుడవు, గదాదండంతో నిఖిల శత్రుగణాలనూ నిర్జించగల వాయునందనుడు పెదతండ్రి, జగన్నాటక సూత్రధారి మేనల్లుడివి, నిన్ను వేలకూల్చిన వారెవరయ్యా?

ధనురాచార్యులు, కృపాచార్యులు, అశ్వత్థామ, కర్ణుడు, దుర్యోధన, దుశ్శాసనులు... వారు మహాయోధులనీ, రణరంగంలో పరాక్రమం ప్రదర్శించి శత్రుసంహారం సాగిస్తారని విన్నాను కాని యిలా అధర్మానికి దిగి, ఒక యువకుని చుట్టుముడతారని ఎవరనుకున్నారు?

ఏమైతేనేం నా సౌభాగ్యం గంగపాలయింది. ఈ భూమండలం అంతా లభించినా, మీ పెద్దలు, సుఖంగా దీన్ని పాలించగలరా, ఎవరికోసం దీన్ని రక్షిస్తారు?.....

కృష్ణా, చూశావా! నిన్న మొన్నటిదాకా సిగ్గుతో చెలికత్తెల చాటున తిరిగే బిడ్డ యీనాడు వల్లకాడుకంటే అధ్వాన్నంగా వున్న ఈ సంగ్రామ భూమిలో శవాల మధ్యపడి....

ఇంక చాలునయ్యా!

ఇటు తిరిగి చూడు వాసుదేవా!

భూమికి దిగి వచ్చిన బ్రహ్మచర్యం, పరశురాములను పరాభూతులను చేసిన అస్త్ర తేజం, అచంచల ధర్మదీక్ష, నిశ్చల సత్యనిష్ఠ... ...

ఎవరు కృష్ణా ఆ పండు ముసలివీరుడు?

పదిరోజులు సేనాధిపత్యం సాగించి, అలసట లేకుండా లక్షల వీరులను రణక్రీడలో యమసదనం చేర్చిన గంగానందనులు, మా వంశాభ్యుదయం కోసం రక్తమాంసాలు ధారపోసి పండిపోయాడయ్యా!

సత్యభామ వల్లభా! ఎరుగుదువుగా, అప్పటి కింకా మీసకట్టు నల్లబడలేదయ్యా, ఆ వయసులో... కన్న తండ్రి సుఖం కోసం తాను బ్రహ్మచర్య దీక్ష వహించి, ఈ వంశాన్ని

నిలబెట్టడానికి దాశరాజపుత్రి సత్యవతీదేవిని తెచ్చి తండ్రికి పెళ్ళి చేయించి నిశ్చింతగా అంతర్ముఖుడై గడిపిన నూరు, నూటపాతికేళ్ళలో కన్నెపిల్లకై కన్నుతిప్పలేదు, రాజభోగాలకోసం మనసు పడలేదు. ఆయన ఏ దశలో వున్నాడు?

చూడవయ్యా, ఎవరయ్యా ఈ పీనుగుల మధ్య రక్తమాంసాల ప్రవాహాలు దాటుతూ ఏడుస్తూ వెడుతున్నారు.

మంచిగంధపు నీరు జల్లిన నేలమీద తప్ప అడుగుపెట్టని నా యింటి కోడళ్ళు, ఏనాడూ అంతఃపురం దాటి అడుగు కదపని నా కోడళ్ళు యీనాడు నడివీధిని పడి రొమ్ములు బాదుకుంటూ, జుట్లు విరబోసుకుని యీ రక్తమే పన్నీరుగా, మాంసపు బురద మంచి గంధంగా పూసుకుంటున్నారు.

దేవకీ నందనా! గుండెమీద చేతులుంచి చెప్పు....మనస్ఫూర్తిగా సంకల్పించి వుంటే యీ కుటుంబకలహాన్ని ఆపి యుద్ధం జరగకుండా చేసే శక్తి లేదటయ్యా నీకు!

కావాలని రెచ్చగొట్టి యింత చేసిన పాపానికి ప్రాయశ్చిత్తంగా మీ యదువంశీయు లందరూ కుటుంబ కలహంతో నాశనమౌతారు, పో... అని తల దించుకుంది.

వాసుదేవుడు మందహాసంతో : మహారాణీ! ఎందుకంత ఆవేశం, ఈనాటి వరకూ ఎవరినీ పల్లెత్తి పరుషంగా ఒక్కమాట కూడా అననిదానివి, పుత్రశోకంతో ఆగ్రహానికి లొంగి గాంధారి కూడా సామాన్య స్త్రీవలె పరుషంగా మాట్లాడిందనే అపఖ్యాతి నీకు కలుగుతుందని బాధపడుతున్నాను.

మా యదువంశానికి దుర్వాసుని శాపం ఉండనే ఉన్నది, ముసలంపట్టి, కుటుంబ కలహంతో కొట్టుకు నాశనమవుతామని అదేమాట నువ్వూ అన్నావు.

మీ వంశం నాశనం కానూ – అని శపించినా చిరునవ్వు చెక్కు చెదరనివ్వకుండా కార్యాన్ని సాధించుకునే రాజనీతిని నేర్పిన సన్నివేశం యిది.

అంతగా దూషించినా మందహాసంతో మాట్లాడే వాసుదేవునిపై ఆగ్రహం తగ్గక!

కృష్ణా! నీ వాక్చాతుర్యంతో యింత చేశావు కనక నీకు దిక్కులేని చావు ప్రాప్తిస్తుంది, పోవయ్యా, అనగా వాసుదేవుడు మందహాసంతో నిష్క్రమించాడు.

రాజకీయాలలో దిగేవారు సన్మానాలకు పొంగకుండా, అవమానాలకు క్రుంగకుండా చిరునవ్వుతో సాగుతూంటే నిస్సంకోచంగా తమ పని తాము పూర్తి చేసుకోగలుతారనే పాఠాన్ని యింతకంటె నేర్పే మార్గం లేదు.

* * *

రణరంగంలో మరణించిన రాజవంశీయులందరికీ పాండవులే దహనసంస్కారాలు చేశారు. మిగిలినవారికి విదురుడూ, సంజయుడూ అగ్ని సంస్కారం జరిపాడు.

ధర్మరాజు ధర్మోదకా లివ్వడానికి దోసిలిలో నీళ్ళు పోసుకున్నాడు. మేలిముసుగు సవరించుకుంటూ కుంతీదేవి చక చకా వచ్చి :

నాయనా! తిలోదకాలు ముందుగా కర్ణుడికి విడవాలి, అంది.

క్షణకాలం నివ్వెరబోయి, గుండె దడ దడ లాడుతుంటే ధర్మరాజు :

అమ్మా, ఏవిటంటున్నావ్, కర్ణుడికి నేను తిలోదకాలు వదలాలా?

కుంతి : ఔను నాయనా, నీ కన్నా ముందు నా గర్భాన వాడు పడ్డాడు.

ధర్మ : అమ్మా!

కుంతీ : ఔనయ్యా, వాడు నీ అన్నగారు.

ధర్మ : ఈ మాట పద్దెనిమిది రోజుల క్రితం చెప్పివుంటే యిప్పుడిలా తిలోదకా లివ్వడం దేనికమ్మా, నవరత్న ఖచిత సువర్ణ పీఠంమీద కూర్చోబెట్టి, గంగా, గౌతమీ జలాలలో అభిషేకం జరిపి మాణిక్యకాంతు లీనే కిరీటం పెట్టేవారం కాదుటమ్మా.

కుంతి : పద్దెనిమిది రోజుల క్రితం కాదు నాయనా, నెలరోజుల క్రితం చెప్పాను, వాడితో. కాని వాడి నుదుట బ్రహ్మదేవుడు తిలోదకాల యోగమే రాసి పడేశాడు. ఎవరి విధిని ఎవరు తప్పించగలరు! త్వరగా కర్మకాండ ముగించండి.

గురుత్వం

ధర్మరాజు సింహాసనం అధివసించి, కొన్నాళ్ళు పాలించాక ఒకనాడు :

కృష్ణా! రక్తబంధువులను, గురువులను, స్నేహితులను సంహరించిన పాపిని, పశ్చాత్తాపంతో నా గుండె ఉడుకుతున్నది. రాజ్యం విడిచి అరణ్యానికి పోయి తపస్సుతో తనువు చాలించాలని ఉంది.

కృష్ణుడు : ధర్మనందనా! ఎంత అవివేకం, ఇదంతా నీ తెలివి అనుకుంటున్నావా! సరే,ఒక్కమారు మీ తాతగారిని చూసి వెళ్ళవచ్చు. రేపు ఆయన దర్శనం చేసుకుందాం.

మరునాడు పాండవులతో కృష్ణుడు భీష్ముని సమీపించాడు. అందరూ ఆయనకు పాదాభివాదం చేసి తలవంచుకు నిలబడ్డారు!

కృష్ణ : మీ మనవడికి రాజధర్మం, మానవనీతి బోధించి మీ వంశమర్యాదలు బోధించండి.

భీష్ముడు చిరునవ్వు నవ్వి : కృష్ణా! ఎందుకయ్యా ఈ వయసులో అంపశయ్య మీద వున్న నాతో పరిహాసం ఆడుతున్నావు?

కృష్ణ : తాతా, ఇందులో పరిహాసం ఏమున్నదయ్యా?

భీష్మ : జగద్గురువైన నీ సమక్షంలో నేను ధర్మబోధ చెయ్యడం అపహాస్యం కాదుటయ్యా!

కృష్ణ : తాతా, నేను జగద్గురువునే. కాని నా బోధలు వీరికి వంటబట్టవు. పాఠం

చెప్పడానికి కావలసిన జీవితానుభవం నీకు వున్నది. శాస్త్ర జ్ఞానంలో మనకు భేదం లేదు. జీవితంలో లోకానుభవం నీ కంటె ఎవరికున్నది! శాస్త్రజ్ఞానంతో లోకానుభవాన్ని, కాలాన్నీ మేళవించి చెప్పగలవాడే గురుపీఠం అధివసించాలి.

భీష్మ : నీ ఆదేశానుసారం బోధిస్తాను! అయితే ఎక్కడయినా నేను పొరబడితే సవరిస్తూండాలి.

❊ ❊ ❊

ఈ సన్నివేశాన్ని కొంచెం మనసుపెట్టి చూడగలిగితే గురుపీఠం యొక్క విశిష్టత బోధపడుతుంది.

జగద్గురువైన కృష్ణుడంతటివాడు భీష్ముని ముందు నిలబడి –

ప్రపంచంలో ప్రతి వ్యక్తికీ గురుస్థానం యివ్వకూడదనీ, శాస్త్రజ్ఞానానికి లోకానుభవం జోడించి, తల పండినవాడే పాఠం చెప్పాలి. తల పండేసరికి ఉద్యోగం తీసేసి విశ్రాంతికి పంపే వ్యవస్థ ఈనాడు తాండవించడం వల్లనే విద్యారంగం యింత అధ్వాన్నంగా తయారయింది.

చదివినదాన్ని కక్కడం కాదు గురువు చేయవలసింది, దానిని జీర్ణించుకుని, వంటబట్టిన దానిని మననం చేసుకుంటూ, దానిని తన అనుభవాన్ని కలిపి, నిస్వార్థంగా బోధించగల ఉపాధ్యాయులు ఈ జాతికి స్వతంత్రం సిద్ధించేవరకూ వుండేవారు. అంతకు ముందు గురుకుల వ్యవస్థ అవిచ్ఛిన్నంగా సాగింది.

ఈనాడు చదువు కొనుక్కునే దశ ఏర్పడింది.

సంతలో దొరికే చింతపండు, ఉల్లిపాయలూ కాదే విద్య. మనస్సును వికసింపజేస్తూ, బుద్ధిని సక్రమంగా నడుపుతూ, నీతినీ, శీలాన్నీ అలవరిచే విద్యావేత్తలు పాఠశాలల్లో చేరే మంచి రోజులు రావాలంటే విద్యారంగాన్ని స్వార్థపరుల హస్తాలనుండి తప్పించుకునే ప్రయత్నం తీవ్రంగా సాగే ఉద్యమం లేవాలి.

అదీ భారతం నేర్పిన పాఠం.

❊ ❊ ❊

అనంతరం భీష్మ పితామహుని నోట వెలువడిన ప్రబోధం శాంతి, అనుశాసన పర్వాలుగా అందింది.

ఈ రెండు పర్వాలలో ఆయన చేసిన ప్రబోధం గ్రహిస్తే–

తల్లి గర్భనుండి నేలమీదపడి కెవ్వుమని ఏడిచింది మొదలు, కాటిమీద పెట్టి మనచుట్టూ వున్న వారందరూ గోలు గోలున ఏడిచే వరకూ మానవుడైనవాడు అడుగుతీసి అడుగు ఎలా వెయ్యాలో, పెదవి కదిపి ఎలా మాట్లాడాలో, ఎలా నడుచుకోవాలో తెలుస్తుంది. మానవత్వానికి

పరిపూర్ణత సిద్ధించి, తల్లితో తండ్రితో గురువుతో స్నేహితులతో శత్రువులతో భార్యతో బిడ్డలతో ఎవరితో ఎలా ప్రవర్తించాలో అవగాహన అవుతుంది.

అందుకోసం భారతం చదవండి, అందుకే భారతం పంచమ వేదం.

వ్యాసమునీంద్ర సాంద్ర కరుణాతిశయంబున లభించిన విజ్ఞాన సర్వస్వం నిత్యం చదవండి.

ఉషశ్రీ ముద్రిత రచనలు

భారతం
రామాయణం
భాగవతం
సుందరకాండ
భగవద్గీత
ఉషశ్రీ ఉపన్యాసాలు
భారతంలో చిన్న కథలు
ధర్మ సందేహాలు
ఎవరు ఎలా మాట్లాడతారు?
(భారతంలో రాయబారాలు)
ఎవరితో ఎలా మాట్లాడాలి ?
(రామాయణంలో హనుమంతుడు)
వివేకానందం

పెళ్ళికొడుకులు (నాటకం)
రాగ హృదయం (నృత్యనాటిక)
వేంకటేశ్వర కళ్యాణం (యక్షగానం)
మల్లెపందిరి (సాంఘిక కథలు)
పెళ్ళాడే బొమ్మా (నవలా లేఖావళి)
జ్వలిత జ్వాల (నవలికలు)
అమృత కలశం (పౌరాణిక కథలు)
ప్రేయసీ ప్రియంవద (నవల)
సంతృప్తులు (నవల)
తరాలు – అంతరాలు (నవల)
కళాపూర్ణోదయం
మనుచరిత్ర.

ఉషశ్రీ మిషన్

రామాయణ భారతాలు అందించే మానవత్వపు విలువలూ, సంస్కృతీ వైభవాలూ యువతరానికి తెలియజేయాలనే ఉషశ్రీ ఆకాంక్షే లక్ష్యంగా వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ప్రారంభమైంది ఉషశ్రీ మిషన్

మిషన్ కార్యక్రమాలు :

- ఉషశ్రీ పుస్తకాలు ప్రచురించడం
- ఉషశ్రీ రామాయణ భారత ఉపన్యాసాలు సి.డి.లు, శ్రోతలకి అందించడం
- ushasri.org నిర్వహించడం.
- పాఠశాల, కళాశాలల విద్యార్థులకి రామాయణ భారతాలు అంశాలుగా వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించి, మన మహేతిహాసాల పట్ల వారిలో అవగాహన పెంచడం.
- భారతీయ సంస్కృతి, సాహిత్య రంగాలలో కృషి చేస్తున్న వారిలో ఏటా ఒకరిని 'ఉషశ్రీ సంస్కృతి సత్కారం'తో గౌరవించడం.

వెయ్యి మందిలో ఒకడు కవి కాగలిగితే లక్ష మందిలో ఒకడు వక్త కాగలుగుతాడని వెనకటికి ఒక సూక్తి. విభిన్నమయిన రుచులూ, అభిరుచులూ, వయస్సులూ గల శ్రోతలను ఆకట్టుకొని తాను చెప్పదలుచుకున్న విషయాన్ని స్పష్టంగా, ప్రణాళికా బద్ధంగా ఆశువు అల్లుకుంటూ, విసుగనిపించకుండా ఆవిష్కరించగలగడం సామాన్యమయిన విషయం కాదు. ఈ శక్తి కలిగి ఉపన్యాసాన్ని ఒక కళగా రూపొందించి తన రామాయణ మహాభారతోపన్యాసాలతో యావదాంధ్రదేశాన్నీ ఉర్రూతలూగించిన ఉపన్యాసకేసరి ఉషశ్రీ. వీరి ఉపన్యాస అనుకరణం పందిళ్ళలో అనివార్యం.

ఉషశ్రీ ఉపన్యాసాలకి ఒక ప్రత్యేకమయిన శైలి వుంది. ఆ ఊనికలనూ విరుపులనూ ఊహించుకుంటూ చదవడం మొదలు పెడితే మొత్తం ఈ పుస్తకాన్ని నలభై అయిదు నిమిషాలలో పూర్తి చెయ్యవచ్చు. అలా పరిగెత్తించే చేవగల వచనం ఇది.

ఇందులో రెండు కురుక్షేత్రాలు ఉన్నాయి - ఒకటి మహాభారతం కురుక్షేత్రం, రెండోది హేతువాదులతో ఉషశ్రీ గారు పెట్టుకున్న కురుక్షేత్రం. ఇది చాలా దూకుడుగా సాగింది.

ఎవరో చెప్పిన దానిని నమ్మి రామాయణ భారతాలు పనికిమాలిన గ్రంథాలు అని నిరసించే హేతువాదులనూ, అవి పరమ పవిత్రమయిన మతగ్రంథాలు అని గుడ్డిగా ఆరాధించే చాందసులను ఇద్దరినీ సమానంగా నిందించి, ఈ రామాయణ భారతాలు మానవజాతి సర్వకాలాలలోనూ సుఖశాంతులతో మనుగడ సాధించడానికి అవసరమయిన విశేషాలను అందించే గ్రంథాలు మాత్రమే అనీ, అందుచేతనే ఇవి ఇన్నివేల సంవత్సరాలు జీవించగలిగాయనీ ఉషశ్రీ ప్రతిపాదించారు. ఇది నిజం.

ఉషశ్రీ ఉపన్యాసాలను అలా గాలిలో కలిసిపోనివ్వకుండా వాటికి అక్షరాకృతి ఇచ్చి ప్రజలు మననం చేసుకునే వీలు కల్పించడం ముదావహం.

– ఆచార్య బేతవోలు రామబ్రహ్మం